# శ్రీ శ్రీ శ్రీ నాంపల్లిబాబా గారి దివ్యలీలలు



శ్రీ సద్గురు నాంపల్లిబాబా సమాధి మందిరము

శ్రీ ధర్మపురి క్షేత్రం, దీప్తిశ్రీనగర్, మియాపూర్ పోస్టు

ఆర్. ఆర్. జిల్లా, హైదరాబాద్ - 500 049,

శ్రీ నాంపల్లిబాబా గారి దివ్యలీలలు
మొదటి ముద్రణ - 2010
ప్రతులు - 4000

అంకితము : శ్రీ భరద్వాజ మాస్టారుగారి పాదపద్మములకు

ప్రాప్తిస్థానము (కాపీల కొరకు) :
1. శ్రీ సాయి మాస్టరు సేవాట్రస్టు
గొలగమూడి
నెల్లూరు జిల్లా - 524 321
మరియు
2. శ్రీ నాంపల్లిబాబా సమాధి మందిరము,
హైదరాబాద్ - 500 049

Please visit www.saimastersevatrust.org

## నాంపల్లిబాబా సమాధి మందిరమునకు దారి



ఈ బాబా ఎవరో? ఎక్కడివారో ఎవరికీ తెలియదు. 1945లో ఒక స్మశానంలో మలక్‌పేట రైల్వేస్టేషన్ దగ్గర వారిని కనుగొన్నారు. ఆయన మౌనముద్రలోనే ఆత్మానుభూతిని అనుభవిస్తూ ఎవరితో మాట్లాడేవారు కాదు. అప్పుడప్పుడూ ఒక నీటి కుళాయి దగ్గర తన శరీరాన్ని తడుపుకుంటూ కన్పించేవారు. స్మశానంలో ఒక చిన్న ఎత్తుపాటి గోడపై పరుండి తనలో తాను మాట్లాడుకుంటూ, గొణుగుతూ, మరోసారి ఆకాశం వైపు చూస్తూ బిగ్గరగా నవ్వుతూ సైగలు చేసేవారు. అప్పటికే చుట్టుప్రక్కల వాళ్ళు ఆయనను అవధూతగా గుర్తించారు. స్నానం చేయకపోయినా బాబా దగ్గరనుండి ఓ దివ్య పరిమళం వ్యాపించడం భక్తులను అబ్బురపరిచేది. తమ భక్తిప్రపత్తులతో ఆయనకు వస్త్రాలు, భోజనాలు అందించేవారు. ఆయనెప్పుడూ శరీర స్పృహలో వుండేవారు కాదు. 1972లో శరీరాతీత స్థితిలో వెళుతుండగా ఒక లారీ ఆయన కుడికాలును పూర్తిగా ఛిన్నం చేసింది. అయినా వారికి శరీరస్పృహ లేదు. కాలికి కుట్లు ఉస్మానియా హాస్పిటల్లో వేయించారు భక్తులు. ఆ తర్వాత బాబాగారు కొన్ని సంవత్సరములు కనపడలేదు.

మరలా 1980లో ఆయన నాంపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర వుండడం గమనించారు. అందువలన ఆయనను నాంపల్లిబాబా అనే పేరుతో భక్తులు పిలవసాగారు. ఆయన పేరుకానీ, ఊరుకానీ, తల్లిదండ్రులెవరో, కులగోత్రాదులేమిటో ఎవరికీ తెలియలేదు. నిజానికి దైవం వలెనే ఆయన నామరహితుడు. నాంపల్లిబాబా నిత్య ఏకాకి. ఆయన మాట్లాడుతుండగా ఎవరూ చూడలేదు. ఎప్పుడూ మౌనమే, పూర్తి దిగంబరుడుగా వుండేవారు. ఆయనకై ఆయన ఎక్కడకీ వెళ్ళలేదు. ఎవరినీ డబ్బులు యాచించేవారు కాదు. ఉపన్యాసాలు ఇవ్వలేదు. ప్రజలను ఆశ్చర్యపరిచే చిల్లర మహిమలేవీ ప్రదర్శించలేదు. ప్రశ్నలు చెప్పలేదు. అయినా నానాటికీ నాంపల్లిబాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. మహమ్మదీయులు హజరత్‌గా, హిందువులు అవధూతగా భావించి ఆయా భక్తులు ఆయనకు టీ, సిగరెట్లు సమర్పిస్తుండేవారు. నాంపల్లిబాబా శిరిడీ సాయి అవతారమని భక్తులలో ఒక నమ్మకం ఉంది. నాంపల్లిబాబా సిగరెట్లు త్రాగుతూ చివర్లో సిగరెట్టుకున్న నిప్పుని మింగేవారు. ఆయన కడుపులోనే 'ధుని' ఉన్నదని అలా నిప్పుని మ్రింగటం ద్వారా సిగరెట్టు యిచ్చిన భక్తుల కర్మలని నశింపజేసేవారనీ, ఆయన

దర్శనమాత్రం చేత కష్టాలు తొలగిపోతాయని, కోర్కెలు నెరవేరుతాయనీ, శారీరకరుగ్మతలు, బాధలు బాబా తొలగిస్తారని భక్తుల నమ్మకం. ఈ గ్రంథంలో పేర్కొన్న బాబాగారి దివ్యలీలలు భక్తుల నమ్మకానికి తార్కాణం.

**1969 ప్రాంతంలో బాబాను చూసిన రామకృష్ణమూర్తిగారు ఇలా చెపుతున్నారు:** నా సీనియర్ ఒక ముస్లింతో కలసి నేను 1969లో మలక్‌పేట స్మశానవాటికలో మొదటిసారిగా బాబాను దర్శించాను. బాబాను చూడగానే జీసస్‌క్రైస్ట్‌ను తలపించేవారు. ఎప్పుడూ ఆకాశం వైపు చూస్తూండేవారు. ఎప్పుడో కానీ మన లోకంలోకి వచ్చినట్టు కన్పడేవారు కాదు. తెల్లని పొడవు చేతుల చొక్కా, పైజామా ధరించి వుండేవారు. పొడవుగా పెరిగి జడలు కట్టిన జుత్తు వుండేది. అప్పుడప్పుడూ గాజుపెంకుతో జుత్తు కోసేవారు. కట్టుబట్టలతోనే స్నానం చేసేవారు. అందుకే ఎక్కువగా ఎప్పుడూ తడి బట్టలతోనే కన్పించేవారు. ఎండకుగానీ, చలికిగానీ, వానకుగానీ వారు ఏ నీడనూ ఆశ్రయించేవారు కారు. బాబాగారు నడిచినప్పుడు చాలా వేగంగా, తల క్రిందకు వంచుకొని నడిచేవారు. వెంటనడిచేవారు పరిగెత్తవలసి వచ్చేది.

శ్రీ బాబాగారు ఎవరినిబడితే వారిని ఏమీ అడిగేవారు కాదు. ఎవరైనా అంతకు పూర్వం వారి దగ్గరకు వచ్చినవారు కనిపిస్తే ఎంత దూరంలో వున్నాసరే చిన్న అరచేతి చరుపుతో పిలిచేవారు. ఆ శబ్దం ప్రక్కనున్న వారికి కూడా బాగా వినిపించే అవకాశం వుండేదికాదు కానీ ఎవరిని ఉద్దేశించి అలా చరిచారో వారు ఎంత దూరంలో వున్నా సరే వెనుకకు తిరిగి బాబా దగ్గరకు వచ్చేవారు. ఆ భక్తులు ఒక రూపాయి ఇస్తే ఇరానీ హోటల్‌లో టీ త్రాగి, ఒక చార్మినార్ సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె కొనేవారు. బాబాగారు సిగరెట్లు ఎక్కువగా త్రాగేవారు. బాబా సిగరెట్టు త్రాగే విధానం ఈ విధంగా వుండేది. 'సామాన్యంగా ధూమపాన ప్రియులులాగా పొగను లోపలికి పీల్చేవారు కాదు, పొగ వెంటనే వదిలి వేసేవారు. కానీ వచ్చిన ఎర్ర అగ్నిని మాత్రం కొరికి మ్రింగివేసేవారు'.

నేను మొదటసారి బాబాను దర్శించినప్పుడు పాద నమస్కారం చేసుకొని మా ఇంటికి భిక్షకు రమ్మంటే తరువాత వస్తానని చెప్పారు. మూడు రోజుల తర్వాత ఆశ్చర్యం! మేము మా ఇంటి అడ్రస్సు చెప్పకున్నా బాబా మా ఇంటికి భిక్షకు విచ్చేసి మమ్మల్ని ధన్యులను చేశారు. ఇలా

మా ఇంటికి దాదాపు రెండు సంవత్సరాలు రోజూ భిక్షకు వచ్చారు. భోజనం చేసిన తర్వాత చేయి కడుక్కోకుండా వెళ్ళిపోయేవారు. ఒకసారి మా అత్తగారి అజ్ఞానపు మాటలువిని నా భార్య బాబాతో 'అప్పుడప్పుడూ వస్తూ వుండండి' అని చెప్పింది. ఆ రోజు నుంచీ బాబా భిక్షకు రావటం మానేశారు. జరిగిన సంగతి తెలిసి నేను పరుగున వెళ్ళి బాబాను ప్రాధేయపడితే ఆ ఒక్కరోజు భిక్షకు వచ్చారు. తర్వాత నుండీ నేనుకానీ, నా మూడవ అబ్బాయికానీ బాబాకు భిక్ష తీసుకువెళ్ళేవారము.

1972లో యాక్సిడెంటు అయ్యి బాబాను ఉస్మానియా హాస్పిటల్లో చేర్పించినంతవరకు బాబాగారిని నిత్యం దర్శించేవాడిని. 1972 నుండి 1980 వరకూ బాబాగారు కనపడలేదు. మరలా 1980లో నాంపల్లి రైల్వేస్టేషన్ దగ్గరి పోలీసుస్టేషను వరండాలో దర్శించాను.

**మహనీయుల తీర్పు:**

**శ్రీ శివనేశన్‌స్వామి** (శిరిడీ) తనను దర్శించే పి వి కె మీనన్‌గారు హైదరాబాదు వైపు ఎప్పుడు వెళ్ళినా ఒక కొబ్బరికాయ యిచ్చి దానిని నాంపల్లిబాబాకి సమర్పించి, బాబాను దర్శించి వెళ్ళమని చెప్పేవారు. హైదరాబాదు నుండి వచ్చిన సాయిబాబా భక్తులను ఉద్దేశించి '**సాయిబాబా కోసం మీరింత దూరం రానక్కరలేదు. హైదరాబాదులోని శ్రీ శ్రీ శ్రీ నాంపల్లిబాబాగారిని దర్శిస్తే సాయిబాబాను దర్శించినట్లేన**'ని చెప్పేవారు.

**పూజ్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు** ఎంతోమంది సాయిబాబా భక్తులను నాంపల్లిబాబాగారి దర్శనం చేసుకోమని ప్రోత్సహించేవారు. అంతేకాక ఒక డాక్టరు (గోపాల్‌దాసు గారు) మాష్టారుగారిని (హైదరాబాదులో వున్నప్పుడు) కలిసి శిరిడీ వెళుతున్నానంటే మాష్టారుగారు ఆయన్ని దగ్గరుండి నాంపల్లిబాబాగారి దగ్గరకు తీసుకెళ్ళి శిరిడీ సాయిబాబానే ఇక్కడ వున్నారు. తప్పక దర్శనం చేసుకుంటూ వుండండి అని చెప్పారు.

నాంపల్లిబాబా మందిర పూజారి రాజుగారు శిరిడీ నుండి నాంపల్లిబాబా దగ్గరకు వెళ్ళాలా వద్దా అనే విషయమై **శ్రీ దర్గాస్వామి (నీలకంఠరావు పేట, కడవ)**ని అడిగితే '**ఆయన సాక్షాత్తు పరమేశ్వరుడు. ఆయన దగ్గర కెళ్ళి సేవ చేసుకో కృప కలుగుతుంది**'

అని చెప్పారు. ఇదే విషయమై ఒకరోజు రాజుగారు శిరిడీ ద్వారకామాయిలో నింబారు ప్రక్కన నీటి కుండ దగ్గర ధ్యానం చేసుకుంటుంటే ద్వారకామాయి సాయిబాబా ఫొటో నుండి **పంచముఖాలతో ఆంజనేయస్వామి కన్పడి (ముఖం మాత్రం సాయిబాబాదే) 'ఎందుకు భయపడుతున్నావు. వెళ్ళు, నేను చూసుకుంటాను'** అని సందేశం వచ్చింది.

## శ్రీ పెనల సుబ్బరామయ్య, గొలగమూడి

పూజ్యగురుదేవులైన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు తప్పక దర్శించమని నన్ను ప్రోత్సహించిన మహనీయులలో శ్రీ నాంపల్లి బాబా గారు ఒకరు. భగవంతునికి చెప్పబడిన మూడు గుణములు (1) సర్వవ్యాపకత్వము (2) సర్వజ్ఞత్వము (3) సర్వసమర్థత్వము ఈమహనీయునిలో పూర్తిగా ప్రకటనమయినాయి. అందుకు నా స్వానుభవమే తార్కాణము. నేను ఒకప్పుడు హైదరాబాద్ వెళ్ళినాను. అక్కడ ఎమ్.కె.ఆనంద వెంకటేశ్వర్లుగారు నాకు చాలా ముఖ్యమైన స్నేహితుడు. కాని వారు ఎక్కడున్నారో, వారి చిరునామా నాకు తెలియదు. నేను శ్రీ నాంపల్లి బాబా గారిని దర్శించి 'స్వామి! ఈ మహానగరంలో నా స్నేహితుడు ఎమ్.కె.ఆనందవెంకటేశ్వర్లు గారి చిరునామా తెలియదు. నేను అరగంట సేపు మీ సన్నిధిలో కూర్చుంటాను. ఈ అరగంటలో ఆనంద వెంకటేశ్వర్లు గారినైనా ఇక్కడకు రప్పించండి లేకుంటే వారి చిరునామా చెప్పేవారినైనా ఇక్కడకు రప్పించండి' అని చెప్పుకొని నేను వారి సన్నిధిలో అరగంటసేపు కూర్చున్నాను. అరగంట లోపల అనేకమంది వచ్చి వెళ్ళినారు. వాళ్ళెవ్వరికీ ఆనంద వెంకటేశ్వర్లు గారి చిరునామా తెలియదు. నేను వెళ్ళబోవుచున్నప్పుడు ఒకరు వచ్చినారు. వారు బాబా గారికి అతి సమీపం నందలి ఆఫీసులో వున్న శ్రీ ఆనంద వెంకటేశ్వర్లుగారిని నాకు చూపినారు. ఆనంద వెంకటేశ్వర్లుగారికి ఆడిట్ జరుగుతున్నందువలన, వారు శ్రీ స్వామి వారి దగ్గరకు రాలేక పోయారు. నాకు ఆనంద వెంకటేశ్వర్లు చూపించినవారిని, మీరు ఇక్కడకు ఎందుకు వచ్చినారు? అని అడిగాను. వారు యిలా చెప్పారు

'నేను నిత్యము ఆఫీసుకు వెళ్ళేముందు శ్రీ బాబాగారిని దర్శించుకుంటాను. బాబాగారినుండి 1 కి.మీ. దూరము వెళితేగాని మా బస్టాపు రాదు. నేను ఈరోజు ఆఫీసునుండి ఇంటికి వెళ్ళుచున్నాను. రేపు

ఆదివారం కనుక ఈ ప్రాంతమునకు వస్తానో రానో అని రేపటి దర్శనం ఈ రోజే చేసి వెళ్ళాలని బస్టాపుకు వెళ్ళినవాడినల్లా తిరిగి వెనక్కివచ్చాను' అని చెప్పారు. బస్టాపునుండి వారు బాబా దగ్గరకు వచ్చేసరికి అరగంట టైం పట్టినది. అంటే నేను ఇక్కడ బాబా సన్నిధిలో ప్రార్ధన చేసిన వెంటనే వారికి బస్టాపులో ప్రేరణ కలిగి బాబా సన్నిధికి వచ్చి నాకు ఆనంద వెంకటేశ్వర్లు గారిని చూపెట్టారు.

ఈ సన్నివేశంలో వారు సర్వవ్యాపకులు కానిదే బాబా సన్నిధిలో నేను చేసిన ప్రార్ధన కొరకు వెంటనే వారిని తిరిగి తన సన్నిధికి తీసుకొనిరాలేరు. నేను మనస్సులో చేసిన ప్రార్ధన వారికి తెలుస్తుంది అంటే వారు సర్వజ్ఞులు అని తెలుసన్తుంది. బస్టాపునుండి వారిని వెనక్కుతీసుకొచ్చారంటే, బాబా సర్వ సమర్ధులు అని తెలుస్తుంది. భగవంతునికి చెప్పబడ్డ సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత్వము, సర్వసమర్ధత్వము వారిలో వున్నాయి గనుక వారే భగవంతుడు అని నా విశ్వాసము.

## సర్వభూత హృదయాంతరవర్తి బాబా

పూజ్య గురుదేవులైన శ్రీ భరద్వాజ మాస్టారిగారి సలహా మేరకు బిరియాని పొట్లం కట్టించి తీసుకెళ్ళి బాబాగారి ముందు వుంచాను. వారు పారవశ్యంలో ఉన్నందువలన ఆ బిరియాని పొట్లాన్ని తాకలేదు. వారి సన్నిధిలో నేను ధ్యానం చేస్తూ కూర్చొని అప్పుడప్పుడు బాబాని చూస్తున్నాను. ఒక పర్యాయము చూచే సరికి ఒక మేకపోతు తన మూతితో ఆ పొట్లాన్ని రంధ్రం చేసి బిరియాని తింటున్నది. అన్ని జీవులలో భగవంతుడే వున్నాడు కనుక నేను దాన్నేమి తరమలేదు. ఇంక కొంతసేపటికి ఆ మేకపోతు వెళ్ళిపోయింది. ఆ బిరియాని పొట్లాన్ని బాబా తీసుకొని కమ్మగా భోంచేస్తున్నారు.అన్ని జీవులలో తానే వున్నాడు గనుక అది మేకపోతు ఎంగిలి అనే మాట కూడా వారికి పట్టలేదు.

## నేను కంటితో చూచిన మరియొక అనుభవము

అప్పుడు బాబా గారు నాంపల్లి పోలీస్ స్టేషన్ వరండాలో ఉన్నారు. ఒక విలువైన కారులో ఒకరు దిగారు. ఆయన దుస్తులు చాలా తెల్లనివి, చాలా విలువైనవి, అప్పుడే ఇస్త్రీ మడతలు తీసి వేసుకొన్నట్లుగా వున్నాయి. బాబా దగ్గరకు రాగానే తాను తెచ్చిన చిన్న పూరీ డబ్బా బాబా ముందు

పెట్టి రోడ్డు ప్రక్కన వుండే దుమ్ములో బోర్లాపడి సాష్టాంగదండం పెట్టారు. కనీసం ముఖానికి గానీ, తన గుడ్డలకు గానీ అంటుకున్న మట్టి కూడా తుడుచుకోకుండా అలాగే ధ్యానంలో కూర్చున్నారు. ఎప్పుడో బాబా గారు మన ప్రజ్ఞలోకి వచ్చి ఆ పూరీ డబ్బాలోని అన్నాన్నీ, వడను తిని డబ్బా భూమిపై పెట్టేటప్పుడు కొద్దిగా శబ్దం వచ్చింది. అప్పుడా వ్యక్తి పూరీ డబ్బా తీసుకొని కారులో వెళ్ళిపోయారు. అంతటి శ్రీమంతులు కూడా మట్టిలో పడి బాబాగారికి నమస్కరిస్తున్నారంటే బాబాగారి ఎడల భక్తి ప్రపత్తులు ఎంతగొప్పగా వారికున్నాయో అర్థమవుతుంది.

## మతాలమత్తులేని బాబా

ఒకరోజు నేను, మా కుమార్తె సుమతి బాబాగారి దగ్గరకు వెళ్ళి, శ్రీ నాంపల్లిబాబాగారికి ప్రదక్షిణలు చేస్తున్నాము. అక్కడ వున్న ఒక ముస్లిం ఆయనేంటి నీలాంటి హిందువనుకున్నావా? ఆయన ముస్లిము, అట్లా ప్రదక్షిణలు చేయవద్దు. ప్రక్కకు రమ్మని చాలా భయంకరంగా అరుస్తున్నాడు. వారి మాటలకు నేను మాత్రం భయపడి వచ్చేశాను. మా కుమార్తె ఏమాత్రం కించిత్తుకూడా భయం లేకుండా ప్రదక్షిణలు చేస్తూనే వుంది. వారుమాత్రం ఏమీ అనడం లేదు. ఈమె మాత్రం ప్రదక్షిణలు మానలేదు. అక్కడ అరుస్తున్న ముస్లిమే ఓడిపోయి వెళ్ళిపోయారు. శ్రీ బాబాగారికి మన హృదయంతో సంబంధంగానీ, మన మత చిహ్నాములపైన పటాటోపాలతో (హంగు, ఆర్భాటములతో) పని ఏమి ఉంటుంది?

## ఒక పోలీస్ నాకు చెప్పిన తన దివ్యానుభవము

ఒక పోలీసును రాజకీయ కక్షల వలన శిక్షగా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అతడు అక్కడకు వచ్చి డ్యూటీలో చేరి మూడు లేక నాలుగు రోజులు అయ్యింది. బాబాగారు అప్పుడు నాంపల్లి పోలీసు స్టేషన్ వరండాలో వున్నారు. ఈ పోలీసుకు బాబాను గురించి ఏమీ తెలియదు. కానీ గొప్ప గొప్పవారు కార్లలో వచ్చి మట్టిలో బోర్లాపడి సాష్టాంగ నమస్కారం చేసి పోవటం వారికి చాలా ఆశ్చర్యముగా ఉండేది. బాబాగారు ఎవ్వరినీ ఏమీ అడగరు. దండాలు పెట్టే భక్తులు కూడా డబ్బుగా వారికి ఇవ్వటం చూడలేదు. టీ, బీడీలు, పలావ్ లాంటివి వారికి సమర్పించేవారు. ఒక రోజు పోలీసుస్టేషన్ చిమ్మే పిల్లవాడు బాబాను ప్రక్కకు జరగమని గద్దిస్తున్నాడు. పారవశ్యంలో వున్న బాబా ప్రక్కకు జరగలేదు. వెంటనే ఆ పిల్లవాడు

డబ్బా నీళ్ళు బాబా పైన చల్లాడు. ఇది చూచి పై పోలీస్, ఆ పిల్లవాడిని చెంపమీద ఒక దెబ్బ కొట్టి తరిమేశాడు. రెండు రోజుల తర్వాత ఈ పోలీస్‌పై గల నేరారోపణపై ఓపెన్ ఎంక్వయిరి జరగబోతున్నది. ఆ ఎంక్వయిరీకి పోతూ ఈ పోలీస్ బాబాగారికి ఒక ప్రార్థన చేసి వెళ్ళాడు. 'బాబా నేను నిర్దోషినని మీకు తెలుసు, నన్ను ఈ కేసు నుండి రక్షించండి' అని చెప్పి వెళ్ళాడు. ఈ పోలీస్ ఒక రాజకీయ నాయకుడిని ఎంక్వయిరీ దగ్గరకు తీసుకు వెళ్ళి ఆఫీసరుకు చెప్పించాలని తీసుకుపోవడంలో తన ఓపెన్ ఎంక్వరీకి హాజరు కావలిసిన కాలము ఒక అరగంట దాటిపోయింది. ఆ రాజకీయ నాయకుడి కారులో ఈ పోలీస్ కూడా పోతున్నారు. మార్గమధ్యమున పోలీస్ వ్యానులో తన స్నేహితుడు కనిపించి వ్యాను స్లో చేసి, కారు ఆపి నీ కేసు కొట్టివేసినారు అని చెప్పి వెళ్ళినారు. నిజానికి అతని కేసు అతను ఎంక్వయిరీకి హాజరు కాకుండానే కొట్టి వేశారు. ఆపోలీస్‌కి బస్సువచ్చి వెళ్ళి పోయాడు. నేను ఇక ఆయనను ఓపెన్ ఎంక్వయిరీలో నీవు లేకుండానే కేసు ఎలా కొట్టి వేశారు అనే విషయం అడిగేందుకు నాకు ఆస్కారంలేకుండా పోయింది.

**సాయీశ్వర్ గారి అనుభవము:**

సాయీశ్వర్ అనేవారు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఫోటోగ్రాఫర్‌గా వున్నారు. వారు అప్పుడప్పుడు బాబా గారిని దర్శిస్తుండేవారు. ఒకరోజు వారు శ్రీ బాబాగారి దగ్గర వుండగా అక్కడున్న భక్తులు 'రేపు బాబాగారి దగ్గర అన్నదానం జరుగుతుంది, మీరు కూడా రండి' అని వారిని ఆహ్వానించారు. సాయీశ్వర్ శ్రావణ్ కుమార్ గారిని అన్నదానం విషయం అడిగారు. అన్నదానం జరుగుతుందని నాకు తెలియదని శ్రావణ్ కుమార్ గారు చెప్పారు. అన్నదానం జరిగేటట్లు వుంటే దయచేసి నాకు ఫోన్ చేయండి అని శ్రావణ్ కుమార్ గారికి చెప్పి సాయీశ్వర్ వెళ్ళిపోయాడు. ఆ రాత్రికి సాయీశ్వర్ స్వప్నంలో శ్రీ నాంపల్లిబాబాగారు దర్శన మిచ్చి ఉదయాన్నే 6 గంటలకునా దగ్గరికి రా! అని పిలిచారు. సాయీశ్వర్‌గారు ఉదయాన్నే 5 గంటలకే బాబాగారి దగ్గరకు వెళ్ళారు. అప్పటికే షామియానాలు వేసి అన్నదానానికి వంటలు చేస్తున్నారు. సాయీశ్వర్‌గారికి శ్రావణ్ కుమార్‌గారు తనకు తెలిసివుండి కూడా అన్నదానం విషయం చెప్పక పోయినా శ్రీ బాబాగారు వారికి స్వప్న దర్శనము యిచ్చి పిలిపించుకున్నారు. ఈ సన్నివేశంలో కూడా వారు

సర్వజ్ఞులని, సర్వసమర్థులని, సర్వవ్యాపకులని తెలుస్తుంది.

**శ్రీమతి అరవిందమ్మ గారి అనుభవము (పి. ఆర్. కె. ప్రసాద్ గారి సతీమణి)**

ఈమె సజీవ మహనీయులను దర్శించాలని ఆరాటపడేది. ఒక రోజు నేను (శ్రీ పెసల సుబ్బరామయ్య) నాంపల్లిబాబాగారి గురించి చెప్పి దర్శించమన్నాను. వారు ఒక వేళ ఒక తన్ను తన్నినా అది వారి ఆశీస్సులు అని భావించమని చెప్పాను. ఒక రోజు ఈమె తన భర్తతో కూడా బాబాగారిని దర్శించింది. అక్కడకు పోతూనే బాబాగారు ఆమె వైపు తీవ్రంగా ఉరిమి చూసారు. భయంకరమైన ఆ చూపునే భరించలేక వారి వసతి గృహానికి వెళ్ళిపోయింది. శ్రీ బాబాగారి ఆశీస్సులు పొందినంతవరకు నేను హైదరాబాద్ వదిలి రాను మీరు ఇంటికి వెళ్ళిపోండి అని భర్తకు చెప్పింది. నాకేమి ఆఫీసు సమస్య కాదు నేను నీతోనే వుంటానని ఆయన కూడా హైదరాబాద్ లో వుండి పోయారు. ఆరోజు రాత్రి అంతా ఆమె నిద్రపోకుండా పారాయణ, నామస్మరణ, పూజ ఎంతో ఆర్తితో చేస్తూ తనను కరుణించమని బాబాను ప్రార్థిస్తూ గడిపింది. తెల్లవారి తన భర్తను నాలుగు ఇడ్లీలు, మిరప్పొడి తెమ్మని, 'నేను ఆటోలో కూర్చొని కళ్ళుమూసుకొని వుంటాను, నీవు నన్ను బాబా దగ్గరకు తీసుకువెళ్ళి కళ్ళు తెరవమంటేతెరుస్తాను 'అని చెప్పి అలాగే వెళ్ళింది. పోగానే శ్రీ బాబాగారిని చూచి నమస్కరించింది. వెంటనే బాబాగారు తన గదిలోనికి రమ్మని చేతితో సైగ చేశారు. గదిలోకి పోగానే బాబాగారు చేయిచాపి ఆమె చేతిలోని ఇడ్లీ పొట్లాన్ని ఇవ్వమని అడిగి తీసుకొని ఇడ్లీ తినేశారు. వెంటనే బాబాగారు ఎంతో చిత్రంగా 'నీకేమి కావాలి?' అని ఎంతో స్పష్టమైన ఉచ్ఛారణతో అడిగారు. ఆ సమయానికి ఈమె ఏమి చెప్పలేక మౌనంగా ఉన్నారు. బాబా నవ్వి సరిపెట్టారు. కనుక మొదట బాబా దగ్గరకు వెళ్ళినప్పుడు ఏ సాధన చేయకుండానే ఏదో బొమ్మను దర్శించుటకు వెళ్ళినట్లుగానే పోయింది. అందుకే వారు ఉరిమి చూచారు. రెండవసారి రాత్రి అంతా పారాయణ, పూజ, నామస్మరణలతో గడిపింది. కనుకనే ఆమె తెచ్చిన ఇడ్లీ తినడమే కాక, నీకు ఏమి కావాలి? అని కూడా అడిగారు. కనుక మనము ఏ మహనీయుని దర్శించినా వారి నుండి ఆశీస్సులు పొందాలి అంటే పారాయణ, పూజ, నామజపాలు ఎంత గొప్పగా పని చేస్తాయో ఈ లీల చెబుతుంది.

**పేరు ప్రచురించటానికి ఇష్టంలేని భక్తుడి అనుభవాలు**

1. నేను బాబాగార్ని తరచుగా దర్శిస్తుంటాను. నా కుమారునికి పుట్టుకతోనే పాదాలు వంకర. ఆపరేషన్ చేయించినా సరిగ్గా నడవలేకపోతున్నాడు. నాంపల్లిబాబాగారి దర్శనానికి పిల్లవాడ్ని కూడా తీసుకువెళ్ళేవాడ్ని. పిల్లవాడు బాబా దగ్గర ఆడుకుంటూ, బాబా శరీరానికి తగులుతూ వున్నా బాబా ఏమనేవారు కాదు. కానీ ఒకరోజు రాత్రి పిల్లవాణ్ణి ఒక దెబ్బ గట్టిగా కొట్టారు. తెల్లవారినుండి పిల్లవాడి పాదాలు సవ్యంగా వచ్చాయి మరియు ఏ యిబ్బందీ లేకుండా నడవగల్గుచున్నాడు.

2. నేను కృతజ్ఞతగా బాబాకి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం ఇంటి నుండీ కాని, హొటలు నుండీ కానీ తీసుకువెళ్తుండే వాణ్ణి లేదా ఆటో అతనికి చెప్పి అతని చేత పంపించేవాడిని. ఆ ఆటో అతనికి బాబా అంటే సరిగ్గా తెలియదు. పైగా నమ్మకం అసలే లేదు. ఒక రోజు రాత్రి బాబా ఆటో అతని కలలో 'ఏరా ఎలా అంటే అలా వస్తున్నావు, స్నానం చేసిరా' అని అరిచారు. తర్వాత నుండీ ఆటో అతను శ్రద్ధగా బాబా దర్శనం చేసుకుంటున్నాడు.

**శ్రీ పి.వి.కె.మీనన్, శ్రీ సాయిమయి స్పిరిట్యువల్ సెంటర్, అమ్మనబ్రోలు, ఒంగోలు జిల్లా**

1. అప్పుడు నేను శ్రీశైలంలో వుండేవాడ్ని. కరెంటు వుండేది కాదు. రాత్రుళ్ళు నా గది బయట మంచంలో పడుకొని లేక కూర్చుని నక్షత్రాలతో కూడిన ఆకాశాన్ని, చల్ల గాలిని,చీకట్లోని ప్రశాంతతను అనుభవిస్తుండేవాడిని.

ఒక రోజు రాత్రి 10.45 గం.లకు నా గది బయట గొళ్ళెంపెట్టి కూర్చొని సిగరెట్ త్రాగుతున్నాను. ఇంతలో గాలిలో తేలుతూ నాంపల్లిబాబా నా ముందర కన్పడ్డారు. ఆయన చేతిలో సిగరెట్టు వెలుగుతోంది. ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. నాకు ఆశ్చర్య మేసినా అలానే కూర్చొని వుండిపోయాను. ఒక నిమిషం పాటు బాబా నన్ను చూసి గాలిలో తేలుతూ గొళ్ళెం పెట్టిన తలుపు తీయకుండానే లోపలికి వెళ్ళి ఒక నిమిషం వుండి మరలా అలానే గది బయటకు వచ్చారు. ఇలా కొద్దిసార్లు లోపలికి బయటకి వెళ్ళి వచ్చి ఒక్క మాట మాట్లాడకుండా అదృశ్యమయ్యారు. ఈవిధంగా సర్వవ్యాపకత్వం నిరూపించారు.

2. శ్రీ శివనేశన్ స్వామి ఆజ్ఞ ప్రకారం నేను ఒక 10 నెలలు త్రయంబకేశ్వర్, నాసిక్‌లలో వున్నాను. ఒక రోజు కాషాయ వస్త్రాలు ధరించిన గడ్డమున్న సన్యాసి వచ్చి నాతో మాట్లాడిన తర్వాత నుండీ ఆయన

రూపంలో సాయిబాబా కన్పడుతున్నందున నేను ఆయన మీద చాలా గౌరవంతో వుండేవాడిని. ఆ సన్యాసి చాలా బాగా మాట్లాడేవాడు మరియు మంచిగా ప్రవర్తించేవాడు. భగవంతుని దయవలన ఆ సన్యాసి ఒక తాంత్రికుడని తెలుసుకున్నాను. కాని అతను నన్ను తన స్వప్రయోజనానికి ఉపయోగించుకుందామని అనుకున్నాడు. అతని యొక్క కోరిక ప్రకారం ఒంగోలుకి వస్తూ హైదరాబాదులోని నాంపల్లిబాబా దర్శనానికి వెళ్ళాము. అప్పుడు బాబా గౌలిపురలో రోడ్డు ప్రక్కన వుండేవారు. రాత్రి 'టీ'కి వెళదామనుకొని రోడ్డు మీద నడుస్తున్నప్పుడు బాబా నా వైపు చూచి నన్ను దగ్గరికి రమ్మని పిలిచారు. ఆవిషయం చెపితే తాంత్రికుడు ఒప్పుకోలేదు కాని నేను ప్రార్థించిన తర్వాత బాబా దగ్గరకు వచ్చాడు. నేను బాబాకి కుడి వైపు, అతను ఎడమ వైపు వున్నాము. బాబా అతనికి ఎడమ చేతి బొటన వ్రేలు చూపెట్టి 'గో అహెడ్ (ముందుకు వెళ్ళు)' అని ఇంగ్లీషులో అన్నారు. నాకు కుడి చేతి బొటన వ్రేలు చూపెట్టి 'గో హక్ (సత్యం తెలుసుకో)' అని ఇంగ్లీషులో అన్నారు. దాంతో అతడు ఒక తాంత్రికుడని, బాబా దయవలన అతనితో వెళ్ళినా నన్నేమి చేయలేడని తెలిసింది. తర్వాత ఒంగోలు, విద్యానగర్‌లకు వెళ్ళాము. అతను ఎన్నో తాంత్రిక ప్రయోగాలు చేసినా అవేమీ నన్నేమీ చేయలేకపోయాయి. కేవలం బాబా కృప వలన మాత్రమే ఈవిధంగా నేను తాంత్రికుని బారినుండి రక్షించబడ్డాను.

**కె. రామకృష్ణమూర్తి, బ్లాక్ 4, 24/2, R T మున్సిపల్ కాలనీ, మలక్‌పేట, Hyd-36**

శ్రీ నాంపల్లిబాబా గారికి రెండు సంవత్సరాలు మా యింట్లో భిక్ష యిచ్చే భాగ్యం కలిగింది. నేను 1967 లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా వుండేటప్పుడు నా పై అధికారి (డి ఇ ఒ) నా నుదుట తిలకం చూసి అసహ్యంగా వుందంటే నేను మీరలా అనటం మంచిది కాదన్నందుకు ప్రతీకారంగా ఎన్నో యిబ్బందులు పెట్టి చివరికి పాఠశాల లెక్కలు తనిఖీ చేయించి, నేను పాఠశాల సొమ్ము కాజేసినట్లు కేసు పెట్టి సస్పెండ్ చేయించారు.

1. పాఠశాలకు వెళ్ళక పోవడంతో హైస్కూలు పిల్లలకు ఇంగ్లీషు లెక్కలు ట్యూషన్ రాత్రి 7గం.ల నుండి 9గంటల వరకు చెప్పేవాడ్ని. మలక్‌పేట వీధిలో వుండే ఒక రౌడి ఆడపిల్లలను వెంటబడి ఏడిపించేవాడు. ఈవిషయం పిల్లల ద్వారా తెలిసిన తర్వాత నాంపల్లి బాబా దగ్గరికి వెళ్ళి విషయం చెప్పి దయ చూపమని ప్రార్థించాను. బాబా తల

వూపి సరే అన్నారు. చాలా చిత్రంగా తర్వాత రోజు నుండి ఆ రౌడి ఒక్క ఆడపిల్లను కూడా ఏడ్పించలేదు. పైగా నాతో ఎంతో వినయంగా మెలిగేవాడు. బాబాకు చెప్తే వీధి రౌడి యిలా మారాడంటే బాబా సర్వభూత హృదయాంతర్యామి మరియు సర్వ ప్రేరణాధికారి అని తెలుస్తోంది.

2. ఒక సంవత్సరం సస్పెన్షన్ తర్వాత పోలీసులకు కేసు అప్పగించబడి వారి ఎంక్వయిరీలో నేను డబ్బు కాజేయలేదని, కొన్ని లైబ్రరీ పుస్తకాలు మరియు వసతి గృహంలో కొన్ని సామానులు పోయాయని తేల్చి నన్ను ఉద్యోగంలోకి తీసుకున్నారు. దీనిపై అడిగిన సంజాయిషీకి డబ్బులు కట్టివేస్తే సరిపోతుందని అనుకొని పోయిన వస్తువుల, పుస్తకాల వెల నేను కట్టివేస్తానన్నాను. ఆ సమాధానంతో నేను తప్పు ఒప్పుకున్నట్టు భావించి ఆ సస్పెన్షన్ కాలానికి జీతం రాదు శెలవు పెట్టుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేసి పై అధికారికి పంపారు. నా తమ్ముడు ఐ.ఎ.ఎస్ కలెక్టర్ మా డిపార్టుమెంట్ సెక్రటరీతో మాట్లాడి ఏమీ చేయలేనని ధృవీకరించి చెప్పాడు. నేను నా పిటీషన్ పెట్టే ముందర ఆ అప్లికేషన్‌ను నాంపల్లిబాబా పాదాల మీద పెట్టి స్వామీ! దయచూపవలసిందని ప్రార్థించాను. బాబా తలవూపి సరే అన్నారు. పై అధికారులు అందరూ వ్యతిరేకంగా వ్రాసినా అప్పటి విద్యాశాఖామాత్యులు నా విషయాన్ని స్వయంగా చూసి దీనిలో యింత శిక్షించవలసిన అవసరం లేదు సస్పెన్షన్ కాలం మొత్తం జీతంతో డ్యూటీ పీరియడ్‌గా ఆంగీకరించవలసిందిగా ఆదేశించారు. కేవలం బాబా కృప వలన మాత్రమే సస్పెన్షన్ కాలం జీతం నాకు దక్కింది .

3. నా భార్య సుశీలమ్మ 1969 లో ఒకరోజు రాత్రి 9 గంటలకు పైన గారెలు వేస్తోంది. నూనె బాండీ క్రిందపడి సలసల కాగే నూనె చేతి మీద పడి కాలి బాధ తట్టుకోలేక ఏడుస్తున్నది. రాత్రి సమయం కనుక ఆస్పత్రికి తీసుకు వెళ్ళలేదు. చుట్టుప్రక్కల వాళ్ళు చూచి వెళ్ళారు. బాధకి నిద్ర పట్టక ఏడుస్తూ కూర్చున్నది. అర్ధరాత్రి బాబాగారు యింటి తలుపు తట్టి లోపలికి వచ్చి ఏమి జరిగింది అని సైగలతో అడిగి విషయం తెలుసుకొని తన అమృతహస్తముతో నా భార్య చేయిపై రాశారు. వెంటనే బాధ తగ్గి నిద్ర పట్టింది. బాబా వెళ్ళిపోయారు. తెల్లవారి నిద్రలేచి చూస్తే నా భార్య చేయి మీద ఒక్క బొబ్బలేదు, కాలిన మచ్చ కూడా లేదు. ఇది అంతా బాబాగారి మహత్మ్యం అని గుర్తించి నేను హృదయ పూర్వకంగా ప్రణమిల్లుతున్నాను. వారి కరుణ, ప్రేమ ఎంతని చెప్పగలను.

4. నా పెద్ద కొడుకు బొల్లారంలో ఒక ఇండస్ట్రీ పెట్టి వ్యాపారంలో నష్టపోయాడు. అప్పులు తెచ్చిన ఆర్థిక సంస్థలకు కూడా బాకీ కట్టలేని స్థితిలో వున్నాడు. వ్యాపారంలో నష్టపోయినందు వలన కట్టాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్స్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్‌కి కట్టలేదు. అందువలన స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ వారు మా అబ్బాయికి రావల్సిన 3 లక్షల రూపాయల లోన్‌ని ఇవ్వకుండా మావాడికి వ్యతిరేకంగా ఫైల్ వ్రాసేశారు. అలాంటి పరిస్థితిలో బాబా దగ్గరికి వెళ్ళి విషయం చెప్పి ఆ సొమ్ము వచ్చేలా చెయ్యమని ప్రార్థించగా బాబా సరే అన్నట్టుగా తల ఊపారు. 24 గంటలు కాకముందే ఎస్.ఎఫ్.సి వారు ఫోను చేసి మా వాడ్ని పిలిచి 3 లక్షల రూపాయల చెక్కు యిచ్చారు. మరి ఈ విషయంలో బాబాగారు వాళ్ళకి ఏ విధమైన ఆదేశం యిచ్చారో ఆ పరమాత్మకే ఎరుక. ఆ పరబ్రహ్మ స్వరూపుడికి అసాధ్యమనునది లేదు కదా!

5. నా బావమరిది వ్యాకరణం పురుషోత్తంనకు 1980 నాటికి మల్లెపల్లిలో ఒక ఇల్లు వుంది. ఆర్థిక పరిస్థితుల వలన ఆ ఇల్లు అమ్మివేయటానికి బేరం పెడితే సగం ధరకు అడుగుతున్నారు. నాకీ విషయం తెలిసి నాతో నాంపల్లిబాబా దగ్గరకు తీసుకువెళ్ళి ఇల్లు అమ్ముడయ్యేటట్లు ప్రార్థించినాము. బాబాకి నా బావమరిది ఒక టీ యివ్వబోగా అతన్ని పట్టుకొని చాలా బాగా కొట్టి గోళ్ళతో రక్తం వచ్చేటట్లు గిచ్చారు. ఆ మరుసటి రోజు ఊహించిన దానికంటే రెండు రెట్లు ధర వచ్చి ఇల్లు అమ్ముడుపోయింది. అతను ఆ డబ్బుతో ఎల్.బి నగర్ లో చాలా మంచి ఇల్లు కొనుక్కున్నాడు. బాబా తన అమృత హస్తముతో కొట్టి అతని కర్మను తొలగించి ఇల్లు తర్వాత రోజే అమ్ముడు అయ్యేటట్లు చేసి అతనికి రెండు రెట్లు ఆదాయం కల్పించటం బాబా కరుణ కాక మరేమిటి?

6. ఒకసారి నా చెల్లెలు శిరిడీ వెళ్ళినప్పుడు అక్కడ వున్న శివనేశన్ స్వామి ఆమెతో హైదరాబాద్‌లోని నాంపల్లిబాబాను దర్శిస్తే శిరిడీ సాయినాథుని దర్శించినట్లేనని చెప్పారు.

7. నా స్కూల్లో పనిచేసే లేడీ టీచర్ ఒకరోజు నాతో 'అయ్యా! మా అమ్మకు బ్రెస్టు క్యాన్సర్. ఆవిడ రోజు మొత్తంలో ప్రతి క్షణం దుర్భరమైన నొప్పి, బాధలతో విలవిలలాడుతోంది. మీ స్వామివారితో మా అమ్మ విషయమై చెప్పి రక్షించమని' దీనంగా చెప్పింది. వెంటనే ఆ టీచర్

తమ్ముడిని నాంపల్లిబాబా వద్దకు తీసుకెళ్ళి విషయమంతా చెప్పి 'బాబా! ఎవ్వరికైనా మరణం తప్పదు. కానీ బ్రతికినన్ని రోజులైనా ఆమె బాధ లేకుండా దయ చూప'మని ప్రార్థించాము. బాబా 'సరే' అని తల వూపారు. ఆ తర్వాత రోజు నుండి ఆమె ఒక నెల రోజులు ఏ బాధ లేకుండా జీవించి తర్వాత మరణించారు.

8.**నా ముందర జరిగిన లీల:** నాంపల్లిబాబా వుండే పోలీస్‌స్టేషన్ వెనుకవైపు ఒక యునానీ డాక్టరు వుండేవాడు.అతని భార్య బ్రెస్టు క్యాన్సరుతో బాధపడుతుండేది. ఒకనాడు ఆ డాక్టరు ఒక సీసానిండా నీళ్ళు తెచ్చి శ్రీ నాంపల్లిబాబాగారి ముందుంచి 'క్యా హజరత్! క్యా దేఖ్ రహే హై, మేరే బీబీ బహుత్ తక్లీఫ్ ఉఠా రహీ హై, ఆప్ కుచ్ నహీ కర్ రహే హై' అంటూ భీకరంగా అరుస్తున్నాడు. బాబాగారు సీసాడు నీళ్ళలో ఉమ్మేశారు. ఆ డాక్టరుగారు ఆ నీటిని ఔషధంగా భావించి ఆయన భార్యకివ్వగా అప్పటినుండి ఆమె క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన బాధ లేకుండా జీవించింది.

**ఎస్ ఏ రామప్రసాద్, 71ఎ, నాగోల్, హైదరాబాద్, ఫోన్; 040 24220262**

1. మా అబ్బాయికి 2004 ఎంసెట్ లో 42,000 ర్యాంకు వచ్చింది. మంచి కాలేజీలో సీటు రావడం కష్టం. 7,8 కౌన్సిలింగ్‌లకి వెళ్ళినా మా అబ్బాయి ర్యాంకు దాకా రాలేదు. నేను నాంపల్లిబాబా దగ్గరకు వెళు తుండేవాడ్ని. మా అబ్బాయిని రమ్మంటే వచ్చేవాడు కాదు. ఒక ఆదివారం ఎఇఇఇ పరీక్షకు క్రిందటి సంవత్సర హాల్ టిక్కెట్టు తీసుకు వెళ్ళాడు. ఇంటికి ఫోను చేసి ఈ సంవత్సర హాలు టిక్కెట్టు తీసుకు రమ్మన్నాడు. 14 కి.మీ దూరంలో వున్న పరీక్షా కేంద్రానికి నేను వెళ్ళేసరికి సమయం అయిపోయింది. మా అబ్బాయిని చెడామడా తిట్టి నాంపల్లిబాబా దర్శనానికి తీసుకువెళ్ళాను. కొన్నిరోజుల తర్వాత చివరి కౌన్సిలింగ్‌కి (అక్టోబర్ 19, 2004న) మేమూ వెళ్ళాము. ఊహించని విధంగా మా అబ్బాయికి తాను అనుకున్న కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ సీటు వచ్చింది. కౌన్సిలింగ్ అయి బయటకు వచ్చిన తర్వాత 'నాన్నా! నాకు సీటు వచ్చింది నాంపల్లిబాబా వల్లనే ఎందుకంటే మనిద్దరమూ బాబా దర్శనానికి వెళ్ళినప్పుడు ఆయన్ని చూచి బట్టలు కూడా వేసుకోని నిన్ను నా తల్లిదండ్రులు మహనీయుడు అంటున్నారు. నీవు మహనీయుడవైతే నాకు వి.ఎన్.ఆర్ విజ్ఞానజ్యోతి కాలేజీలో సీటు రావాలని, అలా వస్తే నేను ప్రతివారం మీ దర్శనం

చేసుకుంటానని బాబాతో ఛాలెంజ్ చేసాను. నా ర్యాంకుకు ఈ సీటు రావడం బాబా దయే కారణం' అని చెప్పాడు. తర్వాత ఫీజు కట్టి నాంపల్లిబాబా దర్శనానికి వెళితే మా అబ్బాయిని చూడగానే ఓయి ఓయి అని కేకలు వేస్తూ మందహాసం చేస్తున్నారు. ఆయనకి అప్పగించిన పని తాను నెరవేర్చినట్లుగా ఆ కేకలు యొక్క భావమర్థమైంది. **ఆ అబ్బాయి స్వామికి చెప్పుకున్న విధంగా ప్రతివారం దర్శిస్తుంటే సత్యాన్ని తప్పనివాడుగా స్వామి దృష్టిలో వుంటాడు. అనంతమైన మేలు పొందుతాడు.**

2. ఒకసారి నేను నాంపల్లిబాబా గారి దగ్గర సేవచేస్తూ పాదనమస్కారం చేసుకోవాలని వుంది అని మనస్సులో అనుకోగానే బాబా నావంక చూచి నవ్వుతూ తన కాళ్ళవంక కళ్ళతో చూపిస్తున్నారు. పాదనమస్కారం చేసుకున్నాను. నా మనస్సులో మెదిలిన భావనకు వెంబడే ప్రతిస్పందించి సమాధానం యిచ్చారు బాబా.

3. నాంపల్లిబాబా నవంబర్ 6, 2004న భౌతిక శరీరం విడిచారు. నేను నవంబర్ 9వ తేదీ వరకు బాబా గారి అంతిమ కార్యక్రమాలకు వెళ్ళలేకపోయాను. 9వ తారీఖు రాత్రి నా భార్యతో నేను బాబాగారి అంతిమ కార్యక్రమములకు వెళ్ళగలనా? నేను వెళ్ళేవరకు బాబా శరీరాన్ని వుంచుతారో వుంచరో అని నా ఆందోళన గురించి చెపుతూ నిద్రపోయాను. ఆ రాత్రి నాంపల్లిబాబా కలలో కనిపించి 'నేను ఇక్కడే ఉన్నాను. నువ్వు రా!'అని అన్నారు. ప్రక్కనే భరద్వాజ మాష్టారు, వెంకయ్యస్వామి కూడా వున్నారు. బాబా చెప్పినట్లు ఆ మర్నాడు కార్యక్రమము అంతా దగ్గరుండి చూసే భాగ్యం లభించినది. నాంపల్లిబాబా ప్రేరణతోనే గొలగమూడి వెంకయ్యస్వామి సమాధి దర్శనము, ఒంగోలులోని భరద్వాజ మాష్టారిగారి సమాధి దర్శనము చేసుకొని రావడం జరిగినది.

**డాక్టర్ శెట్టి వెంకటేశ్వర్లు, 3-6-8, సొసైటీ బిల్డింగ్ కాంప్లెక్సు, కేరళ ఆయుర్వేదిక్ సెంటర్, వివేకానంద నగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-72**

2003 సంవత్సరములో తన అనుభవాన్ని చెప్పారు. శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ నాంపల్లిబాబా గారి దర్శనము కొరకు నేను 9 సం॥లు పరితపించాను. వారి దర్శనము జరగదని తలపోయుచున్న సమయంలో శ్రీ చంద్రశేఖర్ రెడ్డిగారు నా

దగ్గరకు ట్రీట్‌మెంట్ కొరకు రావడము జరిగినది. మాటల సందర్భములో శ్రీ నాంపల్లిబాబా గారిని గురించి వారు చెప్పడము జరిగింది. నేను ఒక్కసారిగా కుర్చీలో నుంచి లేచి వారు ఎక్కడ వున్నారు, నాకు దర్శనమిప్పించవలసిందిగా కోరాను. అప్పుడు వారు మరునాటి ఉదయము గౌలిపురకు తీసుకొని వెళ్ళి బాబాగారి దర్శనము గావించినారు. అప్పటి నా ఆనందమునకు అవధులు లేవు ఎందుకంటే 9 సం॥ల నిరీక్షణ ఫలించిన శుభవేళ, బాబాగారు కూడా పాద నమస్కారము చేయనిచ్చారు, ఆశీర్వాదము కూడా ఇచ్చారు. వారిని దర్శించిన శుభవేళ నుండి నన్ను గత 7 సంవత్సరముల నుండి బాధించుచున్న కడుపునొప్పి, ఇతర వ్యాధులు పూర్తిగా నయమైనాయి. అప్పటి నుండి నా ప్రాక్టీసు కూడా దినదినాభివృద్ధి పొందుచూ ధనమునకు ఏ లోటూ లేకుండా బాబాగారి దయ వలన మా కుటుంబసభ్యులందరమూ ఆయురారోగ్యములతో వర్ధిల్లుతున్నాము. ఇప్పటికీ బాబాగారి దర్శనము చేసుకొనుచున్నాము.

**భూపతిరావు, ప్లాటు నెం; 1 / 2ఇ ఎన్ ఎమ్ డి సి కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజగిరి, హైదరాబాద్-47, 9290894942**

శిరిడీ వెళ్ళి ఒకసారి సాయిబాబా సమాధిని దర్శించుకున్నప్పుడు అక్కడ వుండే శివనేశన్ స్వామి మాతో 'మీకు సాయిబాబా నాంపల్లిబాబా రూపంలో హైదరాబాద్‌లోనే వున్నారు. వీలైనప్పుడు ఆయన దర్శనం చేసుకోండి' అని చెప్పారు. అప్పటి నుండి నాంపల్లి బాబా దర్శనం చేసుకుంటున్నాము.1991 లో ఎల్.వి. ప్రసాదు ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ తేది నిర్ణయం అయింది. ఆపరేషన్ ముందు రోజు నుంచి నాకు తీవ్రమైన తలనొప్పి వచ్చింది. నేను రేపు ఆపరేషన్ ఈ తలనొప్పితో ఎలా చేయించుకోవాలా అని భయపడి నాంపల్లిబాబా దగ్గరకు వచ్చి నా బాధ చెప్పుకొని నా నొప్పి తగ్గించి నా ఆపరేషన్ సరిగా జరిగేటట్లు చేయమని బాబాను ప్రార్థించాను. ఆరోజు రాత్రి స్వప్నంలో ఉగ్రనరసింహంలా వచ్చి నా తలమీద చాలా గట్టిగా నాలుగైదు దెబ్బలు కొట్టారు. తెల్లవారే సరికి నాకు తలనొప్పి అసలు లేదు. అప్పుడు ధైర్యంగా ఎల్.వి.ప్రసాద్ ఆసుపత్రికి వెళ్ళి ఆపరేషన్ చేయించుకున్నాను. బాబా దయతో చాలా బాగా జరిగింది.

**డా. గోపాల్ దాసు గారు, 1-2-33/7, రాధారాణి నర్సింగ్ హోమ్ ప్రక్క బిల్డింగ్, దోమలగూడ, హైదరాబాద్**

1984 లో నా అదృష్టము కొద్ది భరద్వాజ మాష్టారుగారితో పరిచయం ఏర్పడింది. అప్పుడు నేను శిరిడీ వెళుతున్నానని చెపితే మాష్టారు గారు ఇప్పుడు శిరిడీ సాయినాధుడు యిక్కడే వున్నారు చూపెడతానని చెప్పి నాంపల్లి పోలీస్‌స్టేషన్ దగ్గర వున్న నాంపల్లిబాబాను చూపించి ఈయనే శిరిడీ సాయి బాబా, శిరిడీ వెళ్ళేకన్నా ఈయన్నే గట్టిగా పట్టుకో అన్నారు. అప్పటి నుండి నాంపల్లిబాబాను దర్శిస్తున్నాను.

1. నేను యమ్.బి.బి.యస్. చేసినా నాకు అప్పట్లో ఉద్యోగం లేదు. నాకు ఉద్యోగం కావాలని బాబాను అడిగితే బాబాగారు తల వూపారు. కొద్ది రోజుల తర్వాత నాకు ఉస్మానియా ఆసుపత్రిలో ఉద్యోగం వచ్చింది. అప్పటి నుండి నాంపల్లి బాబాను సంపూర్ణంగా నమ్ముకున్నాను.

ఒక రోజు నాంపల్లి బాబా స్వప్నంలో కన్పించి చనిపోయేవరకు 'సాయి' అనుకో అని చెప్పారు. అప్పటి నుండి నాంపల్లిబాబాకు చెప్పుకుంటే ఎంతటి కష్టమైనా తొలగుతుంది, మనస్సు తేలికవుతుంది.

2. 1998 అక్టోబర్ నెలలో మా కుటుంబ ఆస్థిలో వాటా కోసం ఒక ముస్లిం సయ్యద్ అబ్దుల్ క్రైమ్ కోర్టులో కేసు వేసాడు. చాలా రోజులు కోర్టు తీర్పు యివ్వలేదు. నాంపల్లిబాబాకు కోర్టుకేసు గూర్చి మొరపెట్టుకొన్న తర్వాత హఠాత్తుగా సయ్యద్ అబ్దుల్ లారీ ప్రమాదంలో చనిపోయాడు. తర్వాత కొద్ది రోజులకు కోర్టులో కేసు కొట్టివేసి మా ఆస్థి మాకు యిచ్చారు.

**ఉమాపతి, ప్రసన్న లక్ష్మి, హౌస్.నెం.10-130-7, సాయినగర్, బాలానగర్, హైదరాబాద్. ఫోన్ నెం.9395302000**

నేను మూడు ఆటోలు ఫైనాన్సుమీద తీసుకొని నడుపుకుంటుండే వాడ్ని. ఆర్థికంగా ఏ యిబ్బందులూ లేవు. కొంతకాలం తర్వాత (2002వ సంవత్సరం) మా చెల్లి పెళ్ళి చేయాల్సి వచ్చింది. అదే సమయంలో మూడు ఆటోలూ రిపేరుకి వచ్చి డబ్బులు లేక రిపేరు చేయించలేకపోయాను. అందువల్ల రోజువారి ఆటోమీద వచ్చే డబ్బులు లేకపోవటంతో ఫైనాన్సు కట్టలేకపోయాను. ఇంట్లో ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. నేను ఒక కంపెనీలో 2,000 రూపాయల జీతంతో పని చేస్తున్నాను. ఎవరైనా ఎలక్ట్రికల్ పనులు ఇస్తే వాటిని చేస్తూ జీవితం గడుపుతున్నాము. అదే సమయంలో పిల్లల స్కూల్‌కి ఫీజులు కట్టవలసిరావటం, మా నాన్నగారు చనిపోవటం వలన ఇంట్లో ఒక పూట

మాత్రమే భోజనం చేయగలిగేవారము. ఒక్కొక్కసారి నేను ఉదయం 11 గంటలప్పుడు బయటికి వెళ్ళి హోటల్‌లో అన్నం తిని వచ్చానని అబద్ధం చెపుతుండేవాడ్ని. అలాంటి సమయంలో రోహిణికుమార్ అనే స్నేహితునితో ఒక దేవాలయంలో నా ఉద్యోగం గురించి చెప్తే అతను శ్రీ గురుచరిత్ర పారాయణ చేయమని చెప్పి తన డబ్బుతో నన్ను నాంపల్లిబాబా దర్శనానికి తీసుకువెళ్ళాడు. అప్పటినుండి బాబా దగ్గరకు వీలైనప్పుడు వెళ్ళేవాడ్ని. బాబా దగ్గరకు వెళ్ళిన 5 నెలలలోపు నాకు 'యాష్ ఇంటర్‌నేషనల్' అనే కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు నాకు 12,000 రూపాయల జీతం. బాబా దగ్గరకు వెళ్ళకముందు 8-9 నెలలు బాధ పడ్డాను. నేను వెళ్ళిన 5 నెలలలోపు వచ్చిందంటే ఇదంతా బాబా కృప అని నమ్ముతున్నాను. క్రమంగా ఇంట్లో పరిస్థితులు చక్కబడ్డాయి.

2. నా భార్యకి మా పెళ్ళికి ముందరనుండే కళ్ళు సరిగ్గా కన్పడేవి కావు. ఎల్.బి. ఆస్పత్రిలో గత 15 సంవత్సరాలనుండి చికిత్స చేయిస్తున్నాము. డాక్టరు ఆపరేషన్ చేసినా చూపు మెరుగవదని, వున్న చూపు పోకుండా చికిత్స చేద్దామని చేస్తున్నారు. కుడి కన్ను చూపు పోయింది. నాంపల్లిబాబా ఫొటో నుండి ఒకరోజు చుక్కనీరు కారింది. ఆరోజే నాంపల్లి బాబా సమాధి చెందారని తెలిసి, బాబాను దర్శించుకుని వచ్చాము. తర్వాత కొన్ని రోజులకు డాక్టరు దగ్గరకు వెళితే డాక్టరు ఆపరేషన్ చేస్తే కన్ను వస్తుందని చెప్పారు. 2005వ సంవత్సరంలో ఆపరేషన్ చేస్తే 65% చూపు వచ్చింది. ఆ కన్నుతోనే నా భార్య యిప్పుడు చూడగలుగుతున్నది. కంటి చూపు రాదనుకున్నది ఇలా చూపు రావటం నాంపల్లిబాబాగారి దయే అని తలుస్తాము.

**యన్నం బాబురావు,ఇంటి.నెం.27,రాంపల్లి,ఆర్.ఎల్.నగర్, 9701210692**

ఒక రోజు కంపెనీ బస్సులో ఇంటికి వెళుతూ ధ్యానం చేసుకుంటుంటే నాకు ఒక స్క్రీన్ మీద ఈవిధంగా కన్పడింది. గౌలిపుర గేటు, ఊచలు, నేను గేటు దగ్గర నిలబడ్డాను. లోపల ఒకాయన సాయిబాబా లాగా కఫ్నీ వేసుకొని వున్నారు. నాకు సాయిబాబా అనే భావన వుంది. ఇదేంటి బాబా లోపల వుండి నేను బయట వున్నాను అని అనుకున్నాను. తర్వాత కూడ ఈవిషయం గుర్తుతెచ్చుకొని ఎందుకు బాబా అలా దర్శనమిచ్చారని అనుకుంటున్నాను. తర్వాత స్నేహితుల ద్వారా గౌలిపురాలో నాంపల్లిబాబా అనే అవధూత గురించి తెలిసి వెళితే నాకు

ధ్యానంలో కనపడిన ఆయనే నాంపల్లిబాబా అని గుర్తించి ఆశ్చర్యపోయాను. అలా కొన్ని సంవత్సరాల క్రితమే బాబా తన దర్శనమిచ్చి నన్ను తన వద్దకు రప్పించుకున్నారు. అప్పటినుండీ ప్రతివిషయం నాంపల్లిబాబాకు చెప్పుకొని చేయటం అలవాటయింది.

1993 లో నేనుండే ఇల్లు దగ్గర మరొక ఎనిమిది ఇండ్లు తప్ప ఇంకేమీ వుండేవి కావు. అడవిలాగా వుండేది. అప్పటికే ప్రక్కింటి వారింట్లో ఒక దొంగతనం జరగడంతో క్రొత్తవ్యక్తి కనపడితే చాలా ఆరాలు తీసేవారము. ఒక రోజు బోరు వేస్తున్నామని బాబాకు చెప్పుకుంటే బాబా తలకాయ ఊపారు. తర్వాత ఉదయం 5.30 గం॥లకు బోరు వేయించడం ప్రారంభించాము. కొంతసేపు అయిన తరువాత చింపిరి జుట్టు వేసుకొని సుమారు 35సం॥ వయస్సు గల ఒక అతను అక్కడ కన్పడ్డాడు. నాతో వున్న నలుగురు ప్రక్కింటి వారు అతన్ని ఎవరు, ఎందుకు వచ్చావు అని అడిగితే చూడటానికి వచ్చాను అన్నాడు. అప్పుడే నా భార్య యింట్లో నుండి తీసుకొచ్చిన టీలు యింటి గుమ్మం దగ్గర అందుకొని వెనక్కు తిరిగే సరికి క్రొత్తగా వచ్చినతను చుట్టూరా 1/2 కి.మి. దాకా కన్పడే ప్రాంతంలో ఎక్కడా కనపడలేదు. బోరు వేయటం అయినది. తర్వాత నేను నాంపల్లిబాబా దర్శనానికి వెళ్ళితే బాబా పెద్దపెట్టున నవ్వారు. అప్పుడు అన్పించింది బోరు వేసినప్పుడు వచ్చిన అతను బాబాయేనని. తర్వాత ఒక రోజు బోరులోని నీరు ఒక చిన్న కూజాలో తీసుకెళితే వెంబడే మొత్తం నీరు త్రాగేసి నవ్వారు. బాబాయే దగ్గరుండి బోరు వేయించారనుకుంటున్నాను.

**జయప్రకాష్, 1745, ఎ1 రెస్టారెంటు ఎదురు, మిస్సాలాబజార్, బొల్లారం పోస్టు,**

(ఈ భక్తునికి ఏదైనా బాబా చెప్పేటప్పుడు ముందర తెల్లటి పొగలాంటిది వచ్చేది. ఆ పొగ ఇతనికి మాత్రమే కనపడేది. ఇంగ్లీషులో ఇచ్చిన ఆజ్ఞలను తెలుగులోకి అనువదించాము)

నేను 1965సం॥ నుండి 1985సం॥ వరకు ఎయిర్‌ఫోర్సులో పనిచేశాను. 1983వ సంవత్సరములో నా భార్యకి భూతమావేశించి వుండటం వల్ల పిచ్చిగా ప్రవర్తించేది. ఇంట్లో చాలా గందరగోళంగా వుండి మానసిక ప్రశాంతత లేదు. అలా వుంటున్న రోజుల్లో ఒకరోజు బందు వల్ల ఆఫీసుకి శెలవవటంతో నేను జలాలుద్దీన్ దర్గాకెళ్ళి మ్రొక్కుకుంటే నా భార్యకి బాగుంటుందని బయలుదేరాను. రాష్ట్రపతిరోడ్డులో బాటా

షోరూముకి ఎదురుగా వున్న పెద్దచెట్టు క్రింద ఒకాయన తెల్లటి గడ్డంతో, తెల్లటి బట్టలు వేసుకుని కూర్చొని కన్పడ్డాడు. చూడగానే పూజ్యభావం కలిగింది. విచిత్రంగా మా ఇద్దరి మధ్య తెల్లటి పొగ వున్నది.నేను ఆ పొగను త్రోసుకుంటూ ఆయన దగ్గరికి వెళ్ళి కూర్చోగానే నా ప్రయత్నము లేకుండా ఏడుస్తున్నాను. ఆయన 'ఏడవకు, ఏడవకు, ఏమీ అవదులే' అని అన్నారు. నేను వెంటనే నా ప్రయత్నము లేకుండా 'అలా!' అని బిగ్గరగా అరిచాను. ఆయన కాలి దగ్గర పసుపుపచ్చ కాంతిగా వుండి ఆయన కాళ్ళు నన్నాకర్షించాయి. నేను కొంచెంసేపుండి ఇంటికి వచ్చాను. తర్వాతరోజు నుండి నా భార్య ఆరోగ్యం బాగైంది. తర్వాత ఆయనని మరలా కలుసుకోలేకపోయాను. అప్పటినుండి ఎవరా బాబా, మరలా ఎప్పుడు కలుస్తానా అని అనుకుంటూ వుండేవాడ్ని.

1986లో నేను ప్రాగాటూల్సు కంపెనీలో చేరాను. 1994వ సంవత్సరంలో నా సహోద్యోగి బాబురావుగారితో కలిసి నాంపల్లిబాబాను దర్శించుకున్నాను. బాబాను చూసిన దగ్గరినుండి మరలా మరలా దర్శించుకోవాలని వుండేది మరియు తరచుగా దర్శించుకుంటుండేవాడిని. ఒకరోజు బాబాను చూస్తూ కూర్చొని వున్నాను. బాబా నా వంక తదేకంగా చూస్తున్నారు. ఇంతలో బాబాకు, నాకు మధ్య తెల్లటి పొగలాంటిది కన్పడుతోంది. నా చెవిలో 'నీ బాబాను చూస్తావా' అని వినపడింది.నాకు వెంబడే 11 సంవత్సరాల క్రితం రాష్ట్రపతిరోడ్డులో దర్శించిన సన్నివేశం గుర్తు వచ్చి ఈయన ఎవరు? బాబాను చూస్తావా అని అడుగుతున్నాడనుకుంటున్నాను. వెంబడే చెవిలో 'మేమెప్పటినుండో నిన్ను రక్షిస్తున్నాము' అని వినపడేసరికి 11 సంవత్సరాల క్రితం దర్శించిన బాబాకి, నాంపల్లిబాబాకు ఏదో సంబంధం వుందనుకున్నాను.వెంబడే ఆజ్ఞాపించినట్లు 'ఇప్పటినుండీ విధేయతతో వుండు, నీ ఉద్యోగం ధర్మబద్ధంగా చెయ్యి, ఆల్కహాలు త్రాగకు, శాఖాహారమే తిను, గురువారాలు మాత్రమే వస్తూ వుండు' అని చెవిలో వినిపించింది. గత 16 సంవత్సరాలనుండీ ప్రతి గురువారం బాబాను దర్శిస్తున్నాను. కొన్ని ముఖ్యమైన లీలలు.

1. నాకు 1970 నుండి గుండె ప్రక్కటెముక క్రింద ఒక చిన్న ఉండలాగా వుండి అన్నం తిన్న తర్వాత పిన్నుతో గుచ్చినట్లు వుండేది. భరించగలనొప్పి కాబట్టి డాక్టరు దగ్గరికి వెళ్ళలేదు. మా కంపెనీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టరు

సుభాష్‌తో కలసి ఒక గురువారం సాయంత్రం 7 గంటలకు బాబా దగ్గరకి వెళ్ళి కూర్చున్నాము. బాబా నా వంక తదేకంగా చూస్తున్నారు. బాబా నుండి ఒక వెలుగులాంటిది వచ్చి నా గుండె ప్రక్కటెముక క్రింద వున్న ఉండను గట్టిగా కొట్టింది. నొప్పి పుట్టి నా చేతులు దెబ్బ తగిలిన ప్రదేశానికి తీసుకెళ్ళేలోపల ఆ వెలుగు ఆ ప్రదేశంలో రుద్దుతోంది. నాకు ముచ్చెమటలు పట్టాయి. నాతో వచ్చిన ఇన్‌స్పెక్టరు భయపడి వెళ్ళిపోదామంటే ఏమీ కాదని కూర్చోమన్నాను. ఆ రోజు నుండీ ఆ నొప్పి మరలా రాలేదు.

2. కాలేజీ గొడవల వలన మా అబ్బాయిని హత్య చేశారు. అదే సమయంలో మా అమ్మ క్యాన్సరుతో బాధపడుతోంది. ఇంటికి వెళ్ళాలంటే భయంగా వుండి బాబా దగ్గరకి వెళ్ళినప్పుడు బాబాతో 'బాబా! జీవితం డిప్రెషన్‌గాను, అగమ్యగోచరంగాను వున్నది' అని చెప్పుకున్నాను. వెంబడే బాబా ఒక సిగరెట్టు వెలిగించి ఒక దమ్ము లాగారు. వెంబడే నాకు నరాలన్నీ పగిలిపోయినట్లు అయ్యి కొంతసేపటికి చాలా రిలీఫ్‌గా వున్నది. అంతకుముందున్న డిప్రెషన్‌గాని, టెన్షన్‌గానీ ఏమీ లేవు. ఒక సిగరెట్టు దమ్ముతో నా మానసిక ఆందోళనను బాబా తొలగించారు.

3. నా చెల్లెళ్ళు బాబా దర్శనానికి తీసుకు వెళ్ళమంటే వారిని తీసుకొని బాబా గారి దగ్గర కూర్చున్నాను. నేను ఆ రోజు శ్రీ సుందర చైతన్యానందగారు వ్రాసిన పుస్తకం తీసుకెళ్ళాను. బాబా నా వంక చూస్తున్నారు. నాకు చెవిలో 46వ పేజీ తీయమని ఆజ్ఞ వచ్చింది. ఆ పేజీలో వున్న సందేశం ఈ విధంగా వున్నది. ' బయట వస్తువుల్లో ఆనందం లేదు. తరగని ఆనందం భగవంతునిలో వుంది. శీలమే అందం. భగవంతుడే నిజమైన అందం. మనిషి యొక్క లక్ష్యము: శాశ్వత ఆనందమైన భగవంతుడిని చేరటమే. ఓం నమో భగవతే వాసుదేవాయ.ఈ నామాన్ని ఉచ్ఛరిస్తుంటే లౌకిక జీవితం ఆధ్యాత్మిక జీవితంగా మారిపోతుంది'. ఈ విషయం నా స్నేహితుడు బాబూరావుతో చెపితే బాబా ఆ విధంగా దీక్ష ఇచ్చారు ఆ నామాన్ని తలుచుకో అని చెప్పారు.

4. 2003వ సంవత్సరంలో నా భార్యకి యూరిన్ రాక యిబ్బంది పడుతోంది. ఆమె చాలా మొండిగా బాబాతో నేను ఆపరేషన్ చేయించుకోను. నీవే ఏమైనా చెయ్యి అని ప్రార్థించింది. ఒకరోజు కలలో

బాబా కన్పడి నీకిక్కడ నొప్పికదా అని, యూరిన్ వచ్చే ప్రదేశం దగ్గర వేలితో నొక్కారు. ఆ తర్వాతరోజు నుండీ ఆ నొప్పి మరలా రాలేదు.

5. సుందర చైతన్యానందగారి ప్రసంగంలో చెప్పిన క్రిందిమాట నా మనస్సులో దృఢంగా నాటుకుంది. 'మహనీయుల దగ్గరకి వెళ్ళినప్పుడు వారినేమీ అడగనక్కరలేదు. మనస్సులో అనుకుంటే వారినుండి సమాధానం వస్తుంది'

నేను కర్ణాటకలో వున్న మాతా మాణికేశ్వరి దగ్గరకి వెళ్ళినప్పుడు మనస్సులో 'అమ్మా! మాకు నాంపల్లిబాబా అంటే ఎవరో, ఏమిటో తెలియట్లేదు అని' చెప్పుకున్నాను. నా చెవులకి అమ్మ గొంతుతో 'అందరూ ఆ యోగి అనో, ఈ తపస్వి అనో దర్శిస్తుంటారు, ఇతను గొప్ప అని, ఇంకొకరు గొప్ప అని అంటారు. ఇదంతా ఏమంటే కరెంటు. కరెంటే ఒకచోట నుండి వెలుతురుగా వెలుగుతుంది. ఆ వెలుతురునే మీరేమంటారంటే ఈయన చాలా పవర్‌ఫుల్, ఆయన చాలా పవర్‌ఫుల్ అని. కరెంటు వస్తేనే ఇవన్నీ వెలిగేది. ఆ కరెంటే నాంపల్లిబాబా' అని వినపడింది. అంటే ఏ ఒక్క చైతన్యముతో ఈ సకలసృష్టి భాసిల్లుతోందో ఆ చైతన్యమే నాంపల్లిబాబా.

ఒకసారి కేతంరాజువల్లెలో వుండే నాగేంద్రబాలయోగి దగ్గరకెళ్ళినప్పుడు ఆయన మా సత్సంగాన్ని మెచ్చుకుంటూ నేనేమీ అడగకుండానే నీ పిల్లవాడు ఉత్తమలోకాల్లో ఉంచబడ్డాడు అని చెప్పారు. తర్వాత 'బాబా గురించి మాట్లాడాలంటే ఎందుకు భయపడతారు, మానవులకోసం బాబా వచ్చారు, అందువలన మీరంతా బాబా గురించి తెలియని వారికి బాబా గురించి చెప్పి వారికి బాబా దర్శనం చేయించటమే మీ పని' అని చెప్పారు. అప్పటినుండి బాబా గురించి పోస్టర్లు అతికించటం, మాకు తెలిసిన వారికి చెప్పటం ప్రారంభించాము.

తర్వాత ఒక గురువారం బాబా దగ్గరకి వెళ్ళి కూర్చుంటే బాబా తమ ఎడమ చేతి వ్రేలితో తమను చూపుతూ 'నేనే ఆరవ అవతారం, ఇప్పుడు నన్ను చూడు' అని అన్నారు. నాకర్థం కాక సత్సంగ సభ్యులతో చెపితే వారు అప్పుడు దత్తాత్రేయుని యొక్క కలియుగంలో మొదటి 5 అవతారాలు: శ్రీ శ్రీ పాద వల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి స్వామి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్కోట స్వామి, శ్రీ శిరిడీ సాయిబాబా అని

వారి గురించి చెప్పి నాంపల్లిబాబా 6వ అవతారమని వివరించారు.

6. **ఇల్లు కట్టించటం:** నా భార్య పెద్దక్కయ్యకి పిల్లలు లేకపోవడంతో తనకున్న స్థలాన్ని మాకిచ్చి ఇల్లు కట్టుకోమంది. నాకు అప్పటికే ఒక 14 నెలలనుండి నేను పనిచేసే కంపెనీ నష్టాల్లో వుండి జీతం రావట్లేదు. అలాంటి పరిస్థితుల్లో ఇల్లు కట్టలేమని చెప్తే నా భార్య ఎలాగైనా ఇల్లు కట్టాలంటూ షాబిర్‌బాబా గారి దగ్గరకి వెళితే ఆయన 'ప్రారంభించు' అన్నారు. తర్వాత నాంపల్లిబాబా దగ్గరకి వెళితే బాబా సిగరెట్టు అడిగి తీసుకుని ఆశీస్సులు అందజేశారు. 2,000 రూపాయలతో ప్రారంభించినది కేవలం బాబా కృప వలన సమయానికి వివిధ వ్యక్తులు వారంతటవారే వచ్చి అవసరానికి కావలసిన డబ్బును అందజేశారు. ఇప్పుడు వుంటున్న ఇల్లు బాబా నాకు పెట్టిన భిక్షే!

బాబా సమాధి అయినా నాకు ఏ మాత్రం ఆయన లేరు అనే భావన లేదు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా బాబాకు చెప్పుకుని చేస్తాను. ఇప్పటికీ ఏదీ అవసరమో అది బాబా చేయిస్తున్నారు.

## గొర్తి సాయి సుబ్రహ్మణ్యం, దమ్మపేట

హైదరాబాద్‌లో చదువుకునేటప్పుడు గౌలిపురలో వుండే నాంపల్లిబాబాగారి దర్శనం చేసుకుంటూ వుండేవాడ్ని. పారాయణ చేసి వెళ్తే ప్రేమగా చూడటం, పాదస్పర్శ భాగ్యం కల్గించేవారు. పారాయణ చేయకపోయినా, పిచ్చి ఆలోచనలతో వెళ్ళినా దూరం నుండే అరుస్తూ వెళ్ళిపోమంటారు. ఒకరోజు వెళితే నాంపల్లిబాబా చాలా ప్రశాంతంగా నన్ను సిగరెట్టు యివ్వు అన్నట్లు సైగ చేస్తున్నారు. నేను సిగరెట్టు కొనుక్కొని వస్తూ ఇవి నాన్న డబ్బులు కదా వృధా చేస్తున్నామా అనే చెడ్డ ఆలోచన వచ్చింది. బాబా దగ్గరికి వచ్చేలోగా భరద్వాజ మాష్టరు నాంపల్లిబాబా మహనీయుడు అని చెప్పారు కదా అని కొన్ని రకాలుగా మంచి భావనలతో నింపుతున్నాను. బాబా దగ్గరికి వచ్చేసరికి బాబా చాలా కోపంగా అరుస్తూ అక్కడున్న వాళ్ళందర్నీ వెళ్ళిపోమంటున్నారు. అక్కడ వుండే శ్రవణకుమార్ గారికి నేను వాళ్ళబ్బాయికి ఏదైనా డౌట్లు వుంటే వివరిస్తుండేవాడ్ని అని నా మీద అభిమానం. అలాంటి ఆయన నన్ను కూడా అరచి వెళ్ళిపొమ్మని చెప్పారు. అంటే సిగరెట్టు తీసుకువస్తున్నప్పుడు నా మనస్సులో వచ్చిన చెడ్డ ఆలోచనకి నాంపల్లిబాబా పరిస్థితి అంతా మార్చేశారు. అంతేగాక

బాబాకు సేవ చేసుకునే భాగ్యం పోయింది.

## గొర్తి లక్ష్మి, దమ్మపేట

నా పెద్ద కుమారుడు పి. హెచ్.డి చేస్తూ అనారోగ్యమైతే అతనికి పరిచర్యలు చేస్తూ నేను బలహీనపడ్డాను. హైదరాబాద్‌లో హోమియోపతి వైద్యానికి వెళ్ళినప్పుడు నాంపల్లిబాబా గారి సమాధి దర్శనమునకు వెళ్ళాను. అప్పటి పరిస్థితి ఎలా వుందంటే పిల్లవాడి ఆరోగ్యం కుదుటపడలేదని బాధ, నీరసం, నిస్పృహతో వున్నాను. బాబాకి నమస్కారం చేసుకుంటూ నా పరిస్థితి విన్నవించాను. సమాధి దర్శనం అయిన తర్వాత ఇంటికి వచ్చినప్పటి నుండి ఎంతో ధైర్యంగా, హుషారుగా వున్నాను. తర్వాత పరిస్థితులన్నీ బాబా కృప వలన చక్కబడ్డాయి. బాబా దర్శనమే అన్నిటికీ మందు.

## గొర్తి సాయిశివ, స్విట్జర్లాండ్

శ్రీ నాంపల్లిబాబా వద్దకు 1997 మే నెలలో నా పుట్టినరోజునాడు మా అన్నయ్య తీసుకువెళ్ళాడు. వారి ప్రథమ దర్శనం ఇప్పటికి నా కళ్ళ ఎదుట తొణికిసలాడుతోంది. చార్మినార్ గౌలిపురలో శ్రావణ్ కుమార్ గారి ఇంట్లో ఒక రూములో శ్రీ నాంపల్లి బాబా గారు మంచంమీద కూర్చుని వున్నారు. తలుపువేసి వుంది. కటకటాలగుండా స్వామి స్పష్టంగా కనపడుతున్నారు. అన్నయ్య, నేను స్వామి ఎదురుగా తలుపు దగ్గర చేతులు జోడించి నిలబడి వున్నాము. శ్రీ బాబా గారు చేతి సైగలతో, భంగిమలతో, వారి దృక్కులతో ఏదో తెలియని ప్రభావం నాపై కలిగించారు. విపరీతంగా నాకు కన్నీళ్ళు వచ్చేస్తున్నాయి. అలా ఏడుస్తూ స్వామి వైపు చూస్తూ అక్కడే ఎంతోసేపు నిలబడి వున్నాను. అప్పటికే మాష్టారు రచనలు కొన్ని చదవటం, వినటం వల్ల కాబోలు నాకు సాయిబాబా వద్దనే ప్రత్యక్షంగా ఉన్నాననే భావం వుండేకాని, ఏకోశానా వారి నామ రూపాల బేధంపై దృష్టి మళ్ళలేదు. వారు ఏమీ మాట్లాడనప్పటికి నేను చేసే ప్రతి పని ఇతరులెవ్వరికి తెలియని వాటితో సహా వారికి తెలుస్తున్నది, మరియు మన ప్రవర్తనను బట్టి వారు ప్రతిస్పందించే తీరు వుంటుందన్న దృఢ విశ్వాసాన్ని ఆ మొదటి దర్శనం తోనే ప్రసాదించినందుకు బాబాకు కృతజ్ఞతాభివందనాలు అర్పిస్తున్నాను. (ఇక నుండి శ్రీ శిరిడీ సాయిబాబా అయినా నాంపల్లిబాబా అయినా బాబా అనే ప్రస్తావిస్తాను. )

ఆ తరువాత కొన్ని నెలలకు ఇంటర్ మీడియట్ చదవటానికి హైదరాబాద్‌లో వుండనారంభించాను. రోజూ కాలేజికి వెళ్ళిరావటం, శ్రీ గురుచరిత్ర,సాయిలీలామృతం కొద్ది సేపు పారాయణ చేయటం పాఠ్యపుస్తకాలు చదవటం ఇది దినచర్య. ఉన్నట్టుండి ఒక రోజు శ్రీ నాంపల్లిబాబా వద్దకు వెళ్ళాలనే తీవ్రమయిన ప్రేరణ కలిగి వుండబట్టలేక అన్నయ్య అప్పుడు లేకపోవడంతో ఒక్కణ్ణే దారి సరిగ్గా తెలియకపోయినా బాబాయే తీసుకువెళతారనే భావంతో బయలుదేరి వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాను. ఇది రెండవ దర్శనం. వెళ్ళినప్పుడల్లా బాబాకు రెండు సిగిరెట్లు తీసుకువెళ్ళటం, అవి వారు స్వీకరిస్తే చేతికిచ్చి వెలిగించటం లేకుంటే వారి అందుబాటులో టీపాయి మీద పెట్టి అక్కడ ఎదురుగా వున్న చెట్టు మొదలుకి నామస్మరణ చేస్తూ హృదయంలో ప్రార్థన చేస్తుండడమో లేక ధ్యానయోగ సర్వస్వమో, మరో మాష్టారి గ్రంథమో కొద్దిసేపు చదువుకొని బాబా ప్రసన్న వదనాన్ని అలాగే చూస్తూ కూర్చోవటమో జరిగేది. అప్పటి నుండి తరుచుగా బాబా గారి దర్శనం, సన్నిధి ప్రసాదించిన కరుణామయులు. వారి దర్శనం, సన్నిధి ఎంతో ప్రశాంతతనూ, ఆనందాన్ని ప్రసాదించేవి. చాలా మార్లు ఆదివారం ఉదయం వెళితే సాయంత్రం వరకు అక్కడే వుండే అవకాశాన్ని కల్గించారు. ఇప్పుడు ఆలోచించి చూస్తే ఎంతో ఆశ్చర్యం అనిపిస్తుంది. ఆ వయస్సులో ఏ సినిమాలు, టీ.వీ.లు, ఆటలు చూడటం - ఇవేవి ఇవ్వనంత ఆనందాన్ని, ఆకర్షణనూ వారి సన్నిధి ద్వారా కల్పించి తద్వారా పైవేవి ఆ రెండు సంవత్సరాలలో అసలు కొద్దిగా కూడా మదిలో జొరబడనీయకుండా పూర్తిగా చదువు, బాబా ఆరతులు, మాష్టారి రచనలు, పిన్నివాళ్ళింట్లో సత్సంగం చేసుకోవటం, వీలున్నప్పుడల్లా బాబా గారి సన్నిధిలో గడిపేటట్లు చేశారంటే బాబా ఎంత నిర్హేతుకమైన కృప చూపించారో కదా! ఎందరో విద్యార్థులు, స్నేహితులు పరీక్షల సమయంలో కూడా క్రికెట్ వస్తుంటే చూడకుండా వుండను నిగ్రహించుకోలేక, పరీక్షలలో ఫెయిల్ అయ్యే పరిస్థితి వచ్చినా ఆ బలహీనత వదిలించుకోలేక బాధపడుతుంటే, ఈ రకంగా బాబాగారు తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు చేయలేని అమూల్యమైన మేలు నాకు తెలియకుండానే చేశారు. ఆ వయసులో వాటికి దూరంగా ఉంచడం ద్వారా వాటిపై అనాసక్తి అనే వరాన్ని ప్రసాదించారని కొన్నాళ్ళ తరువాత తెలిసింది. ఇప్పటికీ అది నాకు వరంగానే అనిపిస్తుంది. విద్యార్థి దశలో వాటి వలన కలిగే హాని పరిగణనీయం.

అటువంటిది బాబా వీటన్నింటినీ మించిన ఆనందాన్ని వారి సన్నిధి ద్వారా - ఏ ఉపదేశాలు, వాచా ఆదేశాలు యివ్వకనే - ప్రసాదించారంటే వారి దివ్య మహిమ ఎంతటిదో అర్ధమవుతుంది.

**బాబా గారి మౌనబోధలు;**

### 1. బాబాగారి సర్వభూత హృదయాంతర్వర్తిత్వము మరియు సర్వప్రేరణాధికారిత్వాన్ని తెలియజేయుట:

ప్రతి పౌర్ణిమకు మరికొన్ని ప్రత్యేక సందర్భాలలో శ్రీ బాబాగారి వద్ద ప్రత్యేక వేడుకలు జరిపేవారు. అంటే ఆ రోజుల్లో బాబాను ఆ రూము నుండి బయటకు తీసుకువచ్చి వరండాలో పల్లకీలో కూర్చోబెట్టి, అలంకరించి వారి సన్నిధిలో భజనలు, పూజలు చేయడం వంటివి. నాకు మాములుగా ఆదివారాలు వెళ్ళడం అలవాటు కానీ ఎప్పుడు ఇటువంటి వేడుకలు జరుగుతాయో ముందుగా అక్కడ విచారించి తెలుసుకొని వెళ్ళడం చేసేవాడిని కాదు. అయినప్పటికి నాకు ముందుగా ఏమాత్రం తెలియకపోయినా, అప్పటికప్పుడు ఆ రోజు మనస్సులో తీవ్రంగా బాబా దర్శనానికి వెళ్ళాలనే తపన, ప్రేరణ కలిగి ఎవ్వరితోను చెప్పకుండానే ఉన్నపళంగా వెళ్ళిపోయేవాడిని. వెళ్ళిన తరువాత తెలిసేది, ఎందుకు బాబా అలా బలంగా ప్రేరణ కల్పించి రప్పించుకున్నారో! ఇది కాకతాళీయమేమో అనే సందేహానికి ఏ మాత్రం తావులేకుండా, అదే విధంగా ఒకటి,రెండు సార్లు కాక ఎన్నోసార్లు అలా చేశారు. ఎంతో ఆశ్చర్యకరంగా ఉండేది! ఆ ముందురోజుకానీ, ఆ రోజైనా కొద్దిముందు కానీ బాబా వద్దకు వెళ్ళాలన్న సంకల్పం లేనివాడిని అప్పటికప్పుడు ఎవరో లాక్కెళ్ళినట్లు బాబా వద్దకు వెళ్ళడం - అప్పుడే ప్రత్యేక కార్యక్రమం జరిగే రోజు మరియు సమయం కావడం! ఆ విధంగా బాబా అనుభవపూర్వకంగా వారి సర్వవ్యాపకత్వాన్ని, సర్వప్రేరణాధికారిత్వాన్ని తెలియపరుస్తూ ఉండేవారు. అలాగే బస్సు ప్రయాణంలో కళ్ళు మూసుకొని నామస్మరణ చేసుకుంటూ వెళ్ళేప్పుడు కానీ, నిద్రపోయినప్పుడు కానీ సరిగ్గా బస్సు దిగవలసిన స్టాపు రాగానే కళ్ళు తెరచి వెంటనే దిగేట్టు చేసేవారు. అందుకే కాబోలు **అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థిత:** అంటారు. బాబా నామాలలో 'బహిరంతర్ వ్యాపినే నమ:' అన్నదీ ఇందుకే కదా!

### 2. నామస్మరణ, మనోనిగ్రహాల ఆవశ్యకత గూర్చి తెలియపరచుట:

శ్రీ బాబాగారి దర్శనానికి మేము నివసిస్తుండే ప్రదేశం నుండి వెళ్ళడానికి సుమారు గంటన్నర సమయం పట్టేది. రెండు, మూడు సిటీ బస్సులు మారి వెళ్ళాలి. బాబా వుండే ఇంటి సందు మలుపు వద్ద వుండే బడ్డీ కొట్టులో రెండు సిగరెట్లు కొని తీసుకు వెళ్ళేవాడిని. వారు ఉండే ఇంట్లోకి ప్రవేశించడానికి ముందుగా బయట ఉండే కుండీలోని నీళ్ళతో కాళ్ళు కడుక్కొని, మెట్లు ఎక్కి (మూడు, నాలుగు ఉండేవి) హాలులో ప్రవేశిస్తాము. అక్కడ మహాత్ముల పటాలూ, ఎడమవైపున గోడకి బాబా పెద్ద పటమూ అమర్చి ఉంటాయి. ఆ రూము దాటి అవతలవైపుకు మెట్లు దిగి వెళితే బాబా ఉండే రూము వస్తుంది. హాలులో నుండి ఆ రూము కనిపించినా, ముఖద్వారం ఇంకొక దిశలో ఉండడం వలన, ఇటువైపు అడ్డంగా పరదాలు, చాపలూ కట్టి ఉండడం వలన బాబా మనకు కానీ, మనం బాబాకు కానీ కనిపించం. మెట్లు దిగి ఎడమవైపుకు వెళ్ళి, అటు పక్కగా ఉన్న ద్వారం వద్దకు వెళితే బాబా దర్శనం అవుతుంది.

అయితే బాబా స్పందన కేవలం మనం ఆయన ఎదురుగా ఉన్నప్పుడు ప్రవర్తించే తీరును బట్టి గాక మనం ఇంటినుండి బయలుదేరినది మొదలు బాబా సన్నిధి చేరే వరకూ మన మనస్సును ఎలా వుంచుకున్నామనే దానిని బట్టి ఉంటుందని తెలియబరచారు.

హృదయపూర్వకంగా, అన్యతలంపులు లేకుండా నామస్మరణ చేసుకుంటూ, బాబానే మనస్సులో ధ్యానిస్తూ వారి దర్శనానికి వెళితే వారి స్పందన విశేషంగా ఉండేది! వారు సిగరెట్టు అడిగి తీసుకొని అగ్గిపుల్ల వెలిగిస్తే దానితో అంటించడం కోసం మంచం దిగి ముందుకు వచ్చి సిగరెట్టు వెలిగించుకొని త్రాగేవారు. తన దృష్టిని మనపై సారిస్తూ ప్రసన్నంగా ఉండేవారు. సాధారణంగా బాబాను స్పృశించి పాద నమస్కారం చేసుకొనే అవకాశం ఉండదు. కారణం వారు ఉండే రూము తలుపు గడియ పెట్టబడి వుంటుంది. కాని బాబా దర్శనానికి వచ్చేటప్పుడు అన్య చింతలు లేకుండా, అందరిలో బాబా ఉన్నారని భావన చేసుకుంటూ వస్తే ఏదో ఒక విధంగా బాబా స్పర్శ, పాద నమస్కారం చేసుకునే భాగ్యం కల్పించేవారు. ఆసమయానికి ఎక్కడో దూరప్రాంతాల నుండి బాబా దర్శనం కోసం వచ్చినవారు అక్కడవారిని బాబాకు నమస్కరించుకోవటానికై అర్థిస్తే బాబా ఆసమయంలో ప్రసన్నంగా ఉంటే తలుపు తీసి లోనికి పోనిచ్చేవారు. ఎవ్వరూ అలా రాకపోయినా మరేదో విధంగానైనా ఆ

అవకాశాన్ని బాబా కల్పించేవారు - నామస్మరణ, మనోనిగ్రహాల ఆవశ్యకత తెలియపరచడానికై. అలా కాక, దారిలో బస్సులో వచ్చేటప్పుడు అన్యచింతలతో రోడ్డుమీద సినిమా పోస్టర్లు చూస్తూనో, రోడ్డున పోయే అమ్మాయిలను చూస్తూనో వెళితే ఇంకా ఇంటిలోనికి ప్రవేశించకుండానే కాళ్ళు కడుక్కొని మొదటి గది మెట్లు ఎక్కుతుండగానే బాబా 'ఏయ్! ఏయ్!' అంటూ చాలా బిగ్గరగా అరిచేవారు.(నిజానికి ఇంతకు ముందు ప్రస్తావించినట్లు బాబా వుండే గది నుండి ఇక్కడ ఎవరైనా వచ్చినది లేనిది కూడా కనిపించదు. అయినా సర్వజ్ఞులయిన బాబాకు ఆ తెరలు అడ్డా!). అసలు వారి ఎదురుగా రానిచ్చేవారు కాదు. ఎంతో సేపు అలా అరుస్తూవుండేవారు. ఒక వేళ వూరుకున్నా, మళ్ళీ వారి ఎదురుగా వెళ్ళగానే అరచి ప్రక్కకు వెళ్ళేదాకా కేకలు వేసేవారు. మనం బాబా అరుస్తున్నా ప్రక్కకి తొలగిపోకుండా ఒకవేళ అక్కడే నుంచుంటే అక్కడివారు వచ్చి మనలను ప్రక్కకి తొలగిపొమ్మని హెచ్చరించి అక్కడి నుండి మరో గదిలో వచ్చేసేలా చేస్తారు. ఆవిధంగా బాబా దర్శనానికి వచ్చేటప్పుడు మనస్సును పవిత్రంగా, నిలకడగా ఉంచుకోవాలని బాబా నోటితో వివరించకుండానే అనుభవంతో హృదయగతం అయ్యేట్టు చేస్తారు.

ఆ తరువాత నెమ్మదిగా కేవలం బాబా దర్శనానికి వచ్చేప్పుడు భక్తి, శ్రద్ధలతో రావడమే కాదని, ఆ వారమంతటిలో ఎలా ఉన్నామన్నదీ వారికి తెలుస్తూనే ఉంటుందనీ, బాబా దర్శనానికి వెళ్ళేప్పుడు ఏవిధంగా స్మరణతో వెళ్తామో అదే విధంగా రోజూ కాలేజీకి వెళ్ళివచ్చేప్పుడు ప్రయాణంలో ఉంటే వారికి అమిత ప్రీతి అనీ, తద్విరుద్ధమైన నడవడి వారికి అయిష్టమనీ ఎంతో స్పష్టంగా - ఎన్నోమార్లు ప్రకటించేవారు. అంటే ఉదాహరణకు ఆ వారంలో కాలేజీకి వెళ్ళివచ్చేప్పుడు స్మరణ చేయకుండా, అన్యచింతలలో ఉండి తరువాత బాబా వద్దకు వెళితే - బాబా ఎంతసేపటికైనా లేచి దర్శనమిచ్చేవారు కాదు. కనీసం వారి దివ్యముఖారవిందమైనా చూసే భాగ్యం లేకుండా మరో వైపుకు తిరిగి పడుకుని ఉండేవారు. ఎన్నిగంటలు ఎదురుచూసినా ఒక్కసారైనా ఇటు తిరగడం కానీ, లేచి సిగరెట్ స్వీకరించడం కానీ, వారి కృపాదృష్టి సారించడం కానీ చేసేవారు కాదు. అలా కాక వారంలో బాగా స్మరణ, హారతులు ఇవ్వడం, పారాయణ చేయడం చేసి వెళితే ఎంతో ప్రేమతో, ప్రసన్నంగా చూస్తూ, సైగలు చేస్తూ ఇంతకుముందు వివరించిన విధంగా వారి ప్రత్యేక అనుగ్రహాన్ని చవి

చూపించేవారు. అందువలన ఇతరులెవ్వరూ (స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు) ప్రోత్సహించడం, నిర్బంధించడం లేకపోయినా, బాబా ప్రసాదించే ఆ ప్రత్యేక అనుగ్రహం, ఆశీస్సులకోసం వాటిద్వారా వచ్చే అపరిమిత ఆనందం కోసం ప్రతిరోజూ స్మరణ, వీలున్న హారతులు యివ్వడం, సత్సంగం చేసుకోవడం, పారాయణ చేయడం వంటివి బాబా చేయించేవారు.

ఇలా తరుచుగా బాబా దర్శనం లభ్యం కావడానికి ప్రత్యక్ష కారణాలు ఇంతకు ముందు ప్రస్తావించినట్లు మా అమ్మగారు : ఆమె మాష్టారి రచనలు చదువుతూ, సత్సంగం చేసుకుంటూ మహాత్ముల పట్ల ఎంతో గౌరవభావాన్ని కలిగివుంటూ, అత్యధిక సమయం ఆ చింతనలో వుండటం. మరో కారకులు శ్రీ పెసల సుబ్బరామయ్య గారు. బాబా వీరి ద్వారా సందర్భానుసారంగా వ్రాయించే లేఖలు మంత్రపూరితంగా అనుసంధించబడిన శరసదృశాలవలె ఆయా వ్యక్తుల హృదయాలలోకి దూసుకుపోయి తగినమార్పు తీసుకురావడం చాలామందికి అనుభవంలో విదితమే. దమ్మపేటలో సత్సంగం సుస్థిరంగా కొనసాగడానికి అటువంటి అస్త్రాలు పోషించిన పాత్ర వారు మా అమ్మగారికి, సత్సంగసభ్యులకు వ్రాసిన ఉత్తరాలను పరిశీలిస్తే అవగతమౌతుంది. ఆవిధంగా వ్రాయబడిన ఉత్తరాలలో, ఈ క్రింది ఉత్తరంలో వారు నాంపల్లిబాబా గారిని దర్శించడం గూర్చి వ్రాసినది మాకు పరోక్షంగా ఎంతగానో ఉపకరించింది.

-------

## శ్రీ సుబ్బరామయ్య గారు మా అమ్మగారికి వ్రాసిన ఉత్తరం

గొలగమూడి

25-03-1999

పూజ్యులైన శ్రీమతి జి.లక్ష్మక్క గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు.

మీరు వ్రాసిన లెటరు చేరినది. ఎన్నాళ్ళుగా ఉంటున్నారు. ఈవిధంగానైనా తమరు బాబా గారిని దర్శిస్తున్నారు. చాలా సంతోషం. వేసవి సెలవల్లోనైనా శ్రీస్వామివారి దర్శనానికి ఒకసారి గొలగమూడి రండి. శ్రీ సాయిమాష్టారు నిలయం చూడవచ్చు. శ్రీ మాష్టార్, శ్రీ సాయి,

శ్రీస్వామివారి పటాలు పెట్టి అఖండ దీపం ఉంచాము. నిత్యం సాయంత్రం 6:30 నుండి 8:00 వరకు సత్‌సంగం - చాలా కొద్ది మందితో ఎవ్వరూ రాకుంటే ఇద్దరితో. ఎవ్వరినీ పిలవటం లేదు. మిలారేపా చరిత్ర చదువుతున్నాము. అది కాగానే శ్రీ సాయి ప్రబోధామృతం తర్వాత అవధూతామృతం. శ్రీ మాష్టారికి నా మీద ఎంత దయో చూడండి. వారి నిలయాన్ని నిర్మించుకొని నా కొరకు నా దగ్గరుండి గైడ్ చేస్తున్నారు. కాని నేనే మొద్దుబారి కాలం వృథా చేస్తున్నాను. ఈమధ్య మూడు రోజులు మూడు సందేశాలిచ్చారు.

తొలి రోజు-ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు.

రెండవ రోజు-మాయ ఎవ్వరిని తనంతట తానుగా తనను అతిక్రమించనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నం ద్వారా మాయను అతిక్రమించాలి.

3వ సారి-సద్గురువును అక్కిం వెంకట్రామిరెడ్డి లాగా వెంబడిస్తే దైవదర్శనమే గాక భుక్తికి కూడా కొరత లేదు.

వారు నిత్యసత్యులని తన భక్తుల ఎదుట సర్వత్రా సర్వదా ఉన్నారని, పిలిచీ పిలవక ముందే పలుకుతానని పై సందేశాలద్వారా నిరూపించారు. వారిని ఏమీ కోరకుండా నిరంతరం నాకు తోడుగా వుండి నన్ను మీ ఇష్టమొచ్చినట్లు నడపండి. ఏది ముందు కోరాలో ఏది వెనక కోరాలో తెలియని బుద్ధిహీనుడను అని మాత్రం ప్రార్ధన చేస్తున్నాను.

అక్కయ్యా! ఎంత పుణ్యం చేసినామో మనందరం మాష్టారికి సన్నిహితులయ్యాము. ఇక ఈ జన్మకు ఏమీ అక్కరలేదు.

బాబు! ఏ పనైనా సక్రమంగా చెయ్యాలంటే మన చేతిలోని పనిముట్లు (ఇంప్లిమెంట్) మంచిదిగా ఉండాలి. అది ఎంత మంచిదైతే మనం అంత చక్కగా చేయగల్గుతాము. ఈ శరీరంతో మనం భగవంతునికి సేవ చేసి తరిస్తాము. ఇంజనీరు తన మేధా సంపత్తితో సేవిస్తే కార్మికుడు తన కండ బలంతో సేవిస్తాడు. ఎక్కువ తక్కువలు లేవు. గనుక నీవు నీ మెదడుకు మేత బెట్టి చక్కని ఇంజనీరువైతే నీ ద్వారా దేశము అనబడు దైవకార్యానికి మంచి సేవ దొరుకుతుంది. గనుక ఇప్పుడు చేయవలసిన

పూజ, ధ్యానం అంతా చదువే. నీవు ధరించబోయే ఇంప్లిమెంట్ పరికరాన్ని బాగా పదును పెట్టుకొని చక్కని ఇంప్లిమెంట్ తయారు చేసుకోవాలి. అది భగవంతుడు మనకు నిర్దేశించిన పని. ఆ పని అత్యంత గొప్పగా నెరవేర్చేటట్లు చేయమని శ్రీ నాంపల్లిబాబాగారిని ప్రార్థించు. సత్ పౌరుడుగా నాకిచ్చిన కార్యాన్ని దేవునకు ఎంతో తృప్తికలిగేటట్లు నెరవేరేటట్లు ఆశీర్వదించమని అడుగు. అడగడమే కాక సాధ్యమైనంత వరకు నీ వైపు నుండి హృదయపూర్వకమైన కృషి చెయ్యి.

నీకు ఏమాత్రం తీరిక ఉన్నా '**నాకు తెలిసిన మాష్టారు**' అనే పుస్తకం మరలా మరలా చదివి శత్రుమిత్రుల ఎడల సమభావం, మానావమానాలలో సమతుల్యంగా ఎలా ఉండాలో బాగా ఆలోచించి మాష్టారి ఆచరణ ఎలా ఉండేదో చూచి నేర్చుకో. చేతికి వచ్చిన ప్రతి పైసాను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చెయ్యి. శ్రీ బాబా గారి దగ్గరకు పోయినప్పుడల్లా పై ప్రార్థన చెప్పుకొని నిశ్చలంగా బాబా రూపాన్ని ధ్యానిస్తూ వారి సన్నిధిలో సాధ్యమైనంత సేపు ఉండు. వారి సన్నిధిలో మాటలు మాను. అలా చేస్తే వారి సన్నిధి మనకు చక్కగా ఉపయోగపడుతుంది.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

పెసల సుబ్బరామయ్య

-----------

శ్రీ నాంపల్లిబాబా రూపంలో తెలియజెప్పిన ఈ అమూల్య విషయం (నామస్మరణ, మనోనిగ్రహాల గూర్చి ) బాబా శ్రీ సుధీంద్రబాబు గారి రూపంలో హెచ్చరించి బలపరిచారు. హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదవటం పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ పాల్వంచలో చదవడంతో నాంపల్లిబాబా దర్శనానికి వెళ్ళడం ఆగిపోయినది (ఎప్పుడో హైదరాబాద్ వెళ్ళినప్పుడు తప్ప). ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం పూర్తయి వేసవి శెలవులకు మా పెద్దమ్మగారి ఇంటికి పాలకొల్లు వెళ్ళాను. ఆ శెలవుల కాలం ఒక నెలపైగా ఆటలు, టీ వి చూడటం, కబుర్లతో గడిచిపోయింది. ఇక కొద్ది రోజులకు కాలేజీ తెరుస్తారు అనగా ఇంటికి వెళ్ళబోయే ముందు దగ్గరలో వున్న శ్రీ చివటం అమ్మ దర్శనం, శ్రీ సుధీంద్ర బాబు గారి దర్శనం చేసుకొని వెళదామని ఉద్దేశ్యంతో తణుకు దగ్గర వున్న చివటం

వెళ్ళి అవధూత శ్రీ చివటం అమ్మ సమాధిని దర్శించుకొని, అక్కడనుండి దగ్గరలో వున్న వుండ్రాజవరంలో శ్రీశ్రీశ్రీ సుధీంద్రబాబు గారి దర్శనానికి వెళ్ళాను. బాబు గారు తలుపు తీసి - ఎవరు కావాలి? అన్నారు. మీ దర్శనానికి వచ్చానండీ అన్నాను. బాబుగారు 'తీరిక అయినప్పుడు వస్తే కుదరదు. వెళ్ళు' అని తలుపు వేసేశారు.

వారి వాక్కు, చర్య ఆ క్షణంలోనే నా హృదయంపై బలమైన ప్రభావాన్ని చూపాయి. మరుక్షణంలోనే నేను చేసిన తప్పు, దానికి పరిష్కారం హృదయంలో విస్పష్టం చేశారు. వారి దర్శనానికి ఇంతకుముందు శ్రీ నాంపల్లిబాబా తెలియజేసిన విధంగా పారాయణ, నామస్మరణ, భక్తి శ్రద్ధలతో వెళ్ళాలిగాని ఆటలు, టీవి చూడటం వంటి వ్యర్థ కాలక్షేపాలలో రోజులు గడిపి, వాటిలో బిజీ అయిపోయి (శెలవులన్నీ ఆ విధంగా ఖర్చుచేసి) ఇప్పుడు ఇంక ఇంటికి వెళ్ళబోయే ముందు ఒకటి రెండు రోజులు ఖాళీ (తీరిక) చేసుకొని వారి దర్శనానికి వెళ్ళడం ఎంత ఘోరం! హైదరాబాద్‌లో అన్నిసార్లు బాబా తెలియజేసింది ఏమైంది? అది మరిచి నేను ఏ ముఖం పెట్టుకొని వారి దర్శనాన్ని, సన్నిధిని ప్రసాదించమని అర్థించ అర్హుడను? ఆ నెల రోజులుగా నా ప్రవర్తనకు నాపై నాకే అసహ్యం, సిగ్గు వేసింది. అందుకే ఈసారి మాత్రం ఇక బాబుగారిని ఏ మాత్రం వత్తిడి చేయ మనస్సు రాలేదు (అంటే ఇంకా అక్కడే నిలబడి వారు మళ్ళా తలుపు తీయాలనే ఉద్దేశ్యంతో మొండికేసుకొని ఉండడం). వెంటనే నమస్కరించుకొని తిరిగి వెళ్ళిపోయి వారం రోజులు శ్రద్ధగా పారాయణ, దైవచింతనలో గడిపి అప్పుడు తిరిగి బాబుగారి దర్శనానికి వెళ్ళాలన్న ప్రేరణ కలిగించారు. (అది బాబుగారి రూపంలో బాబా చేసిన మౌనబోధ అని నా విశ్వాసం). ఆ విధంగానే తిరిగి పాలకొల్లు వెళ్ళి పారాయణ చేయించి తరువాత బాబుగారి పునర్దర్శనానికి వెళ్ళేట్టు చేశారు. నేను వెళ్ళినప్పుడు బాబుగారు ఊళ్ళో లేరు అందువలన బాబుగారి దర్శనం కాలేదు. నేను ఇంటికి వెళ్ళిన తర్వాత కొన్ని రోజులకు నేను అడగకుండానే కలలో సుధీంద్రబాబుగారు దర్శనం అనుగ్రహించారు. ఈ సంఘటన జరిగినది 2001 వ సం॥లో. ఇదే విషయమై (నామస్మరణ, మనోనిగ్రహాల ఆవశ్యకత) 2007 వ సంవత్సరంలో సద్గురు శ్రీ దర్గాస్వామివారు ఈ క్రింది సంభాషణలో సుస్పష్టం చేశారు:

**ప్రశ్న:** స్వామీ! మేము ఏం చేస్తే, ఏ విధంగా నడుచుకొంటే మీకు తృప్తి కలిగించగలుగుతాము?

**స్వామి: మనసు నిలకడ చేసి ఏకాగ్రతతో నీలో వున్న సత్యమే అందరిలోను, అంతటా ఉందని తెలుసుకుంటే అందరికీ తృప్తిగా ఉంటుంది. నాకూ ఎంతో తృప్తిగా ఉంటుంది.**

**ప్రశ్న:** స్వామీ! మీరు నాలో ఉన్నదే - అందరిలోను ఉందన్నారు కానీ నాకు తెలియటం లేదు

**స్వామి: పాలను చూస్తూ వెన్న ఎక్కడుంది? నెయ్యి ఎక్కడుంది అంటే ఎక్కడుంటుంది? పాలను చిలికితే వెన్న కనిపిస్తుంది. అదే విధంగా మనసు నిలకడ చేస్తే, ఏకాగ్రతతో నీలో వున్న సత్యం తెలుస్తుంది. ముందు నీలో ఉన్న సత్యం తెలిస్తే తరువాత అంతటా ఉన్నది తెలుస్తుంది. నామస్మరణ చేస్తే మనసు నిలకడవుతుంది. పిలిచిన తక్షణమే (నామం ఉచ్ఛరించిన వెంటనే) సద్గురువే మనకు సరెండర్ అయి మన చెంత ఉంటారు. ప్రేమతో నామస్మరణ చేయి.**

దీనిని బట్టి శ్రీ నాంపల్లిబాబా, శ్రీ సుధీంద్రబాబుగారు, శ్రీ సద్గురు దర్గాస్వామి రూపాలు వేరైనా వారందరూ ఒకే పరమాత్మ స్వరూపాలనీ, వారందరి రూపంలో బాబానే మనం ఏ విధంగా నడుచుకోవాలో, వారు చెప్పినట్లు నడిస్తే వారికి ఎంతో సంతోషం కలిగించిన వారమౌతామో, తద్వారా మనకెంత సుఖ శాంతులు లభిస్తాయో మరలా మరలా తెలియజేస్తున్నారు. ఓ సద్గురుమూర్తీ! ఇకనైనా నువ్వు చూపిన మార్గంలో పయనించే దృఢ నిశ్చయాన్ని, తపననూ ప్రసాదించు తండ్రీ! ఇందరు మహనీయుల రూపాలలో మళ్ళా మళ్ళా నువ్వు అనంతమైన ప్రేమతో, కరుణతో తెలియజేస్తుంటే అవన్నీ మరచిపోయి ప్రవర్తిస్తున్న నేను బుద్ధిహీనుడను, కృతఘ్నుడను. నీవు ప్రసాదించిన అనుభవాలను స్మరించి, కొంతవరకైనా - కనీసం ఇప్పటినుండైనా పాటించకపోతే ఇక నీకు కృతజ్ఞతలు తెలుపుకొనేదెలా?

**3. భగవంతుడు పిలిస్తే పలుకుతాడు అని తెలియజేయుట:** బాబాగారు వారిని దర్శించడానికి వెళ్ళినప్పుడు వారి ముఖత: ఏమీ మాట్లాడకపోయినా, వారు ప్రేరణ ద్వారానూ, పరిస్థితుల రూపంలో తరచూ

వారు చెప్పదలచిన విషయాలను స్పష్టంగా తెలియచేస్తుండేవారు. దీనిని గురించే మాష్టారు బాబా సంప్రదాయంలో ఎప్పుడో ఒక్కసారి, ఒక ప్రదేశంలో చెవిలో మంత్రం ఉపదేశించడం కాదనీ, వారు సహస్ర ముఖాలతో నిరంతరం బోధ చేస్తూనే ఉంటారనీ చెప్పారు. బాబాను తరచుగా దర్శిస్తుండే కాలంలో ఇంతకు మునుపు ప్రస్థావించిన విధంగా - మనం మనసులో నామస్మరణ చేస్తే వారికి తెలుస్తుందనీ, అదేవిధంగా మనసులో వారికి విన్నవించుకుంటే తెలుస్తుందనే తెలియచేశారు. దానికి తోడు వారు అనంత కరుణామయులు, ప్రేమమయులు కాబట్టి మనం ఏ విషయమైనా వారికి హృదయపూర్వకంగా విన్నవించుకొని, ప్రార్థిస్తే దానికి వారు సమాధానం తప్పక ఇస్తారనీ తెలియచేశారు. ప్రేరణ పెట్టి సాయిలీలామృతమో లేక శ్రీ గురుచరిత్రో ఏకాహం చేయించి ఆ రాత్రికి స్వప్నంలో - ఏ విషయం గూర్చి పారాయణ చేశానో దానికి - సమాధానం తెలియ చేసేవారు. జాగ్రత్తులో పరిస్థితులను ఆశ్చర్యం కలిగించే రీతిలో మార్పు తెచ్చి ఆయన యొక్క అదృశ్య అభయ హస్తాన్ని చూపించేవారు. ఈ విధంగా పలుమార్లు వారు నిరూపించడంతో నాకు తెలియకుండానే, హృదయంలో చెరగరాని రీతిన, వారు పిలిస్తే పలుకుతారు అనేది ముద్రించారు. తద్వారా ఏ విధంగా అయితే మనం తల్లి దండ్రులతో పాటు ఇంటి వద్దనే ఉంటే - ఏ పనైనా చేయబోయే ముందు వారికి చెప్పి, వారి సలహా మేరకు చేస్తామో, అదే విధంగా బాబాకు విన్నవించుకొని చేయడమనేది ఒక అలవాటుగా ఏర్పరచి - మానసికంగా వారితో అనుబంధం బలపరిచారు. వారు ఆ రోజుల్లో తెలియబరిచినట్లు ఇప్పుడు ఎప్పుడూ నడుచుకుంటే ఎంత బాగుంటుందో కదా! వెంకయ్యస్వామి వారు చెప్పినట్లు మానసిక అనుబంధం అనే టెలిఫోన్ లైన్ తెగిపోకుండా వుంటే వారు ఎప్పుడూ మనవద్దనే ఉంటారు అన్నది గుర్తుంచుకొని, ఆ విధంగా నడుచుకునేటట్లు చేయమని ప్రార్థిస్తున్నాను.

**ఎస్ నాగస్వామి నాయక్, వెల్గోడ్, కర్నూల్ జిల్లా, పిన్: 518533**

నేను శ్రీ నాంపల్లిబాబాగారు సశరీరముగా ఉన్నప్పుడు 2 సార్లు దర్శనము చేసుకున్నాను. 31 డిసెంబర్ 2003 ఉ॥ 11:30 లకు శ్రీ స్వామి దర్శనము అయ్యింది. శ్రీ స్వామి ఎదుట కూర్చున్న 10 నిమిషాలకు నాకు తెలియకుండానే కన్నులు మూసుకొనిపోవుట, ఘాడమైన నిద్దురపట్టింది. నిద్దుర లేచేసరికి 12 గం॥లకు ఆరతి జరుగుతోంది. శ్రీస్వామివారు ఉన్నచోట

వారు లేరు. ఆ రూపములో నాకు శ్రీ కృష్ణుని అవతారము దర్శనము అయ్యింది. ఆ విధముగా హారతి పూర్తి అయినంతవరకు వారు కృష్ణావతారములో ఉన్నారు. నా చేతినుండి 3 సార్లు సిగరెట్ అంటించమని వారు సైగ చేసినారు. నేను అదే విధంగా చేశాను. ఆ సమయంలో నేను వారికి ఒక ప్రదక్షిణ చేసినాను. ఇప్పటికీ వారు నా కళ్ళలో ఉన్నట్లు ఉంది. ఇది శ్రీ సాయి మాష్టార్ దయ వల్ల జరిగింది. శ్రీ బాబాగారు తిన్న పదార్థాలు కొద్దిగా నాకు ప్రసాదముగా లభించింది.

**K. రాధాదేవి, 103 మేఘనా అపార్టుమెంట్స్, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, Hyd**

1. నాంపల్లిబాబాగారు వివేకానంద కాలనీలో వున్నప్పుడు నేను ప్రతిరోజు ఉ॥ 11:30ని॥లకు భోజనము తీసుకొని హారతికి వెళ్ళేదాన్ని. ఒకరోజు సాయంకాలము 6:30ని॥లకు నేను ఇద్దరు భక్తులతో బాబా దర్శనం చేసుకొని ఒక అరగంట కూర్చున్నాము. ఇంటికి వెళ్ళాలనిపించక ఒక గంట అలాగే వున్నాము. వెళ్దామని లేచి నుంచొని బాబాను చూస్తూ వుంటే వున్నట్లుండి బాబా పెద్ద పెద్దగా '**పో, పో**' అని అరుస్తూ మీదకి వచ్చేస్తున్నారు. అప్పుడు మాకు భయము వేసి గబగబా ఇంటికి వెళ్ళిపోయాము. నేను ఇంటికి వచ్చి కూర్చున్నానో లేదో చెప్పలేనంత వర్షము, గాలి, దుమారముతో పాటు కరెంట్ కూడా పోయింది. అప్పుడు అర్థమైంది బాబా ఎందుకు '**పో, పో**' అని అరచి మమ్మల్ని పంపిచేశారో. **సకాలంలో బాబా నన్ను ఇంటికి పంపకపోతే ఇంట్లోవాళ్ళు కంగారు పడేవాళ్ళు మరియు నేను కూడా యిబ్బంది పడేదాన్ని. అంటే ఎప్పుడు ఏం జరగబోయేది బాబాకు స్పష్టంగా తెలును.** ఇదే విధంగా బాబా దగ్గర పారాయణ చేస్తూ కూర్చొని వుంటే బాబా చాలా సార్లు '**పో పో**' అని అరచి ఇంటికి పంపించేసేవారు బాధతో ఇంటికి వచ్చిన చాలా కొద్ది సేపటికి నా భర్త ఇంటికి వచ్చేవారు. నేను ఇంట్లో లేకపోతే నా భర్త తాళం లేక ఇంటి బయట నా కోసం ఎదురుచూస్తూ యిబ్బంది పడాల్సి వస్తుంది. కానీ బాబాకు నా భర్త ఎప్పుడు ఇంటికి వస్తారో తెలిసి, ఆయన సేవలో వున్న నన్ను సకాలంలో ఇంటికి పంపించి నా భర్తకు నా వల్ల ఇబ్బంది లేకుండా చేశారు.

2. కొంతకాలము బాబా దగ్గర లలిత, విష్ణు సహస్ర నామ పారాయణ, సాయి లీలామృత పారాయణ నలుగురు, ఐదుగురు భక్తులము కలసి చేసేవాళ్లము. ఒకసారి దసరాకు మా ఇంట్లో దేవుడ్ని,

బొమ్మలు పెట్టి లలిత, విష్ణు సహస్ర నామ పారాయణ చేసి నైవేద్యం పెట్టేసరికి ఆలస్యమై బాబా దగ్గరకు వెళ్ళలేక మనస్సులో బాధపడేదాన్ని. మా వారు ఉదయం వాకింగ్‌కి వెళ్ళినప్పుడు బాబా దర్శనం చేసుకొని నేను రాలేకపోతున్నాను అని బాబాకు చెప్పేవారు. ఒకరోజు నాకు స్వప్నములో బాబా కన్పడి 'ఏమిటీ రావడము మానేశావు, ఇక్కడ ఎవరూ లలిత, విష్ణు సహస్ర నామ పారాయణ, సాయి లీలామృత పారాయణ చేసేవాళ్ళు లేరు, అందువలన పారాయణ జరగటం లేదు. నీవు రాకపోతే ఎట్లా అని అరుస్తున్నారు. పులిహోర తెమ్మని' సైగ చేస్తున్నారు. తర్వాత త్వరగా పని ముగించుకొని బాబా దగ్గరికి వెళ్తే బాబా చెప్పినట్లు అక్కడ పారాయణ జరగటం లేదు. నన్ను చూడగానే బాబా పక పకా నవ్వారు. నేను తీసుకువెళ్ళిన పులిహోర వెంబడే తీసుకుని తిన్నారు. నా కలలో కన్పడి నన్ను హెచ్చరించి బాబా సేవ చేసుకొనే భాగ్యం కల్గించారు.

ఇక్కడ శ్రీ భరద్వాజ మాష్టారు గారు పరిప్రశ్న అనే గ్రంథంలో (ద్వితీయ ముద్రణ: పేజీ నెం: 24) ఒక భక్తునికి ఇచ్చిన సమాధానంలో ప్రస్తావించిన విషయాన్ని 'జపపూజాదులేమి చేసినా యింటివద్ద కంటే నదీ తీరంలోను, అంతకంటే పుణ్యక్షేత్రంలోనూ, అన్నిటికంటే మహాత్ముని సన్నిధియందూ ఎన్నోరెట్లు అధిక ఫలితం కలిగియుంటాయని ఋషులందరూ చెప్పారు' గుర్తుంచుకోవాలి. ఆ విషయాన్నే నాంపల్లిబాబా రాధాదేవి గారి స్వప్నంలో కన్పడి హెచ్చరించారు.

3. 2008 ఫిబ్రవరిలో (బాబా సమాధి అయిన తర్వాత) మా అమ్మాయికి 5,6 రోజుల నుండి తలకాయ నొప్పిగా వుండి కొంచెం గూడా తగ్గలేదు. నేను బాబా దగ్గర 'ఏమిటి బాబా ఈ మధ్య మమ్మల్ని పట్టించుకోవటము లేదు, పిల్లకు తలనొప్పి కొంచెం గూడా తగ్గలేదు. నీవు తప్ప ఎవరున్నారు' అని చెప్పుకుని నమస్కారము చేసుకొని నిద్రపోయాను. నా స్వప్నంలో ఎక్కడో జనమంతా ఒక ప్రక్క తోసుకుంటూ వున్నారు. నేను వారిని తోసుకుంటూ లోపలికి వెళ్ళి చూస్తే బాబా కూర్చొని వున్నారు. నేను, నా పాప ఆ జనంలో ఒక ప్రక్క కూర్చున్నాము. బాబాగారు మా ప్రక్కకు తిరిగి చెయ్యి పెట్టి పిలుస్తున్నారు. ఎవరినో అనుకుని వెళ్ళలేదు. మరలా చేయి చూపించారు. నేనా అంటే కాదు అని మా అమ్మాయిని చూపించారు. మా అమ్మాయితో పాటు నేను కూడా వెళ్ళాను బాబా దగ్గరకు. బాబా మా అమ్మాయి చెంపలు వాయించి తలమీద పట

పటా కొట్టారు. మా అమ్మాయి నుండి ఒక చిన్న పాప బయటకు పోయింది. తరువాత నా చెంప మీద ఒకటి కొట్టారు. తర్వాత రోజుకల్లా మా అమ్మాయికి తలనొప్పి తగ్గిపోయింది.

**కెసిరెడ్డి సీతారత్నం, ఇం.నెం ; 16, 11-19/6/6 పై అంతస్తు, రాజేశ్వరి నిలయము, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్**

1995 నుండి బాబా గారిని దర్శించుకుంటున్నాము. 1999లో నాకు అనారోగ్యమై డాక్టర్లకు చూపిస్తే పరీక్షలు చేసి నాకు క్యాన్సర్ 3వ స్టేజీ దాటి 4వ స్టేజీకి వచ్చింది, వైద్యం అనవసరం, ఆపరేషన్ చేసినా బ్రతకనని మా పిల్లలకు చెప్పారు. ఆ సమయంలో నాంపల్లిబాబా దగ్గరకు వెళితే బాబాగారు డాక్టర్ సర్టిఫికెట్‌లు తీసుకుని నలిపి 'జావ్ జరా' అని 2,3 సార్లు అన్నారు. తర్వాత మరలా హాస్పిటల్‌కి చెకప్ కోసం వెళ్ళాం. ఇంతకు ముందు చేసిన పరీక్షలకు, ఇప్పుడు చేసిన పరీక్షలకు తేడా వస్తే డాక్టర్లు చూసి ఆశ్చర్యపోయారు మరియు ఆపరేషష్ చేస్తే బ్రతుకుతానని చెప్పారు. తర్వాత ఆపరేషన్ చేస్తున్నప్పుడు ఆక్సిజన్ అయిపోయి నా ప్రాణం పోయింది. ఈ అనుకోని సంఘటనకి డాక్టర్లు హడలిపోయారు మరియు ఏం చెయ్యాలో పాలుపోలేదు. 15, 20 నిమిషాల తర్వాత మరలా ప్రాణం కదిలింది. డాక్టర్లు అందరూ ఆశ్చర్యపోయి తర్వాత నాతో 'మీరు ఏ దేవుడ్ని పూజిస్తారో ఆ దేవుడే మిమ్మల్ని కాపాడారు' అని అన్నారు. 'జావ్ జరా' అనే మాటతో నా అనారోగ్యాన్ని తీసేసి నాకు ప్రాణభిక్ష పెట్టారు బాబా. నా పెద్ద కొడుకుకి బాబా ఆశీస్సులతో వివాహం జరిగింది.

**రాజు గారు (నాంపల్లిబాబా సమాధి పూజారి)**

1990లో నేను శిరిడీలో వుండేవాడిని. ఒకసారి గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనం చేసుకొని వెళ్ళిన తర్వాత రెండవసారి ఒకవారం రోజులుందామనుకొని గొలగమూడికి వచ్చినప్పుడు శ్రీ సుబ్బరామయ్యగారిని కలుసుకున్నాను. తర్వాత మూడవసారి వచ్చినప్పుడు గొలగమూడిలో మూడేండ్లు వున్నాను. మొదట్లో సుబ్బరామయ్య గారింటి ప్రక్క బిల్డింగులో వున్నాను . ధ్యానం చేసుకుంటుంటే భరద్వాజ మాష్టారుగారు ఫుల్ బనియన్ వేసుకొని కన్పడ్డారు. అలా ఫుల్‌బనియన్ మాష్టారుగారు వేసుకొనేవారని శ్రీ సుబ్బరామయ్యగారిని అడిగితే చెప్పారు. భరద్వాజ మాష్టారుగారు గొలగమూడికి వచ్చినప్పుడు ఆ యింట్లో (నేను

అప్పుడున్న యింట్లో) ధ్యానం చేసినట్లు, మాష్టారికి శ్రీ సుబ్బరామయ్యగారు పూజ చేసినట్లు తెలిసింది. మధ్యలో దర్గాస్వామి గొలగమూడి వస్తే ఆయన పాదసేవ చేసుకోవటం జరిగింది. నాకు ఎప్పటినుండో భౌతికంగా వున్న మహనీయులను సేవించుకోవాలని కోరిక వుండేది. అందువలన ఆయన సేవ చేసుకుందామని దర్గాస్వామి దగ్గరకు వెళ్ళి అక్కడ కొన్ని రోజులున్నాను. మరలా గొలగమూడి వచ్చి మూడేండ్ల తర్వాత శిరిడీకి వెళ్ళాను. గొలగమూడిలో వున్నప్పుడు స్వామికి భిక్షాన్నం తీసుకురావటం, మందిరంలో స్వామి చరిత్ర చదివి వినిపించడం, సాయి మాష్టార్ నిలయంలో ఆరతులు యివ్వటం, బ్రహ్మంగారి మందిర నిర్మాణంలోను, సాయి మాష్టారు బిల్డింగ్ నిర్మాణంలోను పని చేయటం ద్వారా స్వామికి సేవ చేసుకునే భాగ్యం కలిగింది. గొలగమూడిలో సుబ్బరామయ్యగారి సత్సంగం, నిష్కామ కర్మలు నేను ఇప్పుడు ఈ విధంగా నాంపల్లిబాబా గారి సేవ చేసుకుంటానికి మార్గదర్శకాలు.

2001 సం॥లో నా మిత్రుడు హరితో దత్త క్షేత్రాలు, రమణాశ్రమం చూసుకొని శిరిడీకి వచ్చాను. అక్కడ వుండాలనిపించి శిరిడీలో వుండిపోయాను. హరి ఒకసారి శిరిడీ వస్తూ హైదరాబాద్‌లో వున్న నాంపల్లిబాబాను దర్శించుకున్నాడు. అప్పుడు నాంపల్లిబాబాను గౌలిపుర నుండి వివేక్ నగర్ కూకట్‌పల్లికి తీసుకు వచ్చారు. బాబాకు సేవ చేయటానికి ఎవ్వరూ లేరు. భక్తులు వచ్చి దర్శనం చేసుకొని వారున్నంత సేపు బాబాకు సేవ చేసేవారు కాని ఎవ్వరూ ఆయనతోటి లేరు. ఈవిషయం బాబాను వివేక్‌నగర్‌కి తీసుకువచ్చిన వారిలో ఒకరు హరితో ప్రస్తావించగా హరి నా గురించి చెప్పి ఇప్పుడు శిరిడీలో వున్నానని అడిగి చెప్తానని చెప్పి శిరిడీ వచ్చాడు.

ఒకరోజు మధ్యాహ్నం నందదీపం దగ్గర ప్రదక్షిణలు చేస్తుంటే నన్ను కలుసుకొని నాంపల్లిబాబా అనే మహనీయులు హైదరాబాదులో వున్నారు, భరద్వాజ మాష్టారు కూడా ఆయన గురించి చెప్పి వున్నారు. ఆయన ఇప్పుడు వివేక్ నగర్ లో వున్నారు ఆయనకి సేవ చేయటానికి ఒక సేవకుడు కావాలని దాని గురించి చెప్పటానికి ఇక్కడకు వచ్చానని చెప్పాడు. నేను 'మొదటి నుండి నేను బాగా విశ్వసించినది బాబాను మరియు శిరిడీలోనే వుండి పోదామనుకుంటున్నాను. మరి బాబా సంకల్పం ఎలా వుందో కదా' అని చెప్పాను. రెండు రోజులు వెయిట్

చేసాను. సుబ్బరామయ్యసార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పి వెళ్ళాలా వద్దా అని అడిగితే **నన్ను బాబా సమాధి వద్ద చీట్లు పెట్టి ఏది వస్తే అది ఆయన ఆదేశంగా భావించి చెయ్యి అని చెప్పారు. నేను చీట్లు వేస్తే నాంపల్లి బాబా దగ్గరకు వెళ్ళమని వచ్చింది.** కానీ మనస్సు అంగీకరించట్లేదు శిరిడీ నుండీ వెళ్ళాలంటే. తర్వాత దర్గాస్వామికి ఫోన్ చేసి చెప్తే **దర్గాస్వామి (నీలకంఠరావు పేట, కడప) 'ఆయన సాక్షాత్తు పరమేశ్వరుడు. ఆయన దగ్గర కెళ్ళి సేవ చేసుకో కృప కలుగుతుంది'** అని చెప్పారు. **శ్రీ శివనేశన్ స్వామిని సేవించుకున్న సియారాంగారు కూడా నాంపల్లిబాబాగారు భౌతికంగా వున్నారు ఆయనను సేవించుకోమని** చెప్పారు. మనస్సులో ఒక ప్రక్క భౌతికంగా వున్న మహనీయుని సేవ చేసుకొనే భాగ్యం కల్గిందని ఆనందం, మరొక ప్రక్క శిరిడీలో సంస్థానం వారు శివనేశన్ స్వామి వున్నప్పుడు ఆయన కిచ్చిన సేవను నాకు ఇచ్చారు (అంటే ద్వారకామాయిలో రోజు చిమ్మటం, పటాలు తడి గుడ్డపెట్టి తుడవటం, పల్లకీ సేవను సమకూర్చటం మొదలగు సేవలు) ఇప్పుడు ఆ సేవను వదిలిపెడితే మరలా యింతటి గొప్ప అవకాశం రాదని మనస్సులో తలచి నాంపల్లిబాబా దగ్గరకి వెళ్ళాలా వద్దా అనే దానిమీద ఒక నిర్ణయానికి రాలేకున్నాను.

ఒక రోజు రాత్రి ఖండోబా ఆలయంలో నేను, ఒక గృహస్థుడు పడుకున్నాము. ఆరోజు రాత్రి కలలో ఒక అడవి పంది నాతో పాటు పడుకున్న గృహస్థుడ్ని పొడిచింది. నేను దాన్ని తరుముదామని వెళు తున్నాను. అది నన్ను చూసింది కానీ ఏమి చేయలేకపోయింది! కల అంతరించింది. అర్థమేమి కాలేదు. నేను నిర్ణయం తీసుకోలేకుండా వున్నాను. మరుసటి రోజు కలలో ఒకాయన కన్పడి '**నేను, సాయి వేరు కాదు**' అని స్పష్టంగా చెపుతున్నాడు. నన్ను పిలుస్తున్నారు. నేను ఈయన ఎవరో అని ఆలోచిస్తుంటే కల అంతరించింది. తర్వాత రోజు హరితో కల గురించి చెపితే అతను హైద్రాబాద్‌లోని నాంపల్లిబాబా గారిని దర్శనం చేసుకొని వస్తూ వస్తూ తీసుకొచ్చిన బాబా ఫొటో చూపాడు. ఆ ఫొటో చూసిన తర్వాత తెలిసింది నాకు నిన్న రాత్రి కలలో దర్శనం యిచ్చింది నాంపల్లిబాబా అని. ఇంత జరిగినా వెళ్ళాలంటే ఒకప్రక్క భయంగానే వుంది, నిర్ణయం తీసుకోలేకున్నాను. ఒకరోజు ద్వారకామాయిలో నింబారు ప్రక్కన నీటి కుండ దగ్గర ధ్యానం చేసుకుంటుంటే ద్వారకామాయి

సాయిబాబా ఫోటో నుండి **పంచముఖాలతో ఆంజనేయస్వామి కన్పడి (ముఖం మాత్రం సాయిబాబాదే) 'ఎందుకు భయపడుతున్నావు. వెళ్ళు, నేను చూసుకుంటాను'** అని సందేశం వచ్చింది. వెంటనే నాంపల్లి బాబా దగ్గరకు వెళదామని నిర్ణయం చేసుకొని సమాధి దగ్గర దర్శనం చేసుకుంటే అక్కడ పూజారి నన్ను చూసి 'తుమ్ జానే(యే)గా' అని 2,3 సార్లు అనేసరికి అది బాబా సందేశంగా భావించి ఇంకొంచెం ధైర్యంతో తర్వాత వెంబడే శిరిడీ నుండి నాంపల్లిబాబా దగ్గరకు బయలుదేరాను.

మన్మాడులో అశోక్‌బాబా గారిని, జంగ్లీమహరాజుగార్ని వీలైనప్పుడు దర్శించుకుంటుండేవాడిని. మన్మాడులో అశోక్‌బాబా గారి దర్శనం చేసుకుందామని వెళ్ళేసరికి అశోక్ బాబా పడుకొని వున్నారు. లోపల ఆయన దగ్గర వున్నవాళ్ళు తలుపు తీయట్లేదు. నాతో పాటు చాలామంది బాబా దర్శనానికి బయట ఎదురు చూస్తున్నారు. రైలు టైమ్ అవుతోంది. ఒక్కసారిగా బాబా లేచి గేటు దగ్గరికి వచ్చి అందరిలో నాకొక్కడికే ఆయన పాద నమస్కారం చేసుకునే భాగ్యం కలిగించారు. అదే నాకు అశోక్‌బాబా గారు నన్ను నాంపల్లిబాబా దగ్గరకు వెళ్ళమన్నట్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు భావించి బయలుదేరాను. ప్రయాణంలో రాత్రంతా అశోక్ బాబా, నాంపల్లి బాబా కలలో వచ్చారు. తెల్లవారి హైదరాబాద్‌లో నాంపల్లిబాబా గారి దర్శనం చేసుకున్నాము.

## <u>బాబా మౌనంగా నా మనస్సులోని ఆలోచనలకు ఇచ్చిన అనుభవాలు మరియు చేసిన బోధలు:</u>

1. నేను బాబాతో 'బాబా! యింతకు ముందు ఎప్పుడూ మిమ్మల్ని చూడలేదు . మీరు మహనీయులని చెపుతున్నారు అందరూ. నేను వూరికే వుండి సేవ చేయటం మామూలు విషయం కాదు. మీరు ఏదైనా అనుభవం ఇస్తే దాన్ని అంటి పెట్టుకొని వుండగలనేమో, ఉంటాను బాబా అని చెప్పి మీరు మహనీయులైతే అనుభవం యివ్వండి' అని నమస్కరించుకున్నాను. మూడు రోజుల తర్వాత అన్నం, పెసర పప్పు, కూరగాయలు కలిపి వండి బాబా దగ్గర వుండే టీపాయ్ మీద ఒక మూలగా, చివరగా పెట్టాను. అప్పటికే చాలా తినుబండారాలు దానిమీద పెట్టి వున్నాయి. మనస్సులో 'నేను తయారుచేసిన ఆహారం 5 నిమిషాలలో మీరు స్వీకరిస్తే నేనిక్కడ వుండి సేవ చేస్తాను లేకపోతే వెళ్ళిపోతాను' అని

చెప్పుకొని ప్రక్కన వుండే బాబా ఫొటోకి నమస్కారం చేసి బాబావైపుకు తిరిగేసరికి నేను పెట్టిన బాక్సులో అన్నం తినేశారు. అది చూసి ఏదన్నా క్యాజువల్‌గా జరిగిందా అనే అనుమానంతో పాటు, అసలు తిన్నారు కదా అని సంతృప్తి చెందాను.

2. మొదట్లో వండటం ప్రారంభించినప్పుడు బాబా తిన్నా తినకపోయినా నేను తినేసేవాణ్ణి. ఒకరోజు పట్టపగలు కలలో 'అడవిలో ఒక పిల్లవాడు మేకలు మేపుతున్నాడు. నేను బాబూ! అన్నం తిన్నావా అని అడిగితే అతను నా మేకలు మేయలేదు అందువలన తినలేదు అంటున్నాడు. అప్పుడు మనస్సులో ఈ పిల్లవాడు తన మేకలు మేయకపోతేనే అన్నం తినలేదే! మరి నేను నా గురువుగారు తినకుండా తినేస్తున్నానే అన్పించి ఇంక ఆ రోజు నుండి నేను పెట్టిన అన్నం బాబా తింటేనే నేను అన్నం తినేది. బాక్సులో పెట్టిన అన్నం మొత్తం బాబా తిన్నా వండినదాంట్లో మిగిలినది తింటాను. అది మధ్యాహ్నం గంట 2 అవ్వనీ, 3 అవ్వనీ, 4 అవ్వనీ బాబా తింటేనే తినాలి' అని నియమం పెట్టుకున్నాను.

3. బాబా వున్న ప్రదేశానికి దగ్గర్లో ఏ హెూటల్ లేదని నేను వండుకునేటప్పుడే కొంచెం ఎక్కువ చేస్తే అది మధ్యాహ్నం వచ్చే భక్తులకు పెట్టవచ్చని ప్రారంభించినది క్రమేణా 50 మందికి వంట చేసేవాణ్ణి. ఒక పనమ్మాయిని కుదుర్చుకున్నాను. ఒకరోజు బాబాకు బాక్సులో అన్నం, కూర కలిపి పెట్టాను. మధ్యాహ్న ఆరతి అయిన తర్వాత భక్తులు ఎవరూ లేరు. కొంచెంసేపు ఎదురు చూద్దామని ధ్యానం చేసుకుంటున్నాను. ధ్యానంలో బాబాగారు 'ఉప్పు లేకుండా తినగలవా?' అని అడిగేసరికి వెంటనే ధ్యానం నుండి బయటకు వచ్చి నాకేమీ శారీరక రుగ్మత లేదు కదా, రుచుల కోసం తాపత్రయ పడట్లేదు కదా బాబా ఎందుకు యిలా అన్నారే అనుకుంటున్నాను. ఈ లోపు ముగ్గురు భక్తులు వచ్చారు. పనమ్మాయితో  అమ్మా! వచ్చిన భక్తులకు భోజనము పెట్టు, వచ్చేవాళ్ళు వస్తారు అంటూ ఉప్పు అవన్నీ సరిగ్గా వేశావేమో చూడు అన్నాను. పనమ్మాయి చూసి ఆకుకూరలో ఉప్పు వేయలేదని చెప్పింది. వెంటనే బాబా ధ్యానంలో చెప్పినది స్ఫురించి బాబాకు పెట్టిన బాక్సులో అన్నం తినకపోవటం చూసి వెంటనే ఒక చెంచా ఉప్పు వేసి బాక్సులోని అన్నంలో కలిపాను. కొంతసేపటికి బాబా అన్నాన్ని తిన్నారు.

4. కొంతకాలం తర్వాత నాకు ఒక అనుమానం వచ్చింది. నాకై నేనే ఇక్కడికి వచ్చానా? బాబా పిలిపించుకున్నారా? అని. నిజంగా బాబా పిలిపించుకుంటే ఇప్పుడు నేను చేసే సేవకు సంప్రీతులౌతున్నారా లేకపోతే నా యిష్టం వచ్చినట్లు నేను చేస్తున్నానా? బాబా ఏం మాట్లాడరు కదా మరి నా యీ ప్రశ్నకు సమాధానం ఏమిటి అని అనుకుంటున్నాను. 2004 జులై 2న గురు పూర్ణిమ. ముందరరోజు బాబా దగ్గర కూర్చొని మనస్సులో బాబా రేపు గురుపూర్ణిమ. గురుపూర్ణిమ రోజు గురువుకి దక్షిణ ఇవ్వటం హిందువుల సంప్రదాయం. మరి నేను గురుదక్షిణ సమర్పించుకుంటాను మీరు నేను చేసే సేవతో సంప్రీతులైతే అది మీరు స్వీకరించి ఉపయోగించాలి అని అనుకున్నాను. తర్వాత నేను కూకట్‌పల్లి బజార్‌కెళ్ళి 2 బెడ్ షీట్స్, 2 దిండ్లు, 2 దిండ్ల గలీబులు, ఒక రెడీమేడ్ పైజామా తీసుకువచ్చాను. ప్రతిరోజు నేనే నామస్మరణ చేసుకుంటూ హోటల్ నుండి ఫలహారం తీసుకువస్తే బాబా తినేవారు. మరి ఈ గురుపూర్ణిమ రోజు కూడా తీసుకొస్తాను, ఎంతమంది భక్తులు ఫలహారం తీసుకొచ్చినా నేను తెచ్చేది కూడా తినాలి అని అనుకొని హోటల్‌నుండి ఫలహారం తీసుకొచ్చాను. ఆ రోజు స్నానం చేయించుకోవటం, నేను తెచ్చిన ఫలహారం తినటం, **నేను తెచ్చిన పైజామా వేసుకోవటం ఒక అద్భుతం**. ఎందుకంటే 1970లో యాక్సిడెంట్ అయిన తర్వాత నుండీ ఎప్పుడూ దిగంబరంగా వుండేవారు. 1970 ముందర పైజామాలు వేసుకొనేవారు. అలాంటిది 2004 గురుపూర్ణిమ రోజు నేను తీసుకొచ్చిన పైజామా వేసుకొని 14 రోజులు తియ్యలేదు. పైజామా మాసిపోతే తీసేద్దామనుకుంటే తియ్యనివ్వలేదు. మాసిన పైజామాను చూసిన ఒక భక్తుడు క్రొత్త పైజామా తీసుకొచ్చి వేయమన్నాడు. 14 రోజుల తర్వాత బాబా వేసుకొన్న పైజామాను (నేను తీసుకొచ్చినది) తీసివేసి ఇంకొక భక్తుడు తీసుకొచ్చినది వేయబోతే వేయించుకోలేదు అంతేకాదు మరలా సమాధి అయ్యేవరకు ఎప్పుడూ పైజామాలు వేయలేదు బాబా. ఇలా నా మనస్సులో బాబాకు ఇస్తానని చెప్పుకున్న గురుదక్షిణను స్వీకరించి నేను బాబా దగ్గరకు రావటం ఆయన దివ్యప్రేరణేనని అర్థమైంది.

బాబా శరీరాన్ని సమాధి చేసినప్పుడు ఆ ప్రదేశం అంతా ఒక అడవిలాగా వుంది. తలదాచుకోవటానికి అవకాశం లేదు. బాబాకృప వలన నాకు మాత్రం బాబాను విడిచి వెళ్ళాలనే ఆలోచన రాలేదు. అప్పుడు

బాబా మందిర నిర్మాణానికని కొంతమంది భక్తుల సహాయంతో ఒక చందా పుస్తకం వేసి నాకు తెలిసిన పరిచయస్థుల దగ్గరికి వెళ్ళి విరాళాలు ప్రోగుచేసి మందిర నిర్మాణం ప్రారంభించాము. మందిర నిర్మాణం ఒక స్థితికొచ్చాక కొంతమందికి ఈర్ష్య, అసూయల వల్ల నేను చేసే పని గిట్టక చాలా అభాండాలు వేసి బాబాగారి రెండవ ఆరాధనకి ఒక మీటింగ్ పెట్టి నన్ను నిలదీయటం ప్రారంభించారు. అక్కడున్న సత్యవాణిగారు అందరితో 'రాజుగారు ఇక్కడ ఏం చేస్తున్నారో మేము చూస్తున్నాము ఆయన ఎలాంటివారో మాకు తెలుసు' అని గట్టిగా సమాధానం చెప్పేసరికి ఎవరూ ఇంక ఏమి మాట్లాడలేదు. ఆ రోజు రాత్రి సమాధి మందిరంలో కొంతమంది భక్తులు, నేను, సాయిబాబా మందిర పూజారి, ప్రసాద్ పడుకున్నాము. ప్రసాద్‌కి రాత్రి కలలో 'నాంపల్లిబాబా, ఆయన ప్రక్క నేను' చాలాసేపు కన్పడుతున్నాము. తెల్లవారి ఆ కల గురించి విన్నాక నిన్న సత్యవాణిగారి రూపంలో నన్ను ప్రక్కనుండి కాపాడారని మరియు కలను బట్టి బాబా నా ప్రక్కనే వుండి కాపాడుతున్నారనే విషయం తెలిసి ఎంతో ఆనందపడ్డాను. అంతేకాక ఈ సన్నివేశంతో బాబా మీద విశ్వాసం బలపడింది. చాలా బాధ్యతతో కూడిన మందిర నిర్మాణ పనిని నా చేత చేయించుకోవటం నా అదృష్టం. ఇప్పుడున్న సమాధి మందిరం నిర్మాణం జరగటం బాబాకృప వలన మాత్రమే జరిగింది.

## నేను (రాజుగారు) చూసిన బాబా సమాధి అనంతర లీలలు

1. శైలజగారు జె.ఎన్.టి.యు క్యాంపస్‌లో పనిచేస్తున్నారు. ఆమె చిన్నప్పటినుండి అమ్మవారిని, ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తూ వుండేది. ఆమెకు శారీరక రుగ్మతలతో పాటు, బ్రెస్టు క్యాన్సర్ వున్నది. ఒకసారి బాబాగారి దర్శనానికి వచ్చినప్పుడు నాకు చెపితే బాబా దగ్గరకు వస్తూ వుండండి, ఒక నిర్ణీత సమయంలో ప్రదక్షిణలు, పారాయణ చేస్తూ వుండండి. బాబానే చూస్తారు అని చెప్తే వస్తూ వుండేవారు. ఒక గంట ప్రదక్షిణలు చేసేది. ఒకరోజు 45 నిమిషాలు ప్రదక్షిణలు చేసాక విపరీతమైన నొప్పి వచ్చేసి నా వల్ల కాదు అంతిమదశ అని బాబాను స్మరిస్తూ నిన్ను నమ్ముకున్నాను బాబా ఏమి చేసినా నీ యిష్టం అని ప్రదక్షిణలు చేయటం వల్లకాక సమాధి మందిరంలో దక్షిణం వైపున కిరీటం పెట్టుకుని వుండే బాబా ఫొటోకి తల ఆనించి గోడకి ఆనుకొని కూర్చొని వుంది. ఒక పావుగంటలో నొప్పి అంతా తీసేసినట్లు పోయింది. మనిషి మాములుగానే వుంది. తర్వాత

ఆమెకు బాగా నొప్పి వచ్చింది ఎందుకో అని డాక్టరు దగ్గరకి వెళ్ళి చూపించుకుంటే పరీక్షలు చేసి ఆమెకు ఏ రోగమూ (బ్రెస్ట్ క్యాన్సర్ కూడా) లేదని నిర్ధారించారు.

2. వెంకటేశ్వరరావు గారు బ్యాంక్‌లో ఎస్టేట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకి బాబా అంటే ఏమీ పట్టదు. కానీ పనే దైవంగా నమ్మి పని చేస్తారు. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు. ఒకసారి బాబా గురించి నన్నడిగితే క్లుప్తంగా చెప్పాను. అప్పటినుండి వచ్చి దండం పెట్టుకొని వెళుతుండేవాడు. ఒకరోజు ఆయనకు చికెన్ గునియా జ్వరం వచ్చింది కానీ ఆయనకు అది చికెన్ గునియా జ్వరమని తెలియదు. ఆఫీసుకు వెళ్ళకుండా సెలవు పెట్టేసి యిబ్బంది పడుతున్నాడు. ఒకరోజు రాత్రి కలలో 'నేను(రాజుగారు) కనిపించి ఒంట్లో బాగోలేదా, మాత్ర వేసుకో' అని చెప్తున్నాను. తర్వాతరోజు మందులేకుండా జ్వరం తగ్గిపోయింది. తర్వాత ఈ విషయం నాకు చెప్తే నేను బాబా దగ్గర వుంటున్నాను కాబట్టి ఆ రూపంలో బాబా వచ్చి వుంటారు అని చెప్పాను. అప్పటినుండి రెగ్యులర్‌గా దర్శనం చేసుకొనేవాడు. మందిరం ఖర్చులకి ప్రతి నెల 2-3 వేల రూపాయలు యిస్తాడు. ఇప్పుడు బాబా ఏది చెప్తే అది చేస్తాడు.

**యల్లయ్య, కార్పెంటర్, మాదాపూర్**

ఇతనికి నెల జీతం 4,000 రూపాయలు. ఇంట్లో ఇతని తల్లి, భార్య, కొడుకు ఈ సంపాదన మీద జీవించాలి. వీరి అబ్బాయి 8వ క్లాసు చదువుతున్నప్పుడు గొంతు క్యాన్సర్ వస్తే కొంతమంది సహాయంతో బొంబాయిలో ఆపరేషన్ చేయించారు. ఒకటిన్నర సంవత్సరం తర్వాత మరలా క్యాన్సర్ పెరిగి దాని ప్రభావం చూపటం ప్రారంభించింది. అప్పటి ఆర్థికయిబ్బంది వలన మరలా ఆపరేషన్ చేయించలేదు. ఒకసారి ఎవరో చెప్పగా బాబా దగ్గరకు వచ్చారు. ప్రదక్షిణలు, పారాయణ చేయమని చెప్తే పిల్లవాణ్ణి తీసుకొచ్చి 40 రోజులు ప్రదక్షిణలు, పారాయణ చేసారు. 40 రోజుల తర్వాత డాక్టరుకి చూపిస్తే క్యాన్సర్ లేదని తెలిసింది.

**ఇది బాబా నాంపల్లిలో వున్నప్పుడు జరిగిన లీల - నాకు (రాజుగారికి) ఒక భక్తుడు చెప్పగా విన్నది**

ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో పనిచేసే ఒకావిడకి బ్రెస్టు క్యాన్సర్ వుండేది. ఎవరో చెప్పగా నాంపల్లిబాబా దగ్గరకు వచ్చింది. బాబా ముసుగు

కప్పుకుని పడుకుని వున్నారు. ప్రక్కవాళ్ళని అడిగితే ఎప్పుడు లేస్తారో చెప్పలేమని, అక్కడే వుండమని సలహా యిచ్చారు. కొంచెంసేపాగి ఆమెను చూడకుండానే బాబాగారు తన ఒక కాలిని ఆమె యొక్క రెండు వక్షోజాల మధ్య పెట్టారు. ఆమె కంగారుపడితే ప్రక్కనే వున్న మురళి అనే బాబా భక్తుడు ఒక తువాలు ఇచ్చి ఆమె వక్షోజాల మీద కప్పుకోమన్నాడు. బాబా అలా గంటన్నరసేపు వుంచి తీసేశారు తన కాలును. తర్వాత ఆమె ఏమి బాబా ఈయన ఇలాంటివాడని తెలియక వచ్చానని ఆమె వెళ్ళిపోయింది. వారం రోజులకు డాక్టరు దగ్గరకి వెళ్ళి పరీక్షలు చేస్తే అంతకు ముందు వున్న రుగ్మతలేమీ కన్పించలేదు. ఇదంతా బాబాగారి దయ అని ఆమె వచ్చి బాబా దగ్గర వున్న భక్తులకి తన అనుభవం తెల్పింది.

**శాంతారాంగారు (9290699388), 6-10-136, సాయినగర్, వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర, బాలానగర్**

నాకు అనారోగ్యంతో పాటు గాల్‌బ్లాడర్‌లో 70 రాళ్ళు, పైల్స్ వల్ల చాలా రక్తహీనతగా వుండేది. హిమోగ్లోబిన్ 14 వుండాల్సింది 2.38 మాత్రమే వున్నది. ఎప్పుడూ పడుకొనే వుండాలని డాక్టర్లు చెప్పారు. మాష్టారి రచనలు చదువుకుంటూ నాంపల్లిబాబాగారి సేవ చేసుకుంటూ మహనీయులను, వారి ఆశ్రమాలను దర్శిస్తుండేవాడ్ని.

ఒకరోజు లింగంపల్లిలో పూర్ణానందస్వామి ఆశ్రమానికి వెళ్ళి తరువాత నాంపల్లిబాబా సమాధికి వెళదామని నా భార్యతో ఆర్.టి.సి బస్సులో బయలుదేరాను. సీటు లేనందువలన నుంచోవల్సి వచ్చింది. ఒక 20 నిమిషాల తర్వాత కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి మియాపూర్ స్టాప్‌లో పడిపోబోతూ వున్నాను. నా భార్య నన్ను చూచి వెంటనే నాంపల్లిబాబాకి మనస్సులో 'బాబా! నువ్వు వున్నావు లేచిరా' అని మదీనాగూడ దగ్గర కన్పడే బాబా సమాధిమందిర గోపురాన్ని చూస్తూ చెప్పుకుంది. వెంటనే నాకు కాళ్ళు పైకి పెట్టి పడుకుంటే కాళ్ళలోని రక్తం క్రిందకి వస్తుందనే ఆలోచన వచ్చి బస్సు మధ్యలో కాళ్ళు పైకి పెట్టి పడుకున్నాను. మదీనాగూడ స్టాప్ వచ్చేసరికి లేచాను. చందానగర్ బస్సు స్టాప్‌లో నన్ను దించి కొబ్బరినీళ్ళు ఇప్పించారు. అంతటితో నన్ను మృత్యువు నుండి రక్షించారు. ఈనాటికీ ఆరోగ్యంగా వున్నాను. ఫ్యాక్టరీలో నా పని నేను చేసుకుంటున్నాను.

## శాంతారాంగారి భార్యకి సాయిబాబా సద్గురువుని చూపించటం

నాతో (శాంతారాంగారి భార్య) కూకట్‌పల్లి సత్సంగంవారు మీ గురువెవరో కనుక్కోమని చెప్తే గురుచరిత్ర పారాయణ చేసాను. శిరిడీ సాయిబాబా కలలో కనపడి ఒక యువకుడి ఫొటో చూపించి ఇతనే నీ గురువు అన్నారు. నేనెప్పుడూ అలాంటి వ్యక్తిని చూడలేదు. అందువల్ల నేను బాబాతో నన్ను వదిలిపెట్టద్దు నీవే నా గురువు అని చెపుతున్నాను. బాబా అరుస్తూ గురువును చూపించినా నా వెంటపడుతున్నావేమిటి, ఆయన్ని పట్టుకో అని చెపుతున్నారు. కల అంతరించిపోయింది. తర్వాతరోజు నా భర్తతో మాట్లాడుతుంటే ఆయన షర్ట్ జేబులోంచి నాంపల్లి బాబా యువకుడిగా వున్న ఫొటో క్రింద పడింది. ఆశ్చర్యంతో అది చూచి క్రిందటి రాత్రి సాయిబాబా కలలో కన్పించి నాంపల్లిబాబాను నా గురువుగా చెప్పారని తలచి ఆనందించాను. వీలున్నప్పుడల్లా బాబాగారి దర్శనానికి వెళుతుంటాను. ఇంట్లో సత్సంగాలు చేస్తున్నాము.

## నా (శాంతారాం) స్నేహితునికి సద్గురువును చూపించటం

నా మిత్రుడు శివశర్మకి తన సద్గురువుని తెలుసుకోవాలని ఇల్లు వదలి 3 నెలలు శిరిడీలో వున్నాడు అయినా దర్శనం కాలేదు. పైగా ఒక రాత్రి సాయిబాబా సంస్థానం సభ్యులలో ఒకరికి సాయిబాబా కన్పడి 'హైదరాబాద్ నుండి శివశర్మ అనే అతను ఇక్కడికి వచ్చి వున్నాడు. వాణ్ణి అర్జంట్‌గా శిరిడీ నుండి పంపిచెయ్య'మన్నారు. తర్వాతరోజు మధ్యాహ్నం కల్లా శివశర్మని పట్టుకొని వెళ్ళిపోమని ఒత్తిడి చేసి పంపించేశారు. హైద్రాబాద్ ఇంటికి వచ్చిన తర్వాత నాంపల్లిలో వుండే బాబా గురించి తెలిసి ఆయన దగ్గర 3 రోజులు వున్నా నాంపల్లిబాబా ఏమి చెప్పలేదు. అక్కడున్న పోలీసులు బాబాను ఏమైనా చెప్పమంటే బాబా అతని చేత బిరియాని, టీ తెప్పించుకొని తిని 'పో' అని అరిచారు. అతనికి బాబాను వదిలి రావాలని లేకపోయినా, అక్కడి పోలీసులు బాబా అలా అన్నారంటే ఏదో కారణం వుంటుందని అతనిని ఇంటికి పంపించారు. అతను నడుచుకుంటూ ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తెల్లవారుఝామున కలలో నాంపల్లిబాబా కన్పడి 'లే, ఇంకా నిద్ర పోతున్నావు' అని అరిచేసరికి వెంబడే నిద్రలేచి, స్నానం చేసి బయలుదేరాడు. ఎక్కడికి వెళ్ళాలో తెలియదు కానీ నడవకుండా వుండలేకపోయాడు. ఫతేనగర్ నుండి బాలానగర్,

సి.ఎమ్.టి చోరస్తా, ఐ.టి.పి.ఎల్, హెచ్.ఎమ్.టి క్వార్టర్స్‌లో నుండి నడుస్తుంటే ఒక ప్రక్క ఇంటికి తోరణాలు కట్టివుంటే ఇక్కడ స్వామీజీ ఎవరైనా వున్నారా అంటే లోపల శ్రీ పూర్ణానంద స్వామిగారు వున్నారని చెప్తే లోపలికి వెళ్ళేసరికి పూర్ణానందస్వామిగారు సోఫాలో కూర్చొని శివశర్మను చూస్తూ 'రా రా శివా! నీ కోసమే చూస్తున్నాను, బాబా పంపించాడా రా' అని అన్నారు. వెంబడే శివశర్మ స్వామి కాళ్ళు పట్టుకొని ఏడుస్తూ కూర్చున్నాడు. వచ్చేశావు కదా ఏడవకు అని ఊరడించారు స్వామి. తర్వాత శ్రీశైలంలో స్వామి దగ్గర 12 నెలలు వున్నాడు శివశర్మ. ఇలా సద్గురువును చూపించారు నాంపల్లిబాబా.

## శాంతారాం గారు చెప్పినది - సంతానం ఇవ్వటం

రామసీతగారికి పెళ్ళైన 10 సం॥ వరకు సంతానం లేదు. నాంపల్లిబాబా సమాధి అవటానికి ముందరనుండి బాబాను సేవిస్తున్నారు. బాబా సమాధి అయిన తర్వాత ఒకరోజు బాధతో 'నాకు పిల్లలని ఇవ్వకుండానే బాబా సమాధి చెందారు ఏమిటి నా సంగతి' అని ఏడ్చింది. ఆ రోజు రాత్రి కలలో నాంపల్లిబాబా కన్పడి 'ఎందుకు ఏడుస్తావు, ఏడవకు, నీకు ముందర పిల్లల్నియ్యాలి కదా! చచ్చుపుచ్చులందరూ వస్తున్నారే, మంచోడ్ని రానీయ్, వచ్చాక నీకు తప్పకుండా ఇస్తానని' చెప్పారు. అలాగే సంవత్సరం తర్వాత పిల్లవాడు పుట్టాడు.

## శాంతారాంగారు వుండే కాలనీలో ఒకావిడకి మగపిల్లవాణ్ణి ప్రసాదించటం

ఒకావిడకి పెళ్ళయిన 5 ఏళ్ళ తర్వాత ఇద్దరు ఆడ పిల్లలు పుట్టారు. తర్వాత 5 ఏళ్ళు అయింది. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయిద్దామనుకుంటూనే చేయించుకోలేదు. ఆవిడకి ఋతుక్రమం (మెన్సెస్) 3,4 నెలలకి వస్తూ వుంటుంది. ఒకసారి 7నెలలైనా మెన్సెస్ రాకపోతే డాక్టర్‌కి చూపిస్తే మెన్సెస్ రావటానికి మందు యిచ్చింది. మందు వాడినా ఋతుక్రమం రాకపోయేసరికి పరీక్ష చేయిస్తే ఆమె 7 నెలల గర్భవతి అని తేలింది. 2010 శ్రీరామ నవమికి మగ పిల్లవాడు పుట్టాడు. ముందరే గర్భవతి అని తెలిస్తే అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలున్నారని అబార్షన్ చేయించుకునేదే. కానీ బాబా ఆమెకు ఏమాత్రం అనుమానం రాకుండా 7 నెలలు వుంచారు ఎందుకంటే 7 నెలలకి అబార్షన్ ఏ డాక్టరూ చేయకూడదు. బాబాను ఏమీ ఆశించకుండా సేవ చేస్తూవుంటే ఆయన

కృప ఎలా వుంటుందో ఈ లీల ద్వారా తెలుస్తోంది.

**నాగరాజుగారు, 3-5-1118/1, షంషేర్‌బాగ్, కాచిగూడ క్రాస్ రోడ్, హైదరాబాద్-27, సెల్: 9848382217**

నేను ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాను. మా అబ్బాయికి (సాయి రితిక్) మెడమీద గడ్డ (గొంతు ప్రక్కగా) లేచి చాలా ఇబ్బంది పెడుతోంది. డాక్టర్లకు చూపెడితే ఆపరేషన్ చేసి తీసెయ్యాలి కానీ మాటలు పోవచ్చు అని సందిగ్ధం వ్యక్తం చేశారు. మా డిపార్టుమెంట్‌లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ బాపూజీ గారిని అడిగితే నాంపల్లిబాబా గారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేయండి అని చెప్పారు. శ్రీ భరద్వాజ మాష్టర్‌గారి సతీమణి అలివేలు మంగమ్మగారికి చెపితే నాంపల్లిబాబాను దర్శించుకోమని చెప్పారు. నేను ఒక 5 సప్తాహాలు ప్రతిరోజూ ఉదయం 5గం॥కి బయలుదేరి నాంపల్లిబాబా సమాధి దర్శనం చేసుకొని 108 ప్రదక్షిణలు, పారాయణ చేసుకుని ఆఫీసుకు వెళ్తుండేవాడ్ని. నా భార్య అప్పుడు తీపి పదార్థాలని వదిలివేసింది. మా అబ్బాయిని వారానికి ఒకసారి బాబా దర్శనానికి తీసుకువెళ్ళేవారము. 5 సప్తాహాల తర్వాత మా అబ్బాయికి ఆపరేషన్ చేయిస్తే ఆపరేషన్ అయిన 15 నిమిషాలకి మాములుగా మాట్లాడుతున్నాడు. ఇప్పటికీ ఎంతో ఆరోగ్యంగా వున్నాడు నాంపల్లిబాబా దయ వలన.

## నాగరాజుగారు వారి సత్సంగ సభ్యులకు జరిగిన బాబా లీలలు

1. మా ఇంటి దగ్గర మేస్త్రి కొడుకు రాజుకి గుండెలో రంధ్రం పడింది. దానికోసం ఒక పెద్ద హాస్పిటల్‌లో 3 నెలలు వున్నా ప్రయోజనం లేదు. బీదవారైనా చాలా డబ్బులు ఖర్చు పెట్టారు. తర్వాత మా యింటి సత్సంగంలో నాంపల్లిబాబా గురించి చెపితే ఒక నెలరోజులు నాంపల్లిబాబాకు ప్రదక్షిణలు, పారాయణ చేసారు. మరలా రెండవ నెలలో ఆ పిల్లవాడికి సూపర్ స్పెషాలటీ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. పిల్లవాడు ఇప్పటికీ ఎంతో ఆరోగ్యంగా వున్నాడు. సూపర్ స్పెషాలటీ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ జరిగి ఆ పిల్లవాడ్ని స్వస్థుడ్ని చేయటం నాంపల్లిబాబా దయ అని వారు నమ్ముతున్నారు.

2. సత్సంగ సభ్యురాలు (సునీత) అక్కయ్యకు ఎన్నో సంవత్సరాల నుండి వివాహ సంబంధాలు చూసినా ఒక్క సంబంధం కుదరలేదు.

పారాయణ, ప్రదక్షిణలు ప్రారంభించిన 6 నెలల్లో సునీత అక్కయ్యకు, సునీతకు వివాహాలు అయినాయి.

**చంద్రశేఖర్ (9392479715)గారి భార్య, 3-5-1118/సి, షంషేర్‌బాగ్, కాచిగూడ క్రాస్ రోడ్, హైదరాబాద్-27, ఇలా చెప్తున్నారు.**

**1.** నా భర్తకి జ్వరంతో పాటు మూత్రంలో రక్తం పడుతుండేది. డాక్టర్లకు చూపిస్తే కిడ్నీ సమస్యని మందులిచ్చినా తగ్గకపోయేసరికి ఉస్మానియాలో చేర్చమని చెప్పారు. నేను ఇంటికి ప్రక్కన ప్రతివారం సత్సంగం చేసుకొనే నాగరాజుగారింట్లో బాబాకు చెప్పుకుంటూ ఏడుస్తున్నాను. నాగరాజన్న చెప్పటం వలన శ్రీ సత్యనారాయణ బాపూజీగారినడిగితే ఏమీ కాదమ్మ, తగ్గిపోతుంది. బాధపడకు, నాంపల్లిబాబా ఉన్నాడు మనకు పారాయణ చేసుకోండి అని చెప్పారు. కొంచెంసేపాగిన తర్వాత నాగరాజన్న భార్య పారాయణ చేస్తుంటే నాకు వినబుద్ధి కూడా పుట్టలేదు. నా భర్తకూడా అక్కడే ఉన్నారు. కొంచెంసేపటికి నా భర్త మూత్రవిసర్జనకి వెళితే రక్తం పడకపోయేసరికి ఆశ్చర్యంతో మరలా శ్రీ బాపూజీగారికి ఫోన్ చేస్తే డాక్టరు దగ్గరకి వెళ్ళి చూపించండి అన్నారు. తర్వాతరోజు డాక్టరు దగ్గరకి తీసుకువెళితే హాస్పిటల్లో చేర్పించుకున్నారు. అక్కడ 10రోజులు వుంచారు. రకరకాల పరీక్షలు చేయించారు కానీ రోగం తగ్గలేదు. 10వ రోజు రాత్రి నాంపల్లిబాబా కలలో కన్పడి 'రేపు నీవు యింటికి వెళ్ళిపోతావు బాధపడకు. ఇక కష్టాలు రావులే' అని చెప్పారు. తెల్లవారేసరికి బాధ లేదు. మూత్రం మామూలుగా వస్తోంది. తెల్లవారి యింటి దగ్గర బాబా పటం ముందు బాధపడి హాస్పిటల్ కొచ్చేసరికి డాక్టర్లు నాతో 'మీ ఆయనకి అంతా బాగానే వుంది, గ్యాస్ట్రబుల్ వల్ల ఇలా జరిగింది. మీరు ఇంటికి వెళ్ళవచ్చు' అన్నారు. నా భర్తకు స్వప్నదర్శనంతో కిడ్నీ బాధలేకుండా చేసారు నాంపల్లిబాబాగారు. తర్వాత నేను శ్రీ బాపూజీ గారు చెప్పినట్లు ఏకాహం పారాయణ చేసి ప్రదక్షిణలు చేశాను. ఇప్పటికీ నెలకు ఒకసారి మాత్రం తప్పనిసరిగా బాబా దర్శనం చేసుకుని ప్రదక్షిణలు, ఒక అధ్యాయం పారాయణ చేసుకొని వస్తాము.

**2.** మా అమ్మ ఇండియన్ బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తోంది. 2009లో కిడ్నీలో రాళ్ళువచ్చి అనారోగ్యమైతే మా యింటికి వచ్చి వుంది. మా అమ్మ శిరిడీ సాయి భక్తురాలు. బాబా దయ వలన అన్నీ మంచి చేస్తాడు అని ధైర్యం చెపుతుండేదాన్ని. మా అమ్మకి ఊదీ పెట్టి, ప్రక్కన

బాబా పటం పెట్టి పారాయణ చేసుకుంటూ ఉండేదాన్ని. ఒకరోజు నొప్పి బాగా వచ్చిందని డాక్టరు దగ్గరకి వెళితే పరీక్ష చేయించమన్నారు. మా అమ్మ భయపడుతుంటే నేను కూడా లాబొరేటరీలోకి వెళ్ళాను. అక్కడ పెద్ద సిరింజి వున్న ఇంజెక్షన్ చేసి పరీక్షచేసి చూస్తే పెద్దరాయి వుందని వెంటనే ఆపరేషన్ చేయాలి కంగారు పడాల్సిందేమిలేదని చెప్పారు. మా అమ్మకి పరీక్ష చేస్తున్నంతసేపు నేను నాంపల్లిబాబాను తలచుకుంటూ 'బాబా! మా అమ్మకు బాగయేటట్లు చేయి, నేను 2 గంటలు ప్రదక్షిణ, పారాయణ చేస్తానని' చెప్పుకున్నాను. ఆపరేషన్ ఏరోజు చేయించాలో తెలుసుకునేందుకు తెల్లవారి మరొక పరీక్ష చేయించాలని చెప్పారు. ఆరోజు రాత్రి నొప్పి బాగా వుంటే ఊదీ కలిపిన నీళ్ళు యిచ్చాను. నొప్పి తగ్గింది. తెల్లవారి పరీక్ష చేయించి డాక్టరుకి చూపిస్తే డాక్టరు 'అమ్మా! ఎక్కడా రాయి లేదు అందువలన ఆపరేషన్ చేయనక్కరలేదు' అని చెప్పారు. వెంబడే నేను 'డాక్టరుగారు! నిన్న రాయివుందని పరీక్షలో తేలింది ఇప్పుడు లేదని ఆపరేషన్ చేయకుండా వదిలేస్తే తరువాత యిబ్బంది అవుతుంది. మీరొకసారి మరలా చూడండి' అని రెండు మూడుసార్లు చెప్తే ఆ డాక్టరుగారు మరలా రాయి లేదని చెప్పి అంతగా కావాలంటే యింకొక ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోండి అని చెప్పారు. వెంబడే మా అమ్మ నాతో బాబాకి ఏమి మ్రొక్కినావే ఇలా అయ్యింది అంటే నేను మనకు బాబా వున్నాడమ్మా, భయం లేదు అని చెప్పాను. రాత్రంతా వున్న నొప్పి తెల్లవారి లేకుండా పోయింది. మరల ఆ నొప్పి రాలేదు. తర్వాత నాంపల్లి బాబా సమాధి ధర్శనం చేసుకొని చెప్పుకున్న ప్రకారం ప్రదక్షిణలు, పారాయణ చేసాము. ఇప్పుడు యధావిధిగా బ్యాంకులో పని చేసుకుంటోంది. ఆపరేషన్ చేయాల్సినది నాంపల్లి బాబా దయ వలన చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. చిత్రంగా క్రిందటిరోజు వున్న పెద్దరాయి తరువాత రోజుకి లేకుండా పోవడం బాబా దయ వలన జరిగింది.

**3.** నా కొడుకుకి చలికాలంలో తీవ్రమైన జ్వరం, జలుబు, తెమడలు వచ్చింది. వారం పదిరోజులైనా జ్వర తీవ్రత తగ్గకపోయేసరికి ఆస్పత్రికి తీసుకువెళితే డాక్టరుగారు ఆస్పత్రిలో చేరమన్నారు. ఊపిరితిత్తులు,టి.బి, రకరకాల పరీక్షలు చేసినా వాటిలో ఎటువంటి గుణాలు (సింప్టమ్స్) కన్పడక అనారోగ్యమే కనుక్కోలేకపోయారు. **ఎక్కడకు వెళ్ళినా బాబా**

**పుస్తకం తీసుకువెళతాను కాబట్టి ఆసుపత్రిలో ప్రక్కవారితో మాట్లాడకుండా పారాయణ చేయటం, పిల్లవాడి పరిస్థితి సాయిబాబా, భరధ్వాజ మాస్టర్, అలివేలు మంగమ్మ గారికి, నాంపల్లిబాబాకి విన్నవించుకొని ఏడుస్తూండటం చేసేదాన్ని.** ఒక రోజు ఒక లేడీ వచ్చి ఇక్కడ పరీక్షలవలన తెలియటం లేదు సి.టి.ఐ స్కానింగ్‌కి నిమ్స్ వెళ్ళండి అన్నారు. నిమ్స్‌లో స్కానింగ్ చేసి ఊపిరితిత్తులు పాడైనాయి మందులు వాడాలి అన్నారు. ఇంటికి వచ్చి బాపూజీగారికి ఫోన్ చేసి చెపితే ఆయన 'అమ్మా! నీ భర్తకు, అమ్మకు బాబా నయం చేసారు కదా ఆయన్నే నమ్ముకో అని చెప్పారు. నాంపల్లిబాబాకు విన్నవించుకున్నాను. వారం రోజులతర్వాత మరలా సి.టి.స్కానింగ్ చేసి చూస్తే అన్నీ బాగున్నాయి. ఏమి యిబ్బంది లేదని చెప్పారు డాక్టర్లు. అప్పుడు నేను 'డాక్టరుగారు! వారం క్రితం ఊపిరితిత్తులు పాడైనాయి అని చెప్పారు. ఇవ్వాళ ఏమి యిబ్బంది లేదని చెపుతున్నారు మరలా చూసి చెప్పండి లేకపోతే పిల్లవాడికి భవిష్యత్తులో అనారోగ్యమవుతుంది' అంటే డాక్టరుగారు 'అమ్మా! ఏమి యిబ్బంది లేదు. వారం రోజులక్రితం యిబ్బంది వుంది, ఈరోజు లేదంటే ఇది కేవలం దైవకృపో ఏమో నీకే తెలియాలమ్మా' అని చెప్పారు. ఈవిధంగా నా కళ్ళముందర నా భర్తని, నా అమ్మని, నా పిల్లవాడిని నాంపల్లిబాబాగారు రక్షించారు.

**చంద్రశేఖర్ గారు తన స్నేహితుని అనుభవం యిలా చెప్తున్నారు.**

నా స్నేహితుడు సాయిలీలామృతం పారాయణ మధ్యలో ఆపేసాడు. 10 రోజుల తరువాత నాంపల్లిబాబా స్వప్నంలో సాయిలీలామృతం పుస్తకం పట్టుకొని కనపడ్డారు. అంతటితో నా స్నేహితుడు పారాయణ మధ్యలో ఆపేసినందుకు నాంపల్లిబాబా కన్పడి పారాయణ చేయమంటున్నారనుకొని పారాయణ పూర్తిచేసాడు. శిరిడీ సాయిబాబా జీవితచరిత్ర(సాయి లీలామృతం) పారాయణ ఆపేస్తే నాంపల్లిబాబా కన్పడి తప్పు సవరిస్తున్నారంటే **రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడే అని, అందరి మహనీయుల రూపంలో విరాజిల్లేది దత్తాత్రేయ తత్వమేనని** తెలుస్తోంది.

**లక్ష్మి, షంషేర్‌బాగ్, కాచిగూడ క్రాస్ రోడ్, హైదరాబాద్-27, సత్సంగ సభ్యురాలు.**

మా అబ్బాయి 2009 లో 8 వ తరగతి పాసైనాడు. వేసవికాలంలో సెలవులకి కంప్యూటర్ నేర్చుకుంటానని మా చెల్లెలింటికి వెళ్ళాడు. అక్కడ

పిల్లలతో చదువుకుంటున్నాడు. కానీ మావాడు తెలుగు, ఇంగ్లీష్‌లలో సరిగ్గా చదవట్లేదని చెప్పి స్కూల్ మాన్పించమని నా చెల్లెలు,మరిది రోజూ ఫోన్ చేసి గొడవ చేసేవారు. ఆయన ఒప్పుకుంటే వాళ్ళు 4,5 స్కూల్స్‌లో అడ్మిషన్ కోసము ప్రయత్నిస్తే అక్కడ పరీక్ష పెట్టి మరలా 8 వ తరగతిలో చేర్చుకుంటామని చెప్పారు. అలా అయితే కాచిగూడ ఇప్పుడు చదివే స్కూల్లో కొనసాగిద్దామని మావారు అనేవారు. నేను నాంపల్లిబాబాతో 'బాబా నీ భక్తురాలనైతే మా అబ్బాయికి ఇక ఒకే ఒక స్కూల్లో ప్రయత్నిస్తాము. వాడికి అడ్మిషన్ వచ్చేటట్లు చేయాలి. నేను ప్రదక్షిణలు, సప్తాహ పారాయణ చేస్తాను' అని చెప్పుకున్నాను. తర్వాత రోజు ఒక స్కూలుకి వెళితే మా అబ్బాయికి పరీక్ష పెట్టి ఏమీ అడగకుండా 9వ తరగతిలోకి తీసుకున్నారు. ఆ రోజు రాత్రి కలలో ఒక ముని కన్పడి 'మీ అబ్బాయికి ఏమవదు. అంతా బాగుంటుంది' అని చెప్పారు. నేను బాబాను కోరిన వెంబడే నా కోరికను తీర్చారు.

మా తోడి కోడలి చెల్లెలికి (సరళ) దాదాపు 50 వివాహ సంబంధాలు చూసారు కానీ ఒక్కటీ కుదరలేదు. నేను ఆ అమ్మాయి కోసమని బాబా సమాధి దర్శనం చేసుకొని ప్రదక్షిణలు చేసి బాబాతో 'బాబా! ఆ అమ్మాయికి 3 నెలల లోపు వివాహం అయ్యేటట్లు చెయ్యి, నేను సప్తాహ పారాయణ చేస్తాను. ఆ అమ్మాయిని నీ దర్శనానికి తీసుకువస్తాను' అని చెప్పుకొని ఇంటికి వెళ్ళిన తర్వాత మా తోడికోడలి చెల్లెలికి ఫోను చేసి ఇలా బాబాకు మ్రొక్కుకున్నాను. వివాహం కుదిరితే నీవు తప్పకుండా బాబా దర్శనానికి రావాలి అని చెప్పాను. వెంబడే ఆ అమ్మాయి ఆ రోజు ఒక సంబంధం వారు వచ్చి చూచినది కుదిరింది అని చెప్పింది. తర్వాత ఆ అమ్మాయిని తీసుకువెళ్ళి బాబా దర్శనము చేసుకున్నాము.

**నగేష్ తన అనుభవాలను యిలా చెప్తున్నారు.**

1. గుర్గావ్‌లో (ఢిల్లీ ప్రక్కన) పనిచేసే అకౌంటింగ్ పనికి స్వస్తి చెప్పి హైదరాబాద్‌లో ఒరాకిల్ ఫైనాన్షియల్స్ కోర్సులో చేరాను. శ్రీ సుబ్బరామయ్య సార్ చెప్పినట్లు నేను గుర్గావ్‌లో వున్నప్పుడు ప్రతి ఆదివారం నిజాముద్దీన్ దర్గాను ఒక నిర్థిష్ట సమయంలో దర్శించుకొనేవాడిని. హైదరాబాద్‌లో ట్రైనింగ్‌లో వున్నాను కాబట్టి ఎక్కువ ఖాళీ సమయం వుండేది అందువలన ప్రతిరోజు ఉదయం 6గం. నుండి 9గం.వరకు నాంపల్లిబాబాగారి సమాధి దర్శనం చేసుకొని పారాయణ,

ప్రదక్షిణలు చేసేవాణ్ణి. ప్రతి ఆదివారం 20రూ. దక్షిణ యిచ్చేవాడ్ని. ఒక ఆదివారం అనుకున్న ప్రకారం 20/- రూ. వేస్తే నాకు బస్సు చార్జీలు తప్ప ఇంటికి వెళితే పాలకి కూడా డబ్బులు లేవు. అప్పుడు బాబాతో 'నిన్ను అందరూ మహాత్ములంటారే నేనిప్పుడు 20/- రూ. ఇచ్చేస్తే నాకు ఈ క్షణంలో నీవు డబ్బులు యిస్తావా యివ్వగలవా' అని అడుగుతూ ప్రదక్షిణలు పూర్తి చేసి 20/- రూ. వేసే లోపల పాత స్నేహితుడు (రోహిణీ కుమార్) 1,000 రూపాయల నోటిచ్చి నీకు అవసరమౌతుందని ఇస్తున్నాను, ఇది వుంచు అన్నాడు. ఆ తర్వాత నేను అతణ్ణి మీరు ఎప్పుడూ ఇంతకు ముందు ఇలా ఇవ్వలేదుకదా మరి ఈ రోజు ఎందువలన ఇలా యిచ్చారని అడిగితే అతను 'మిమ్మల్ని చూచి డబ్బులివ్వాలని తీవ్రంగా అన్పించింది. ప్రదక్షిణలు చేస్తున్నా మనస్సు బాబా మీద వుండట్లేదు. అందువలన వెంబడే ఇచ్చాను' అని చెప్పాడు. నా మనస్సులో బాబాతో చేసిన ఛాలెంజ్‌కి ఎంత బాగా బాబా స్పందించి నా స్నేహితునికి ప్రేరణ పెట్టి నన్ను సమాధాన పరిచారు. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః, సర్వప్రేరణాధికారిణే నమః

2. ఒకరోజు ఉదయం లేటుగా నిద్రలేవటం వలన నాంపల్లిబాబా దగ్గరకు వెళ్ళటానికి 40 నిముషాలు మాత్రమే వుంది. నేను బస్సులో వెళితే ఒక గంట పైనే పడుతుంది. అలాంటిది నువ్వే నిర్ణీత సమయానికి రప్పించుకోవాలి బాబా అని ఇంటి బయట రోడ్డు మీదకి వచ్చేసరికి వేగంగా బైక్ మీద వస్తున్న వ్యక్తి నేను చేయి వూపడం చూసి ఆగి బస్టాండులో దింపాడు. అక్కడ ఒక క్వాలిస్ వ్యాను వచ్చి కె.పి.హెచ్.బి. దాకా చాలా వేగంగా దింపాడు. అక్కడనుండి బస్సు ఎక్కి మదీనాగూడా దగ్గరకు వచ్చేసరికి బాబా సమాధికి 3 నిముషాలలో వెళితేనే నిర్ణీత సమయానికి చేరుకోగలను. కాని మదీనా గూడా నుండి బాబా సమాధికి 1.5 కి.మీ.(15 నుండి 20 నిమిషాల నడక) ఎంత పరుగెత్తి వెళ్ళినా చేరుకోలేను. ఎవరైనా బైక్ మీద వచ్చి దింపితేనే చేరుకోగలను అనుకుంటుంటే ఒక అతను బైక్ మీద వచ్చి నేను అడగగానే నన్ను తీసుకెళ్ళి నాంపల్లిబాబా సమాధి దగ్గర దింపాడు. నేనింకా ఒక నిముషం ముందరే బాబా సమాధికి చేరుకున్నాను. ప్రదక్షిణలు, పారాయణ తర్వాత తిరుగు ప్రయాణంలో మరలా లిఫ్టులు అడిగి త్వరగా వెళ్ళిపోదామని ఎంత మందిని లిఫ్ట్ అడిగినా ఎవ్వరూ యివ్వలేదు. బాబాయే వివిధ రూపాలలో (బైక్, బస్సు, క్వాలిస్ వ్యాను,

వివిధ వ్యక్తులు) నన్ను నిర్ణీత సమయానికి అద్భుతంగా ఆయన దర్శనానికి రప్పించుకున్నారు.

3. ఒక రోజు నాంపల్లిబాబా దర్శనానికి వస్తూ బస్సులో సీట్లు లేక లేడీస్ సీట్లో ఒకావిడ ప్రక్కన కూర్చుంటే ఆమె ఇది లేడీస్ సీట్ అనగానే నేను వెంబడే కోపంగా ఆమె వంక చూచి 'నీకంత సీన్ లేదు నిన్ను ఎవరూ చూడరు' అన్నాను. ఆమెకి అందరి ముందర అవమానంతో ఏమి అనకుండా కూర్చుంది. నేను నాంపల్లి బాబా దర్శనం చేసుకొని వెనక్కి యింటికి వచ్చేటప్పుడు ఒక స్నేహితుని యింటికి వెళ్ళి ఆ తర్వాత బ్యాంక్ లో ఒక చెక్ డిపాజిట్ చేసి డబ్బులు తీసుకుందామని వెళుతూ ఒక భిక్షగాడికి నా దగ్గర వున్న చిల్లరంతా యిచ్చేసాను. నేను బ్యాంకుకు వెళ్ళిన తర్వాత ఆరోజు అన్ని బ్యాంకులకు సెలవని తెలిసింది. నా బ్యాంకు ఎకౌంట్‌లో డబ్బులేదు అందువలన ఏ.టి.ఎమ్. కార్డు ఉపయోగించలేను పైగా నా జేబులో డబ్బులేదు అందువలన అక్కడి నుండి 10 కి.మీ. నడవాల్సి వచ్చింది. నడుస్తున్నప్పుడు చాలా బలంగా స్ఫురించింది ఇదంతా నేను ఉదయం ఒకావిడిని అవమానపరిచినందుకు బాబా ఇలా శిక్షవేశారని.

4. ఒకసారి కొన్ని కారణాల వలన రాబోయే శెలవురోజు కూడా పని చేయాలి అని చెప్పారు. శెలవు ముందర రోజు రాత్రి కలలో 'నాంపల్లిబాబా పిలుస్తున్నట్లు, నేనొక మహనీయుని దర్శనం చేసుకోవటానికి వెళుతున్నట్లు' కన్పించింది. తర్వాత రోజు ఆఫీసుకెళ్ళాలనిపించక నాంపల్లిబాబా దర్శనానికి వెళదామనుకొని ఆఫీసులో చెప్పి మానేద్దామని ఫోన్ చేస్తుంటే ఫోన్ కలవటంలేదు. నేను నాంపల్లిబాబా దర్శనం చేసుకొన్నాను. బాబా సమాధి దగ్గర ఒకతను వచ్చి నాతో 'నీకొక మహాత్ముడ్ని చూపిస్తాను రా' అంటే వెళ్ళాను. ఒకచోట ఒకతనిని చూపించి ఈయనే మహాత్ముడంటే నాకు నమ్మబుద్ధి వేయలేదు. కాని అతను నా వైపు చూస్తూ ఒక నవ్వు నవ్వి వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిన తర్వాత నేను బస్సు ఎక్కాక రాత్రి జరిగిన కల స్పష్టంగా గుర్తొచ్చి కలలో వెళ్ళిన మహాత్ముడు ఈయనేనేమో అనిపించింది. ఇంటికి వెళ్ళి తర్వాత రోజు ఆఫీసుకి వెళితే నిన్నంతా కరెంటు లేక ఎవరూ పని చేయలేదని తెలిసింది. ఒకరోజు వృధాకానివ్వకుండా నాంపల్లిబాబా నాకు ప్రేరణ పెట్టి ఆయన దర్శనం కల్పించారు.

**పి. చంద్రశేఖర్, విజయవాడ**

నేను ఉద్యోగ ప్రయత్నాల కోసం హైద్రాబాద్ వెళ్ళి కాంపిటీటివ్ పరీక్షలు వ్రాసినప్పుడు సమయం లేకపోయినా నాంపల్లిబాబాగారి దర్శనం చేసుకుంటూ వుండేవాడ్ని. తర్వాత కొన్ని కోర్సులు నేర్చుకోవటానికి హైద్రాబాద్ రావల్సి వచ్చింది. ప్రతి ఆదివారం స్నేహితులతో కలసి నాంపల్లిబాబాగారి సమాధి దర్శనం చేసుకొని ప్రదక్షిణలు, పారాయణ చేసేవాడ్ని. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించక చాలా నిరాశగా వున్న ఒకరోజు నాంపల్లిబాబాగారి సమాధి పూజారి రాజుగారితో 'నాకు 4 రోజులలో మంచి ఉద్యోగం రాకపోతే నేను ఇక బాబాను నమ్మను' అని చాలా బాధతో అన్నాను. చాలా ఆశ్చర్యకరంగా ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఈ సంతోషం పట్టలేక ఇంటికి దగ్గరగా వున్న సాయిబాబా గుడికి వెళితే మందిరం బయట ఒక ముసలాయన (ఒక కాలు లేదు) నన్ను రెండు రూపాయలు అడిగితే నేను యిచ్చి త్వరగా లోపల సాయిబాబాను దర్శించటానికి వెళ్ళి కూర్చున్నాను. చిత్రంగా సాయిబాబా విగ్రహం స్థానంలో బయట రెండు రూపాయలు అడిగిన వ్యక్తి కనపడుతున్నాడు. వెంబడే లేచి మందిరం బయట చూస్తే అతని ఆచూకీ దొరకలేదు. ఆ రూపంలో నాంపల్లిబాబానే నాకు భౌతిక దర్శనం ఇచ్చి, ఆయన దయతోనే నాకు ఉద్యోగం వచ్చింది అని భిక్ష స్వీకరించారు.

**రాధికగారు, 10-41/2, వినాయక్ నగర్, బాలా నగర్, హైదరాబాద్-37**

1. మా ఆడపడుచు భర్త ఒక వారం రోజులనుండి డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఏ ఆహారం (మంచినీళ్ళు, కొబ్బరి నీళ్ళు) తీసుకున్నా కక్కేసేవారు. ఫీవర్ హాస్పిటల్‌లోని డాక్టర్లు పరిస్థితి ప్రమాదకరంగా వుందని చెప్పారు. చాలా దృఢంగా వుండే ఆయన చిక్కిపోవడం చూసి బాధపడి హాస్పిటల్ నుండి వివేకానంద్‌నగర్ లో వున్న నాంపల్లి బాబాగారి దగ్గరికొచ్చి 'బాబా నీ మహిమంటూ వుంటే ఒక గంటలో ఆయన తినా'లని చెప్పుకున్నాను. గంట తర్వాత ఫోన్ చేస్తే కక్కకుండా తిన్నారని మా బంధువులు చెప్పారు. కొద్ది రోజులలో ఆయనకు ఆరోగ్యం చేకూరింది. అప్పటినుండి నాంపల్లి బాబా మీద విశ్వాసం చాలా దృఢపడింది. మా యింటి పేరు శ్రీ సాయి నాంపల్లిబాబా నిలయం అని పెట్టుకున్నాము.

2. మా అన్నయ్య రావులరాగు నరేందర్ రెడ్డి ఎ.ఐ.ఎమ్.ఇ లో

డిప్లొమా చేసాడు. ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేసేవాడు కానీ చాలా బద్ధకంగా, నిర్లక్ష్యంగా వుండేవాడు. ఒకసారి అనారోగ్యం కారణంగా ఉద్యోగానికి వెళ్ళలేకపోతే ఉద్యోగం నుండి తొలగించారు. ఒకసారి నాంపల్లిబాబా గురించి చెప్పి బాబా ఆరాధనోత్సవానికి తీసుకువెళ్ళి నేను మా అన్నయ్యకి మంచి ఉద్యోగం రావాలని మ్రొక్కుకున్నాను. బాబా దగ్గరికి వెళ్ళిన రోజే అంతకు ముందు అప్లై చేసిన కంపెనీ నుండి పిలుపు వచ్చి ఆఉద్యోగం ఖాయమైంది. మా అన్నయ్య ఏమి మ్రొక్కుకున్నాడో కాని అప్పటి నుండి బాబా మీద విశ్వాసం పెరిగింది. సమాధి దర్శనంతో బాబా ఏమి మార్పు చేసారో కాని అప్పటినుండి మా అన్నయ్య ఉద్యోగం సక్రమంగా చేస్తున్నాడు. ఇప్పుడు చాలా సంతోషంగా వున్నాడు.

3. మా నాన్నగారు (రావుల రాజారెడ్డిగారు) టీచరుగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఒకసారి 10,000రూ. అవసరమొచ్చి లోను తీసుకొని ఆ అప్పును తీర్చేసారు. తర్వాత ఒక నెలలో పెన్షన్ రాకుండా వుండేసరికి కారణం తెలుసుకుందామని ఆఫీసుకు వెళితే వాళ్ళు మానాన్నకి మీరే కదండి మొన్న సంతకం చేసి 30,000/-రూ. కావాలని అప్లికేషన్ పెడితే 30,000/-రూ. మంజూరు చేసాము కదా అందుకే మీ పెన్షన్ కట్ చేసాము అని దాని తాలూకా పత్రాలు చూపించారు. మా నాన్నకి అర్థం కాక జేబులో వున్న నాంపల్లి బాబా ఫొటోకి నమస్కారం చేసి ప్రార్థించుకొని ఇంటికి వెళ్ళి ఆవిషయంలో ఎటువంటి జోక్యము కలుగచేసుకోలేదు. కొన్ని రోజులకి మా నాన్న శిష్యుడు ఒకాయన వచ్చి తనే దొంగ సంతకం పెట్టి 30,000 రూపాయలు తీసుకున్నానని తన తప్పు ఒప్పుకున్నాడు. బాబా ఏమి ప్రేరణ చేశారో మా నాన్న శిష్యుడు తనంత తాను తప్పు ఒప్పుకునేటట్లు చేసి మానాన్నను విషమ పరిస్థితి నుండి విముక్తుడ్ని చేశారు.

**శ్రీమతి నూకలపాటి పార్వతి, కనకదుర్గ గుడి పూజారి భార్య, ధర్మపురి క్షేత్రం, హైదరాబాద్.**

నేను భరద్వాజ మాస్టారుగారు వ్రాసిన శ్రీ సాయిలీలామృతం, శ్రీ గురుచరిత్రలు పారాయణ చేస్తూ సత్సంగము భజనలలో పాల్గొంటుంటాను. ఒక రోజు నాకు ఒంట్లో బాగుండక ఉదయం 10:30గం. లకు పడుకొని వున్నాను. నా స్వప్నంలో శ్రీ నాంపల్లిబాబా కన్పించి 'ఇంకా పడుకొని వున్నావేమిటమ్మా భోజనాలకు వస్తున్నారు లేయ్' అంటున్నారు. 11 గం. లకు నాంపల్లిబాబా సమాధి మందిర పూజారి రాజుగారు వచ్చి కాకినాడ పెద్దాపురం నుండి

రెండు బస్సుల నిండుగా భక్తులు శిరిడీ సాయిబాబాను దర్శించుకొని నాంపల్లిబాబా దర్శనానికి మధ్యాహ్నం 1:30 గం.లకు వస్తున్నారు అని ఫోన్ చేసారు, మీరు భోజనాలు తయారు చేయండి అని నాతో చెప్పారు. అనారోగ్యంతో వున్న నేను వెంటనే రెండు బస్సుల భక్తులకు భోజనాలు ఎలా తయారు చేశానో ఆ నాంపల్లి బాబాకే ఎరుక. నాకు అంత శక్తి ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోయాను. ఇది అంతా బాబా దయ.

**బెల్లంకొండ శివశంకరరావు, ఇం.నెం: 49-395, బాల్‌రెడ్డి నగర్, చింతల్, హైదరాబాద్**

1982 నుండి శ్రీనాంపల్లిబాబా దర్శనం చేసుకుంటున్నాను. 1997లో మా స్నేహితులంతా మేడిచర్లబాబా దర్శనము కొరకు వెళదామని నిర్ణయించినారు. నాకు అయితే అసలు ఇష్టం లేదు. ఎంతమంది మహాత్ములు, బాబాలూ అని, దర్శనానికి వెళ్ళకూడదనుకొని మనస్సులో సాయిబాబాయే శ్రీ నాంపల్లిబాబాగారని నమ్మి స్మరించుకుంటూ నిద్రపోయాను. ఆ రోజు తెల్లవారుఝామున నాలుగు గంటల పైన కలలో 'శ్రీ నాంపల్లిబాబా ఒక చేతిలో త్రిశూలం, ఇంకొక చేతిలో ఢమరు త్రిప్పుతూ ఉగ్ర నరసింహంలా నాలుక చూపుతూ' దర్శనం ఇచ్చినారు. అప్పుడు నాకు పరమశివుడే నాంపల్లిబాబా అని అనుభవమునకు వచ్చింది.

**ఎన్ తేజ, ఎల్ ఐ జి 738, 5వ లైను, కూకట్‌పల్లి, హైదరాబాద్**

నా పేరు తేజ, నా వయస్సు 12 సం॥లు. నేను మా పెద్దమ్మ దగ్గర వుండి 7వ తరగతి చదువుకుంటున్నాను. మే 12వ తేదీ, 2004 నాకు ఆరోగ్యం బాగోక డాక్టరు గారి దగ్గరికి వెళ్ళాము. డాక్టరుగారు పరీక్ష చేసి నాకు గుండెల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నది, రక్తం నల్లబడింది అని చెప్పారు. అందువల్ల నా గుండె నిమిషానికి 20 సార్లు కొట్టుకుంటోందని చెప్పారు. రక్తప్రసరణ కూడా సరిగా లేదన్నారు. ఊరులో ఇంకొక డాక్టరుకు చూపించినా బ్రతకనని చెప్పారు. అప్పుడు మా అమ్మ బాబాగారి ఫొటో నా చేతిలో పెట్టి, ముఖాన విభూది పెట్టి హైదరాబాద్ తీసుకువచ్చింది. మే 14, 2004 హైదరాబాద్‌లో వున్న ఉషా ముళ్ళపూడి కార్డియాక్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. అక్కడ డాక్టర్ రమేష్ గారు పరీక్షచేసి 'ఈ పాపకి గుండె 10 సార్లు కొట్టుకుంటోంది - ఏ సమయం ఎట్లా వుంటుందో, బ్రతుకుతుందని కూడా నమ్మకంగా చెప్పలేమని, అంతా భగవంతుని దయ అని' చెప్పి నన్ను ఐ.సి.యూలో పెట్టారు. అప్పుడు హాస్పిటల్‌లో మా పెద్దమ్మను వుంచి మా అమ్మ ఇంటికి వచ్చి బాగా ఏడ్చింది. అప్పుడు

అమ్మకి నాంపల్లిబాబా గుర్తొచ్చి ధ్యానంలో కూర్చుంది. కూర్చున్న 2 గంటలకు బాబాగారు కనిపించి 'ఎందుకు బాధపడుతున్నావు అని తన చేతిలో నుంచి ఒక వెలుగు నా గుండెలోకి పంపినట్లు' మా అమ్మకు కనిపించింది. అదే సమయంలో హాస్పిటల్లో ఒక డాక్టరు నన్ను చూచి ఏ క్షణంలోనైనా తగ్గిపోతుంది అని అన్నారు. 3 రోజుల్లో తగ్గిపోయింది, 6 వేల రూపాయల ఖర్చుతో హాస్పిటల్‌నుండి బయటపడ్డాము. ఇప్పుడు నేను బాగానే వున్నాను ఎందువలనంటే నేను బాబాగారి దగ్గరకు 40 రోజులు తప్పకుండా వచ్చాను. ఆరోగ్యం, చదువు అన్నీ బాగానే వున్నాయి.

**హరనాథ్ సర్కార్, హరిపురి కాలనీ, అష్టలక్ష్మి దేవాలయం దగ్గర, కొత్తపేట, Hyd-35**

నా భార్య త్రివేణికి 2001 సం॥లో మెడ క్రింద కుడివైపు ఒక గడ్డ ఏర్పడిందని చూపింది. అది తను ముందే గుర్తించినా నాకు చెప్పడం ఆలశ్యం చేసింది. నేను కూడా నిర్లక్ష్యం చేసి తరువాత హెూమియోపతిలో రాష్ట్రంలో దిట్టగా పేరొందిన డాక్టర్ల దగ్గర ఒక సం॥ మందు వాడాము. కానీ అది తగ్గకపోగా పెరగటం మొదలైంది. గత్యంతరం లేక మలక్‌పేట యశోద హాస్పిటల్ సర్జన్‌కి చూపాము. ఆయన వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. భయంతో ఒకసం॥ మరలా నిర్లక్ష్యం చేసి మరీ పెరిగిన గడ్డతో మళ్ళీ సర్జన్ దగ్గరికి వెళ్ళాము. ఆయన మమ్మల్ని మా నిర్లక్ష్యానికి మందలించి వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసి 2003 ఆగస్టులో ఆపరేషన్ చేసి చాలా పెద్దగడ్డ తీసి దానిలో కొంతభాగం బయాప్సీకి పంపారు. 10 రోజుల తర్వాత కట్లు తీయించటానికి డాక్టర్ దగ్గరికి వెళ్ళినాము. ఆయన వెంటనే బయాప్సీ రిపోర్టు తెచ్చారా అని అడిగితే ఇంకా తీసుకోలేదని చెప్పాము. ఆయన కోపంతో అది చాలా ముఖ్యమని అది క్యాన్సర్ అని అనుమానం వుందని ఆ రిపోర్టు లేకుండా ఎట్లా ట్రీట్‌మెంట్ మొదలు పెట్టాలని అన్నారు. నా భార్యకు క్యాన్సర్ అని ఇప్పటివరకూ చూసిన డాక్టర్లు, మా బంధుకోటి కూడా నిర్ధారించారు.

నేను మర్నాడు ఆ రిపోర్టు తీసుకుని శ్రీ నాంపల్లిబాబావారి సన్నిధికి వివేకానందనగర్ వచ్చాను. రిపోర్టు తీసి చదవటానికి భయం. శ్రీ బాబా సేవకులు శ్రీ రాజుగారికి యిచ్చి దానిని బాబా పాదాల దగ్గర పెట్టమన్నాను. భార్య అనారోగ్యం అంటే ఏ భర్తకైనా దిక్కు తోచదు. అటువంటిది క్యాన్సర్ అని అనుమానమైతే ఆ భర్త ఎంత తల్లడిల్లిపోతాడో వేరే చెప్పనక్కర్లేదు.

ఇక బాబా ఒక్కరే దిక్కు. ఎందరో వారి దయకు పాత్రులైనారు. నాకు కూడా వారి కటాక్షం కావాలని ఒక తప్పుడు కోరిక కోరాను. 'బాబా మీరు దత్తావతారంగా అందరం నమ్ముచున్నాము. నా భార్యకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించు. దానికి బదులు ఆ రోగం నాకు సంక్రమింప చెయ్యి' అని ప్రార్థిస్తూ నా మూర్ఖస్థితి మూలంగా ఆయనను రెచ్చగొట్టే ధోరణిలో ప్రార్థించాను. అంతే బాబా ఉన్నట్టుండి ఉగ్రులై అందరిని తరిమే ప్రయత్నంలో చేతులతో పొమ్మని పలుమార్లు చూపుతూ తిట్టనారంభించారు. అందరూ ప్రక్కరూములోకి వెళ్ళిపోయారు. ఈ గందరగోళానికి కారణం నేనని ఎవ్వరికీ తెలియదు. బయాప్సీ రిపోర్టు తీసుకొని మరుసటి రోజు డాక్టరుని కలిశాము. నేను మాత్రం అది తెరచి చూడలేదు. డాక్టరు రిపోర్టు చదివి తేలికపడ్డ మనస్సుతో భయపడాల్సిందేమి లేదనీ చెప్పారు. మా ఆనందానికి అంతులేదు. సంపూర్ణ దత్తావతారంగా కొనియాడదగు శ్రీ నాంపల్లిబాబా వారికి ఆజన్మాంతం ఋణపడివుంటాను. కుప్పకూలటానికి సిద్ధంగా వున్న కుటుంబాన్ని నిలబెట్టారు శ్రీనాంపల్లిబాబా.

**ప్రభాకర్ శెట్టి, లెక్చరర్, ప్లాటు నెం; 24, సాయినగర్, బాలానగర్, Hyd-42.**

ఇండియన్ ఎయిర్‌ఫోర్సు నుండి 1995 సం॥లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. తర్వాత చిన్న కంపెనీలలో పనిచేసి ఆరోగ్యరీత్యా ఉద్యోగం మానుకున్నాను. తర్వాత నాకు ఒక స్నేహితుని ద్వారా శ్రీ నాంపల్లిబాబా గారి దర్శనం చేసుకున్నాను. **నేను బాబాగారిని చూచిన తర్వాత 108సార్లు శ్రీ గురు చరిత్ర పారాయణ చేయవలెనని కోరిక కలిగినది.** 4 పారాయణలు చేసిన తర్వాత ఒకసారి బాబాగారిని దర్శించాను. అప్పుడు నాకు బాబాగారి ఉచ్ఛిష్టము (టీ మరియు సిగరెట్టు) లభించింది. తర్వాత వెంటనే నాకు నేను చేయగలిగిన లెక్చరర్ ఉద్యోగం దొరికింది. అంతేగాక నేను 108సార్లు గురుచరిత్ర పారాయణ ఏమీ ఆటంకము లేకుండా బాబాగారు చేయించినారు. అప్పటినుండి నాకు, నా కుటుంబానికి బాబాగారు ఏమీ కోరకనే మా కష్టాలను తీర్చుచున్నారు.

**టి. చంద్రశేఖర్ రెడ్డి, M.N.R డిగ్రీ కాలేజీ, శ్రీ వాణి నగర్, కూకట్‌పల్లి, Hyd-72**

నాంపల్లిబాబాను దర్శించేసరికి నేను చాలా రోగాలతో, ముఖ్యముగా మొలలు, మలద్వారము దగ్గర పగుళ్ళు, పిస్టుల్లా, గ్యాసుట్రబుల్, అజీర్తి, చర్మవ్యాధి మొదలైనవాటితో గత 18 సంవత్సరాల నుండి

బాధపడుచున్నాను. చాలామంది వైద్యుల దగ్గర చికిత్స పొందాను కానీ వ్యాధులు తొలగలేదు. **బాబాగారిని రోజూ దర్శించడము వల్ల నాకున్న వ్యాధులు పూర్తిగా తొలగిపోయాయి.** వారు నాకు చేసిన మేలుకు, కృతజ్ఞతతో వారి ఆశీస్సులకొరకు ధర్మపురిలో వున్న సమాధిని దర్శించుచున్నాను.

**పి. చంద్రశేఖర్ రెడ్డి, సాయి రెసిడెన్సీ, MIG - 202, కె పి హెచ్ బి కాలనీ, Hyd**

సద్గురు శ్రీ నాంపల్లిబాబాగారు నాంపల్లి స్టేషన్‌లో వున్నప్పుడు తరచుగా దర్శనము చేసుకొని పాదము తాకి నమస్కరించుకొనేవాళ్ళము. తరువాత వారి సన్నిధిలో ప్రశాంతముగా కూర్చుని ధ్యానం చేసుకొనేవాళ్ళము. తరువాత నాంపల్లిబాబా గారు నాంపల్లి నుండి గౌలిపుర చార్మినార్ రోడ్డు ప్రక్కన వున్నప్పుడు కూడా దర్శనము, పాద స్పర్శనము భాగ్యముకలిగేది. తరువాత శ్రీ నాంపల్లిబాబాగారు శ్రవణ్‌కుమార్ ఇంటిలో వున్నప్పుడు కూడా తరచుగా వెళ్ళేవారము. తరువాత శ్రీ నాంపల్లిబాబాగారు వివేకానందనగర్ కూకట్‌పల్లిలో వున్నారు. బాబాగారు ఇంక వారం రోజులలో సమాధి చెందుతారనగా ఒకసారి వెళ్ళి దర్శనము చేసుకున్నాము. తరువాత దర్శనభాగ్యము లేదు. బాబాగారు సమాధి చెందినట్లు తెలిసి చాలా బాధపడ్డాను. వారు సశరీరముతో వున్నప్పుడు లౌకికమైన కోరికలు కష్టాలుతో వారిని దర్శనము చేయలేదు. దాని అవసరము కూడా నాకు లేదు. కాని వారి సన్నిధిలో ఎప్పుడూ ఎంతో ఆనందము అనుభవించేవాడిని. వారు సమాధి చెందిన తర్వాత వారు ఇకలేరు అని తలచి చాలా బాధపడ్డాను. 5-1-2005 న శ్రీ నాంపల్లిబాబాగారు రాత్రి స్వప్నంలో కూకట్‌పల్లిలో మంచం మీద పడుకొని వున్నారు. నేను దర్శనము కోసం వెళ్ళితే పాదము ఇచ్చి రా! వచ్చి దర్శనము చేసుకో అని మాట్లాడినారు. నేను దర్శనము చేసుకున్న తరువాత మీ కుటుంబముతో సహా వచ్చి దర్శనము చేసుకో అని బాబాగారు స్పష్టంగా మాట్లాడినారు. అప్పుడు నా ఆనందమునకు హద్దులేదు తరువాత బాబాగారు చెప్పినట్లు 18-1-2005న మంగళవారము కుటుంబముతో సహా బాబాగారి సమాధి దర్శనము చేసుకున్నాము.

**డి. తిరుమలరావు, H.No: 16-4-492, చెంచెల్‌గూడ, Hyd-24**

నా పేరు తిరుమలరావు. నేను బాబాగారిని 1966 సం॥లో మలక్‌పేటలోని స్మశానములో దర్శించుకున్నాను. బాబాగారు అక్కడే

ఉండేవారు. కొంతకాలము అక్కడే వుండి తరువాత కనపడకుండా పోయిరి. మరి కొంతకాలము అనగా 1988 సం॥ బాబాగారు నాంపల్లి పోలీస్ స్టేషన్ దగ్గర వున్నారని ఒకతను చెప్పినప్పటినుండి ప్రతిరోజూ సాయంత్రం బాబా దర్శనం చేసుకొనేవాడిని. కొంతకాలము నేను రాత్రిపూట బాబాగారి దగ్గర పడుకునేవాడిని. అప్పుడు చాలా అద్భుతాలు జరిగినవి.

నాతో బాబాగారు ఒకరోజు వీపు పైన దురద పుట్టుచున్నది రుద్దమని సైగలతో అన్నారు. నేను వీపు రుద్దినాను. అప్పుడు బాబాగారి వీపులో నుండి నాకు వీణ వాయించిన ధ్వనులు వినబడి నాకు ఆశ్చర్యము వేసినది. నా మనస్సు స్థిరముగా వున్నంతవరకు వినపడినవి. తరువాత బాబాగారు నవ్వుతూ కూర్చున్నారు. 'బాబా!' అని బాబా పాదాలపై పడి సాష్టాంగ నమస్కారము చేసుకున్నాను. నేను ఈ విధముగా చాలా చాలా అద్భుతాలు చూశాను. అంత యింత కాదు ఎంత చెప్పినా తనివి తీరదు. బాబా గారి గురించి మనం మన జీవితమంతయు ధారపోసినా బాబాగారికి తక్కువనే. కొంతకాలము నేను బాబా దగ్గరికి వెళ్ళలేదు. కాని నేను ఎప్పుడు బాబాగారినే తలచుకుంటుండే వాడిని. నా కూతురి కొడుకు (భరత్), నేను 3 రోజులు నాంపల్లి స్టేషన్‌లో బాబా దగ్గర పడుకున్నాము. అది చలి కాలము. బాబా దగ్గర పడుకుంటే అసలు చలిలేదు తాతయ్య అని నా మనవడు అన్నాడు. చలికాలమైనా బాబా దగ్గర చలి లేదు అంటే బాబా ఎవ్వరిని అయినా తనను నమ్మినవారికి ఎట్టి కష్టము కలుగకుండా చూడగలిగే దయామయుడు బాబా అని అర్ధమవుతోంది కదా! నాకు మాత్రము సర్వమూ బాబానే.

నాకు 1991 సం॥ ఫిబ్రవరిలో మొట్టమొదటిసారిగా గుండెపోటు వచ్చింది. తరువాత నాకు గుండె ఆపరేషన్ చేయవలెను అని డాక్టర్లు చెప్పినారు. నేను హాస్పిటల్‌లో ఉండగా బాబా నా భార్య స్వప్నములో వచ్చి 'అమ్మా! నీ బొట్టు (అంటే పసుపు కుంకుమలు) పొయ్యేది కానీ పసుపు కుంకుమలు ఇదిగో అని చేతిలో కుంకుమను' ఇచ్చినారు. నేను హాస్పిటల్లో ఉండగా బాబాగారు ఒక భక్తునిచే నాకు ఆయన కప్పుకునే ఒక దుప్పటిని, కొన్ని మల్లెపువ్వులు మరియు బాబాగారి ఫోటోను కూడా ఇచ్చి పంపించినారు. ఆ దుప్పటి కప్పుకుని మల్లెపువ్వులను నా జేబులో బాబా ఫోటోకు పెట్టుకునేవాణ్ణి. 25-7-1991 రోజున నాకు ఆపరేషన్

జరిగి బాగానే వున్నాను. తరువాత కూడా నేను బాబాను దర్శించేవాడిని. బాబాగారు నన్ను ఆ విధముగా నా ఆరోగ్యము కాపాడినారు. నా ప్రాణము బాబాదే, నా దేహము బాబాదే నా ఊపిరి బాబాదే నా సర్వము బాబాదే అని నమ్ముచున్నాను. బాబా దయామయుడు. నా కుటుంబము ఇప్పటి వరకు(2004 సం వరకు అంటే 13 సంవత్సరములు) బాబా స్మరణతో గడుచుచున్నది.  నేను ఏ జన్మములో చేసుకున్న పుణ్యమో నాకు బాబా ఆ రోజునుండి ఇప్పటివరకు నన్ను కాపాడి కరుణించినారు.

**ఎమ్ మురళి, ఇం. నెం; 2-3-203/2/బి/1/32, తిరుమల నగర్, అంబర్‌పేట, Hyd**

నేను 1986 నుండి శ్రీ నాంపల్లిబాబా గార్ని దర్శిస్తుండేవాడ్ని. నాకు 1984లో వివాహమైంది. 1996 వరకు నాకు పిల్లలు లేరు. శ్రీ నాంపల్లిబాబాను ప్రార్ధించిన తర్వాత నాంపల్లిబాబా గారు స్వప్నదర్శనమిచ్చి 'ఎందుకు బాధపడతావు. చనిపోయిన మీ అమ్మను తిరిగి ఇస్తాను' అన్నారు. తరువాత కొంతకాలానికి నాకు అమ్మాయి పుట్టింది.నా కూతురు అచ్చం చనిపోయిన మా అమ్మ లాగానే వుంటుంది. తరువాత నాకు ఇద్దరు అబ్బాయిలు కల్గారు. 2వ అబ్బాయి పుట్టకముందే నా శ్రీమతికి బాబా కలలో కనిపించి నీకు పుట్టబోయే బిడ్డకి 'కుమారస్వామి అని పేరు పెట్టు' అన్నారు. అలానే చేశాము. శ్రీ నాంపల్లిబాబాకి కృతజ్ఞతగా ఒకటిన్నర ఎకరాల పొలం బాబాగారికి సమర్పించాను. ప్రతి సం॥ పండిన ధాన్యాన్ని బాబాగారి సన్నిధిలో అప్పగిస్తాను.

**ఆర్. దీపికా, ఇం.నెం:3-9-58/3/ఎ, శారదానగర్, రామాంతపూర్, Hyd-19**

నా వయస్సు 15 సంవత్సరాలు. చిన్నప్పటినుండి (2 సం॥ వయస్సు నుండి) శిరిడీ సాయిబాబా గుడికి వెళ్ళటం అలవాటు కానీ నాకు అంతగా భక్తి లేదు. నాకు 14 సంవత్సరాలు వున్నప్పుడు మా అమ్మగారు ఒక సాయిబాబా భక్తుని సలహా మేరకు సాయిబాబా పారాయణ మొదలుపెట్టారు. నాకు అద్భుతాల గూర్చి తెలుసుకోవడం చిన్నప్పటి నుండి అలవాటు. ఆ ఉద్దేశ్యంతోనే నేను కూడా మా అమ్మగారితో పాటు పారాయణ మొదలుపెట్టాను. నాంపల్లిబాబా భక్తుడు ఒక 4 సంవత్సరాలనుండి మా అమ్మగారికి తెలుసు కానీ ఎప్పుడూ అవధూతల గురించి చెప్పలేదు. జనవరి 16, 2004న (నేను పారాయణ మొదలుపెట్టిన 3 వ రోజు) నాంపల్లిబాబా భక్తుడు మా అమ్మగారిని కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో వున్న నాంపల్లిబాబా గారి దర్శనానికి తీసుకువెళ్ళారు.

అమ్మ దర్శనం చేసుకొని వచ్చి ఆ రోజు రాత్రి నాకు బాబా గురించి చెప్పింది. బాబాగారు బట్టలు వేసుకోరని, సిగరెట్ త్రాగుతారని విని మా అమ్మని ఎగతాళి చేస్తూ నవ్వాను. మా అమ్మగారు నన్ను తిట్టారు. మా అమ్మగారి మొదటి పారాయణ అయ్యే లోపల మా కుటుంబంలో అందరిని దర్శనం చేయించాలనుకుంది. కానీ మా కుటుంబంలోని వారికి ఇష్టం లేదు. మేమందరమూ కలిసి జనవరి 18, 2004 న నాంపల్లిబాబా గారి దర్శనానికి వెళ్ళాము. బాబాగారు నా కళ్ళలోకి చూసి అటు ప్రక్కకి తిరిగి పడుకున్నారు. ఆ తరువాత నా కళ్ళలో నీళ్ళు వచ్చాయి. అప్పుడు బాబాగారిని ఎలాగైనా దర్శనం చేసుకోవాలనిపించింది. రెండు గంటల వరకు బాబాగారు నిద్ర లేవలేదు. అప్పటికి సుమారు రాత్రి 8:30 గంటలు అయ్యింది. మేము దర్శనం చేసుకోకుండానే తిరిగి వెళ్ళాము. ఆ తరువాత ఒక నెలన్నర తరువాత కానీ నేను నాంపల్లిబాబా దర్శనం చేసుకోలేకపోయాను. కాకపోతే **నా ఆలోచనాశక్తి మాత్రం మారిపోయింది**. మార్చి 15, 2004 నాకు బాబా గారు కలలో దర్శనం యిచ్చారు. కలలో బాబా గుడి మంచం దగ్గర నేను ఏడుస్తూ కూర్చున్నాను. బాబాగారు నా రెండు చేతులను తన రెండు చేతులతో పట్టుకుని 'ఇప్పుడు నుంచి నీవు ఏడవకూడదు. నీ బాధలను నేను మోస్తాను' అని అన్నారు. తర్వాతరోజు బాబాగారి దర్శనానికి వెళ్ళాను. అప్పుడు నాకు బాబాగారి పాద దర్శనం అయ్యింది. అప్పటికి గత ఒక సంవత్సరము నుండి నాకు బాధలు వుండేవి. బాబా సన్నిధి చేరుకున్న తర్వాత నాకు దాదాపు 7 నెలలలో నా బాధలన్నీ తీరాయి.

జులై 2, 2004 గురు పౌర్ణమికి కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ రోజు బాబా గారి దర్శనానికి వెళ్ళలేకపోయాను. అప్పుడు మనస్సులో బాబాను 'ఎందుకు బాబా నన్ను రప్పించుకోలేదని' అన్నాను. ఆ రోజు రాత్రి కలలో బాబాగారు కఫ్నీ వేసుకొని దర్శనము ఇచ్చారు. అది నా భ్రమేనని అనుకున్నాను ఎందుకంటే బాబాగారు బట్టలు వేసుకోరు కనుక. 3 రోజుల తర్వాత మా అమ్మ స్నేహితుడు (నాంపల్లిబాబా భక్తుడు) మా యింటికి వచ్చారు. నేను ఆయనతో నాకు వచ్చిన కల గురించి చెప్పాను. ఆయన ఆశ్చర్యంతో 'అవును ఆ రోజు బాబా కఫ్నీ ధరించారు' అని చెప్పారు. అప్పుడు నాకు ఆశ్చర్యమేసింది. అప్పటినుండి నాంపల్లిబాబాను నా గురువుగా ఎంచుకున్నాను.

మొట్టమొదటిసారి బాబాను చూసిన వెంటనే బాబా యొక్క తేజస్సు, బాబా శాంతరూపము, బాబా యొక్క ఉగ్రరూపము నా మనస్సులో అలానే నిలిచిపోయాయి. ఒకనాటి స్వప్నంలో బాబా యొక్క రూపాన్ని ఫొటో తీయించి నలుగురికి పంచాలని కోరిక కలిగింది. కానీ బాబా అనుమతి లేనిదే మనము ఏ పని చేయలేము. తరువాత ఒకరోజు బాబా దగ్గరకు వెళ్ళి 'బాబాగారు నాకు ఇలా చేయాలని స్వప్న సందేశము వచ్చింది దానికి మీ అనుమతి కావాలి' అని ప్రార్థించి వచ్చాను. మరుసటి రోజు స్వప్నములో నేను చేసే ప్రయత్నం, నా కోరిక బాబానే తొందరలో తీరుస్తారు అనే నిదర్శనము ఇచ్చారు. తర్వాత 10 రోజులకే బాబాగారి ఫొటోలు పంచగలిగాను. బాబా ఫొటో యింట్లో వుంటే బాబా వున్నట్లే కదా! ఇలాంటి పవిత్ర కోరికలను బాబా ఎలా నెరవేరుస్తున్నారో చూడగలము.

**అయినవతి పార్వతి, లాలాగూడా తుకారాం గేటు, సికింద్రాబాద్, ఫోన్; 27015395**

నేను 2004 జులై 2వ తేదీ గురు పౌర్ణమి రోజు శ్రీ నాంపల్లిబాబా దర్శనం చేసుకున్నప్పుడు ఒక గురుబంధువు శ్రీనాంపల్లిబాబా ఫొటో వున్న క్యాలెండర్ ఇచ్చారు. ఫ్రేము కట్టించుకుందామని ఇంటిలోని అల్మారాలో వుంచాను. కానీ ఒక నాలుగు నెలలదాకా ఫొటో కట్టించలేదు. నవంబర్ 6 వ తేదీ రాత్రి 8:30 గంటలకు ఏదో ఒక వస్తువు కోసం వెతుకుతూ అల్మారా తీయగానే బాబా క్యాలెండర్ క్రింద పడింది. తీసి అల్మారాలో పెట్టాను. మరలా అవసరమై అల్మారా తీసేసరికి బాబా క్యాలెండర్ క్రింద పడింది. ఇలా మొత్తం 3సార్లు పడేసరికి నేను ఫొటోకి ఫ్రేము కట్టించలేదని బాబాకి కోపం వచ్చిందని భయమేసి నేను బాబాకు 'బాబా! మేము 3 రోజులలో శిరిడీ వెళదామనుకుంటున్నాము వచ్చిన తర్వాత ఫొటోకి ఫ్రేము కట్టిస్తాను, క్షమించండి' అని వేడుకున్నాను. తర్వాత రోజు ఉదయము ఒక సత్సంగ సభ్యుడు వచ్చి నిన్న రాత్రి బాబాగారు సమాధి చెందారని తెలిసి బాబాగారి దర్శనం చేసుకున్నాను. అక్కడ చెప్పిన దాన్ని బట్టి తెలిసింది ఏంటంటే రాత్రి ఏ సమయంలో 3 సార్లు బాబా క్యాలెండర్ క్రింద పడిందో అదే సమయంలో బాబాగారు 3సార్లు తూలినట్లుయి 3వ సారికి సమాధి చెందారని. ఆ విధంగా బాబా సమాధి అయ్యే సమయానికి తనను స్మరించుకునేటట్లు చేశారు. తర్వాత క్యాలెండర్లో వున్న బాబా ఫొటోకి ఫ్రేము కట్టించాను.

**పి. హరిమోహన్, ఎస్. నెం; 9-7-97, హనుమాన్ ట్రైలర్ కాంప్లెక్సు, మారుతి నగర్, హైదరాబాద్ - 79**

1. 1990 సంవత్సరములో కాంపిటీషన్ వల్ల మా మాంసం వ్యాపారం సరిగా జరిగేది కాదు. ఒకరోజు నేను నాంపల్లిబాబాగారి దర్శనానికి వెళ్ళి 'బాబా! వ్యాపారం సరిగా జరగడం లేదు, ఏం చేసేది బాబా' అని చెప్పుకొని కళ్ళు మూసుకొని కూర్చున్నాను. అప్పుడు బాబాగారు 'వెళ్ళు' అన్నారు. వారు ఆజ్ఞాపించినట్లే షాపుకు వెళ్ళాను. ఆనాటి నుండి ఈనాటి వరకు వారి దయ వలన వ్యాపారం చక్కగా జరుగుతోంది.

2. 1992 సంవత్సరంలో నేను శ్రీ నాంపల్లిబాబాగారి ఆశీస్సులతో శ్రీ అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్ళాను. అందరికి వస్త్రదీక్ష వుండి ప్రత్యేకరంగు వస్త్రాలు, తలపై ఇరుముడులు వున్నాయి. కానీ నాకు వస్త్రములు లేవు,ఇరుముడి లేదు. అక్కడ అందరినీ దర్శనానికి పోనీయకుండా, దీక్షావస్త్రాలు ధరించినవారినే పంపిస్తున్నారు. అదేమి చిత్రమోగానీ నన్ను మాత్రం ఎవరూ ఆటంకపరచకుండా పంపేశారు. శ్రీ నాంపల్లిబాబా వారి ఆశీస్సులు ఎంత అమోఘమైనవో తెలిసి వచ్చాయి.

3. 2000 సంవత్సరంలో నా భార్య గౌలిపురాలో శ్రీ బాబాగారి ముందు ధ్యానంలో కూర్చోనుంది. శ్రీ బాబాగారు అతి పెద్ద శరీరంతో దర్శనమిచ్చినప్పుడు వారి నోటిలో ఈ భూగోళమంతా అతి పెద్ద బంతివలె దర్శనమైంది.ఆ మహనీయుని అంచనా వేయడం ఎంతటివారికైనా సాధ్యపడదు.

4. శ్రీ నాంపల్లిబాబాగారు నవంబరు 6వ తేదీ 2004 సంవత్సరంలో సమాధి చెందినారు. 10-1-2005న రోజు రాత్రి కలలో నేను తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో వున్నాను. అప్పుడు బాబాగారు శ్రీ వెంకటేశ్వరస్వామి గర్భగుడిలో నుండి వస్తున్నట్లుగా దర్శనం ఇచ్చినారు. బాబాపై విశ్వాసం కుదిరి బాబా సాక్షాత్తు భగవత్ స్వరూపుడు అని బాగా నమ్మకం ఏర్పడింది.

**సురేఖ, 1-8-505, ప్రకాష్‌నగర్, హైదరాబాద్**

1. నాకు 40 సంవత్సరాలు. నాకు 25, 26 సంవత్సరముల వరకు నా ఆలోచనలు చాలా స్వచ్ఛంగా వుండేవి. దాదాపు 15

సంవత్సరములనుండి నేనొక మానసిక వ్యాధితో బాధపడుతున్నాను. నా ప్రమేయం లేకుండానే నాకు చెడ్డ ఆలోచనలు వచ్చేవి. భగవంతుడ్ని కూడా చాలాసార్లు నిందించేదాన్ని. తర్వాత గిల్టీగా ఫీల్ అయ్యేదాన్ని. ఎంత కంట్రోల్ చేసుకున్నా నా ఆలోచనలను కంట్రోల్ చేసుకోలేక పోయేదాన్ని. నా నుండి నేను పారిపోయేదాన్ని. భగవంతుడ్ని మనస్ఫూర్తిగా ప్రార్థించలేకపోయేదాన్ని. భగవంతుడు నాకు అన్నీ యిచ్చి ఈ లోపం ఎందుకు పెట్టాడని బాధపడేదాన్ని. నా ఫ్రెండ్ నాంపల్లిబాబా గురించి చెప్పినప్పుడు ఏ మూలో వారిని దర్శిస్తే నా వ్యాధి తగ్గుతుందని ఆశపడ్డాను. కానీ వారి ముందు ఎలాంటి ఆలోచనలు వస్తాయోనని బాబా ముందరకి రావడానికి భయపడ్డాను. నాకు మొదటిసారి వారిని దర్శించినప్పుడు చాలా పాజిటివ్ వైబ్రేషన్స్ వచ్చాయి. ఆ రోజంతా ట్రాన్స్‌లో వున్నాను. తర్వాత రెండుసార్లు వారి స్వప్నదర్శనం లభించింది నాకు. ఒకరోజు నా చెడ్డ ఆలోచనలు భరించలేక బాబాను ప్రార్థించాను. ఆ రోజునుండి విచిత్రంగా చెడ్డ ఆలోచనలు రావడం మానేశాయి. బాబా దయతో ఇప్పుడు నేను ప్రశాంతంగా జీవిస్తున్నాను.

2. మా ఇంట్లో అందరమూ సాయిబాబా భక్తులము. సాయి భక్తురాలైన నేను నాంపల్లిబాబాను ప్రార్థించడం సరైనది కాదేమోనని సందేహం వుండేది నాకు. 2003 మార్చిలో ఒకరోజు కలలో 'శిరిడీ ద్వారకామయిలో నీటికుండ ప్రక్కన నాంపల్లిబాబా కూర్చొని దోసిల్లతో నీరు త్రాగుతున్నారు. నేను వెళ్ళి చేయి చాపితే నా చేతిలో కొన్ని నీళ్ళు తీర్థంగా ఇచ్చారు' అనుభవమైంది. ఈవిధంగా శిరిడీ సాయిబాబా, నాంపల్లిబాబా ఇద్దరూ ఒకటే అని నా సందేహాన్ని తీర్చారు.









## మా యితర ప్రచురణలు

| | |
|---|---|
| 1 అవధూత లీల - (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) | 40 రూ॥ |
| 2 అవధూత బోధామృతం - శ్రీవారి బోధలు | 15 రూ॥ |
| 3 శ్రీ స్వామి సన్నిధి - శ్రీ వారితో వారి సేవకుల అనుభవాలు | 15 రూ॥ |
| 4 అవధూత లీల (ఇంగ్లీషు) | 30 రూ॥ |
| 5 భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) | 5 రూ॥ |
| 6 వార్తాలాపము | 150 రూ॥ |
| 7 అవధూత లీల (తమిళం) | 50 రూ॥ |
| 8 శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) | 5 రూ॥ |
| 9 జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ॥ |
| 10 శ్రీ ధునివాలాదాదా చరిత్ర | 15 రూ॥ |
| 11 శ్రీ వెంకయ్యస్వామి పూజ | 1 రూ॥ |
| 12 వెన్నెలపువ్వులు - శ్రీ వెంకయ్యస్వామి వారి దివ్యత్వం | 1 రూ॥ |
| 13 సాయికృప - కలిచేడు భక్తుల అనుభవాలు | 1 రూ॥ |
| 14 దివ్యలీలలు | 1 రూ॥ |
| 15 బోధ యజ్ఞాయనమ: | 1 రూ॥ |
| 16 ధర్మమూర్తి | 1 రూ॥ |
| 17 పిలిచిన పలికే దైవం | 1 రూ॥ |
| 18 శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము | 12 రూ॥ |
| 19 శ్రీ స్వామికృప | 1 రూ॥ |
| 20 మౌనబోధ | 1 రూ॥ |
| 21 గురుస్మృతి | 7 రూ॥ |
| 22 శ్రీ బూర్లె రంగన్నబాబుగారి దివ్యచరితము | 6 రూ॥ |
| 23 శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర | 4 రూ॥ |
| 24 శ్రీ పూండీ స్వామి వారి దివ్యచరిత్ర | 2 రూ॥ |
| 25 శ్రీ యర్ర దర్గాస్వామి వారి దివ్య చరిత్ర | 5 రూ॥ |
| 26 నమ్మలేని పచ్చి నత్యాలు | 1 రూ॥ |
| 27 శ్రీ స్వామివారి భజన పాటలు | 1 రూ॥ |
| 28 స్వామి అనుగ్రహం | 2 రూ॥ |
| 29 నరోపాగారి జీవిత చరిత్ర | 2 రూ॥ |

### ఒక రూపాయి పుస్తకములు

1. మాష్టరుగారి సత్సంగము
2. శ్రీ మాష్టారి మంచి మాట
3. అమృత వాక్కులు
4. మృత్యువుపై ఘన విజయము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమ
7. సర్వ సమర్థుడు
8. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు
9. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర
10. శ్రీ వెంకయ్యస్వామి (హిందీ)
11. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టారు గారు
13. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం

ప్రతులకు వ్రాయండి - శ్రీసాయి మాస్టరు సేవా ట్రస్టు,
గొలగమూడి, నెల్లూరు జిల్లా 524 321